జనవరి
2021

177

సంపుటి : 15 సంచిక : 7 వెల రు. 10/-

## ఈ సంచికలో........

వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు -4

ప్రాంతీయ పార్టీలు : ముందున్న సవాళ్లు

సహకార' ఫెడరలిజం అంటూనే రాష్ట్రాల హక్కుల హరింపు

ఆర్యులు : దస్యులు, దాసులు, చాతుర్వర్ణ వ్యవస్థ ఆవిర్భావం

వ్యవసాయ చట్టాలతో రైతుకు మరణశాసనం

పట్టణ సంస్కరణలు ప్రజావ్యతిరేక అంశాలు

శ్రామిక వర్గ మేధావి ఆంటోనియో గ్రాంస్కీ

బి.జె.పి మతోన్మాద వ్యతిరేక విశాల ఐక్యతను నిర్మించే అవకాశం పెరిగింది

# వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు - 4

"ఆరు వారాలలోపు కమ్యూనిస్టులను, హైదరాబాద్ సంస్థానం నుండి తుడిచి పెట్టేస్తామని" జనరల్ జె. ఎం చౌదరి ప్రగల్భాలు పలికాడు. అందుకనుగుణంగా అనధికారిక అంచనాల ప్రకారం భారత ప్రభుత్వం 1947–48 లో కాశ్మీర్ సమస్యపై పాకిస్థాన్‌తో యుద్ధానికి కేటాయించినంత డబ్బును హైదరాబాద్ విమోచనకు కూడా కేటాయించింది. అయినప్పటికీ అది కమ్యూనిస్టులను తెలంగాణ ప్రాంతం నుంచి 'తుడిచి పెట్టలేక' పోయింది. ఆ పోరాటానికి సారధ్యం వహించిన కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య తన అసాధారణ గ్రంథం, 'వీర తెలంగాణ విప్లవ పోరాట చరిత్ర, గుణపాఠాలు' లో ఆ పోరాటాన్ని గురించి వివరించారు. అందులోని కొన్ని భాగాలను ఈ దిగువన ఇస్తున్నాము:

" భారతదేశంలో ప్రజాతంత్ర విప్లవం సాధించడానికి, భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ మౌలిక సైద్ధాంతిక సమస్యలు, వ్యూహాలకు, ఎత్తుగడలకు సంబంధించిన అంశాలకు శాస్త్రీయమైన సమాధానాలను, ఆచరణాత్మక పరిష్కారాలను చూయించటం తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాధించినవాటిలో అత్యంత ముఖ్యమైనది".

"ప్రజాతంత్ర విప్లవంలో రైతాంగం పాత్ర, పాక్షిక ప్రతిఘటన ప్రాముఖ్యత, గ్రామీణ విప్లవ కేంద్రాలు, రైతాంగంలో వర్గ విభజనపై నిర్దిష్ట విశ్లేషణ, రైతాంగంలోని వివిధ తరగతులు విప్లవంలో ఏ పాత్రను పోషిస్తాయనే అంశం, భారతదేశ విప్లవ దృక్పథం, విప్లవంలో కార్మికవర్గం, పట్టణాలు పోషించే ప్రత్యేకమైన పాత్ర; కార్మికవర్గ రాజ్యం యొక్క స్పష్టమైన అర్థం, ప్రాముఖ్యత; జనాభాలో ఒక్క శాతం కూడా కార్మికవర్గం లేని, వెనకబడిన మనదేశం లాంటి దేశాలలో కార్మికవర్గ నాయకత్వ పాత్ర, దానిని సాధించడంలో కమ్యూనిస్టు పార్టీ పాత్ర, మొదలయిన అంశాలన్నీ పార్టీలో తీవ్రమైన అంతర్గత పోరాటానికి దారితీశాయి. పై ప్రశ్నలలో ఎక్కువ భాగానికి సంతృప్తికరమైన సమాధానాలను అన్వేషించటం ద్వారా పార్టీ సరైన రాజకీయ పంథాను అనుసరించింది.

"పోరాటం జరుగుతున్న కాలంలో, ముఖ్యంగా చివరి రెండు సంవత్సరాలలో, కమ్యూనిస్టు పార్టీ పై నుంచి కింది వరకు రెండు రకాల ఆలోచనలతో, పూర్తిగా శత్రుత్వ వైఖరితో విడివడి ఉన్నదని ఈ సందర్భంలో చెప్పుకోవడం అవసరం. ఒక భాగం పోరాటాన్ని సమర్థిస్తూ దాని వలన పొందిన విజయాలను కాపాడుకోవాలనే వారు, రెండో భాగం పోరాటాన్ని తీవ్రవాదంగా పరిగణిస్తూ, దానిని ఖండించారు. పోరాటాన్ని వ్యతిరేకించే వారు బహిరంగంగా ప్రచార మాధ్యమాలలో తమ భావాలను వెళ్ళబుచ్చడం మొదలు పెట్టారు. దీనితో పోరాటాన్ని, దానికి నాయకత్వం వహిస్తున్న కమ్యూనిస్టు పార్టీని బలహీనపరచటానికి ప్రయత్నిస్తున్న శత్రువుల చేతికి ఆయుధం అందించినట్లయింది. ఈ రకమైన పదునైన రాజకీయ, సైద్ధాంతిక విభేధాలు దేశవ్యాప్తంగా ఉన్నా, వీరోచిత రైతాంగ పోరాటం ప్రత్యక్షంగా ఉవ్వెత్తున ఎగసిపడ్డ ప్రాంతమయిన విశాలాంధ్ర యూనిట్లో అవి మరింత తీవ్రంగా ఉండేవి. 1951 అక్టోబర్‌లో తెలంగాణా సాయుధ ప్రతిఘటనను ఉపసంహరించటం వలన పార్టీలో సాధించిన ఐక్యత కేవలం తాత్కాలికం, పైపై ఐక్యతేనని, నిజానికి విబేధాలు మరింత పెరిగి రెండు పరస్పర విరుద్ధమైన రాజకీయ ధోరణులకు దారి తీశాయని తరువాత జరిగిన చరిత్ర స్పష్టం చేస్తున్నది. 1950–51లో విశాలాంధ్ర కమిటిలో ఏర్పడిన విబేధాల ఫలితంగా వ్యక్తమైన చీలిక 1962–63 లో పార్టీ చీలిపోయినపుడు అదే విభజనను ప్రతిబింబించింది. వివిధ కారణాలతో తమ రాజకీయ విధేయతను మార్చుకున్న కొద్దిమందిని మినహాయించి, తెలంగాణ పోరాటాన్ని వ్యతిరేకించిన వారందరు మితవాద సంస్కరణవాద కమ్యూనిస్టు పార్టీలో ఉన్నారు. చివరివరకు తెలంగాణా పోరాటాన్ని సమర్థించిన వారిలో ఎక్కువమంది భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)తో ఉన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని అధ్యయనం చేయాలనుకొనే వారెవరైనా తెలంగాణ పోరాటం సందర్భంగా తలెత్తిన విబేధాలను, తర్వాత పార్టీలో అంతర్గతంగా వివిధ అంశాలపై జరిగిన తీవ్ర చర్చలను అర్థం చేసుకొంటేనే 1962–63లో పార్టీ విభజనకు దారితీసిన అంశాలను అర్థం చేసుకోవటం సాధ్యమౌతుంది.

"ఈ వీరోచిత రైతాంగ పోరాటాన్ని సంక్షిప్తంగా చెప్పుకోవాలంటే, ఇది తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలలోని రైతాంగం అనేక త్యాగాలు చేసి పోరాడిన ఫలితం. ఈ ప్రజా పోరాటానికి విశాలాంధ్ర కమ్యూనిస్టు కమిటి నాయకత్వం వహించింది. ఈ పోరాటంలో 4,000 మంది కమ్యూనిస్టులు, రైతులు ప్రాణత్యాగం చేశారు; 10,000 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు, ప్రజాపోరాట యోధులు 3 నుంచి 4 ఏళ్ల పాటు డిటెన్షన్ క్యాంపులలో మగ్గారు. 50,000 మంది ప్రజలను పోలీసు, మిలిటరీ క్యాంపులకు పదేపదే పిలిపిస్తూ కొట్టి, వివిధ రకాలుగా హింసలు పెట్టి నెలల తరబడి వేధించారు. వేలాది గ్రామాలలోని లక్షలాది ప్రజల మీద పోలీసులు, మిలటరీ వారు దాడులు చేశారు; ఆ దాడులలో ప్రజలు లక్షల రూపాయల విలువైన తమ ఆస్తులను పోగొట్టుకున్నారు; లాఠీ దెబ్బలు తిన్నారు; వేలాదిమంది మహిళల మానాలు హరించబడ్డాయి; ఎన్నో రకాల అవమానాలు భరించారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ప్రాంతమంతా అయిదేళ్ల పాటు పోలీసు, మిలటరీ పాశవిక దౌర్జన్యాలకు నిలయంగా మారింది; మొదట నిజాం పోలీసులు, ఆ తరువాత భారత ప్రభుత్వం, హైదరాబాద్ సంస్థాన సైన్యం చేతిలో ప్రజలు హత్యలు, హింసలకు గురయ్యారు. పోలీసు చర్యల తరువాత ఉద్యమాన్ని హింసాత్మకంగా అణచివేయడానికి, చెల్లాచెదరైన భూస్వామ్య వ్యవస్థను పునఃస్థాపితం చేయడానికి ఆ ప్రాంతంలో 50,000 మంది సైనికులను మోహరించారు.

"అయితే నాణానికి రెండో వైపు చూస్తే ఈ పోరాటంలో ఎన్నో అద్భుతమైన విజయాలు కూడా దక్కాయి. ఉవ్వెత్తున ఎగసిపడ్డ రైతాంగ పోరాటమే దానికి కారణం. పోరాటకాలంలో దాదాపు 30,00,000 మంది ప్రజలు,

(మిగతా 35వ పేజీలో)

## ఈ సంచికలో...


1. వీర తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు -4 ........ 2

2. ప్రాంతీయ పార్టీలు : ముందున్న సవాళ్లు
ప్రకాశ్ కరత్......... 4

3. సహకార' ఫెడరలిజం అంటూనే రాష్ట్రాల హక్కుల హరింపు
బి తులసీదాస్.......... 9

4. ఆర్యులు : దస్యులు, దాసులు, చాతుర్వర్ణ వ్యవస్థ ఆవిర్భావం
ఎంవిఎస్ శర్మ..... 11

5. వ్యవసాయ చట్టాలతో రైతుకు మరణశాసనం
వి. శ్రీనివాసరావు........14

6. పట్టణ సంస్కరణలు ప్రజావ్యతిరేక అంశాలు
డా॥ బి. గంగారావు.............23

7. శ్రామిక వర్గ మేధావి ఆంటోనియో గ్రాంస్కీ
తెలకపల్లి రవి........ 29

8. ప్రాంతీయ పార్టీల అవకాశవాదాన్ని అధిగమించి బి.జె.పి మతోన్మాద వ్యతిరేక విశాల ఐక్యతను నిర్మించే అవకాశం పెరిగింది
బివి రాఘవులు..........33



**సంపాదకుడు:**
**ఎస్. వెంకట్రావు**

**సంపాదక వర్గం:**
**పాటూరు రామయ్య**
**బి.వి. రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్. వీరయ్య**
**తెలకపల్లి రవి**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున
ప్రచురణ కర్త, ముద్రాపకుడు:**బి.వి.రాఘవులు**
సంపాదకుడు : ఎస్. వెంకట్రావు
**ముద్రణ:** ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
**ఫోన్: ఎడిటర్ : 9490099333**
**మేనేజర్:కె.హరికిషోర్:9490098977, 9494101091**
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at : cpim.org


# వ్యవ'సాయం'

భారతీయ వ్యసాయాన్ని విదేశీ, స్వదేశీ కార్పొరేట్ రాబందులకు ఆహారంగా వేయడానికి ఢిల్లీలో నరేంద్ర మోడీ ప్రభుత్వం చట్టాలు చేయగా ఆ చట్టాలను రద్దు చేసి వ్యవసాయాన్ని, వ్యవసాయదారులను రక్షించాలని భారత దేశ రైతాంగం కోరుతోంది. ఢిల్లీ పీఠంమీద బిజెపి పాలకులు, వారి చుట్టూ మోహరించి దేశ రైతాంగం...మొత్తం మీద నేడు దేశ రాజధానిలో తీవ్రస్థాయిలో ఉద్యమం సాగుతోంది. వ్యవ'సాయం' కోసమే చట్టాలు చేశామని ప్రభుత్వం, కార్పొరేట్ల సాయం కోసమే ఈ చట్టాలని రైతాంగం చేస్తున్న వాదనల ప్రాతిపదికగా దేశంలోని మేధావులు రెండుగా విడిపోయారు. మీడియాలో ఢిల్లీ పోరాటం ప్రతిఫలిస్తోంది. వాస్తవానికి మన దేశ ఆహార స్వయం సమృద్ధిని, దానిలో కీలకపాత్ర పోషించే ప్రభుత్వ ధాన్యసేకరణ విధానాన్ని, దానిపై ఆధారపడి జరిగే ప్రజాపంపిణీని కాపాడేందుకు సాగుతున్న పోరాటం ఇది.

దీర్ఘకాలంగా భారతీయ వ్యవసాయరంగం నిర్లక్ష్యానికి గురైందనీ అందులోకి పెట్టుబడులు పెరగడం లేదనీ అందువల్ల ఉత్పాదకత పెరగడం లేదనీ, తాము తెచ్చిన చట్టాలు ఈ సమస్యలన్నిటికీ పరిష్కారం చూపిస్తాయని బిజెపి ప్రభుత్వం వాదిస్తోంది. కానీ కోవిడ్ మహమ్మారిని అడ్డుపెట్టుకుని, ప్రజల మధ్య ఎటువంటి చర్చ లేకుండా, పార్లమెంటులో అప్రజాస్వామికంగా ప్రతిపక్షాల గొంతునొక్కి తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాల్లో దేశ వ్యవసాయ ఉత్పాదకతను పెంచే ఒక్క అంశం కూడా లేదు. రైతులకు గిట్టుబాటు ధరలకు గ్యారంటీ కల్పించి, వారి ఆదాయాలు పెంచే నిబంధనలేవీ ఇందులో లేవు. రైతులు ఉత్పత్తి చేసిన పంటలను ఇప్పుడున్న ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ కమిటీల (మండీల) ద్వారా కాకుండా ప్రయివేటు మార్కెట్ల ద్వారా వినియోగదారులకు అంటే ప్రజలకు చేర్చడమే ఈ చట్టాల సారాంశం. గ్రామాల్లో చిన్న సన్నకారు రైతుల నుండి వ్యాపారులు, వారి నుండి వ్యవసాయ మార్కెట్లలో కమిషన్ వ్యాపారులు, వారి నుండి హోల్‌సేల్ డీలర్లు, వారి నుండి రిటైల్ వ్యాపారుల ద్వారా ప్రజలకు చేరే సరఫరా గొలుసును తెగ్గొట్టి అంబానీ, ఆదానీ వంటి దేశీయ కార్పొరేట్లు, అమెజాన్ వంటి విదేశీ కార్పొరేట్లు తమ ఏజెంట్ల ద్వారా నేరుగా రైతులనుండి పంటలు కొనుగోలు చేసి తమ రిటైల్ గొలుసు షాపుల ద్వారా వినియోగదారులను అందజేయడానికి మోడీ ప్రభుత్వం తెచ్చిన వ్యవసాయ చట్టాలు ఉపయోగపడతాయి. మధ్య దళారులకు ఈ చట్టాలు వ్యతిరేకం అని బిజెపి నేతలు చెబుతున్నారు. అంటే రైతులనుండి పంటలు కొనుగోలు చేసే చిన్న చిన్న వ్యాపారులను ఎగరగొట్టి నేరుగా కార్పొరేట్లకు ప్రయోజనం కల్పిస్తారన్నమాట. అందువల్ల ఈ చట్టాలతో లక్షలాది చిన్న వ్యాపారులు దెబ్బతినడమే కాదు కార్పొరేట్ కబంధ హస్తాల్లో చిక్కుకుని ఇటు రైతులు, అటు వినియోగ దారులు కూడా నష్టపోతారు. చివరికి స్వదేశీ, విదేశీ కార్పొరేట్లు మాత్రమే లాభపడతారు. ఈ వాస్తవాన్ని కప్పిపుచ్చడానికే మోడీ ప్రభుత్వం, అంబానీ, ఆదానీల కార్పొరేట్ మీడియా నానా తంటాలు పడుతోంది. కానీ ఈ దగాకోరు వాదనలిన్నిటినీ రైతాంగం, వారి తరఫున నిలిచిన మేధావి వర్గం ఎప్పటికప్పుడు తిప్పి కొడుతోంది.

బిజెపి తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలు బాగా లేవు అంటే అర్థం నిన్నటి వరకు వారి పరిస్థితి బాగుందని కాదు. దేశంలో వ్యవసాయ సంక్షోభం రోజురోజుకూ తీవ్రం అవుతున్న విషయం వేలాదిగా జరుగుతున్న రైతుల ఆత్మహత్యలే చెబుతున్నాయి. దీనికి పరిష్కారం పేరుతో బిజెపి ప్రభుత్వం, దేశ పాలక వర్గాలు ముందుకు తెచ్చిన చట్టాలు రోగాన్ని నయం చేయకపోగా మరింత విషమం చేస్తాయి. మరి పరిష్కారం ఏమిటి? నేడు కేరళ చూపిస్తున్న ప్రత్యామ్నాయమే దీనికి పరిష్కారం. ఆహార పంటలకు స్వామినాథన్ కమిషన్ చెప్పినట్లు గిట్టుబాటు ధరలు ఇవ్వడమే కాదు, రాష్ట్రంలో చాలా ఎక్కువగా పండించే వాణిజ్య పంటలకు చివరికి 16 రకాల కాయగూరలకు కూడా కేరళలోని వామపక్ష ప్రభుత్వం గిట్టు బాటు ధరలు కల్పిస్తోంది. అందువల్ల రైతాంగానికి ఆదాయాల గ్యారంటీ లభిస్తోంది. మరోవైపు మధ్య దళారీ వ్యవస్థ స్థానంలో రైతు సహకార సంస్థలు, పంచాయితీ రాజ్ సంస్థలు, మహిళా సాధికార సంస్థలను పంటల సేకరణ, సరఫరాలో ప్రధాన స్థానం కల్పించింది. ఆ విధంగ బిజెపి చెబుతున్న కార్పొరేట్ మార్గం కాకండా ప్రజా సహకార మార్గాన్ని కేరళ అనుసరిస్తోంది. పోరాటం చేస్తున్న రైతాంగం కోరుతున్న ప్రత్యామ్నాయాన్ని ఇదే.


**చందా వివరాలు**
విడిపత్రిక: **రూ.10,** సంవత్సర చందా:**రూ.100,** పోస్టు ద్వారా **రూ. 120**

పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు.
లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి.
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చిరునామా**
**మేనేజర్,**
**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక),**
**ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి,**
**గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**ఈ మాసం ముఖ్యాంశం**

# ప్రాంతీయ పార్టీలు : ముందున్న సవాళ్లు

**ప్రకాశ్ కరత్**



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

**(మార్క్సిస్టు సిద్ధాంత వేత్త మాకినేని బసవపున్నయ్య 106వ జయంతి సందర్భంగా విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం "ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీల ముందున్న సవాళ్లు" అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్ చేసిన స్మారకో పన్యాసం పూర్తి పాఠాన్ని దిగువ ఇస్తున్నాం - సంపాదకుడు)**

**భా**రత దేశంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ప్రాంతీయ పార్టీల ముందున్న సవాళ్లు అన్న అంశంపై నన్ను ప్రసంగించమని చెప్పారు. నేను మన దేశంలో ప్రాంతీయ పార్టీల చారిత్రక పరిణామాన్ని గురించి, వాటి వర్గ లక్షణం గురించీ, గత కొన్ని దశాబ్దాలుగా భాతర దేశ రాజకీయాల్లో అవి నిర్వహించిన పాత్ర గురించీ మార్క్సిస్టు కోణం నుండి విశ్లేషించడానికి ప్రయత్నిస్తాను. అదే విధంగా ఈ రోజున దేశంలో సాగుతున్న బిజెపి ఏక పార్టీ పాలన, మన సమాజంలో పెరుగుతున్న హిందూత్వ శక్తుల ఆధిపత్య పరిస్థితుల్లో ఈ ప్రాంతీయ పార్టీలు ఎదుర్కొంటున్న సవాళ్లను గురించి కూడా వివరిస్తాను.

**ప్రాంతీయ పార్టీల చరిత్ర**

భారత దేశంలో 1960వ దశకంలో ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం మొదలైంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి దేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన జాతీయ రాజకీయ పార్టీగా ఉన్నది. అది కేంద్రంలో పాలక పార్టీగా ఉంది. 1952 సార్వత్రిక ఎన్నికల తరువాత అది దేశంలో నాడు ఉన్న అన్ని రాష్ట్రాల్లోనూ అధికార పార్టీగా ఉంది. ఈ ఏకపార్టీ ఆధిపత్యం దాదాపు రెండు దశాబ్దాలు కొనసాగింది. అధికారంపై కాంగ్రెస్ గుత్తాధిపత్యానికి 1967లో జరిగిన 4వ సార్వత్రిక ఎన్నికల్లో మొట్టమొదటి దెబ్బ తగిలింది. అప్పుడు పార్లమెంటు ఎన్నికలతోపాటు రాష్ట్ర శాసన సభలకు కూడా ఏక కాలంలో ఎన్నికలు జరిగేవి. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 9 రాష్ట్రాల్లో ఓడిపోయింది. ఈ 9 రాష్ట్రాల్లోనూ కాంగ్రెసేతర ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఈ ఎన్నికల్లోనే అనేక ప్రాంతీయ పార్టీలు ముందుకొచ్చాయి. కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు స్వతంత్రంగా ప్రభుత్వాలు ఏర్పాటు చేయగా కొన్ని రాష్ట్రాల్లో ఏర్పడిన కాంగ్రెసేతర సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వాములైనాయి. ఆ విధంగా భారత దేశ రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీలు ఒక ప్రధాన శక్తిగా ఆవిర్భవించడం అనేది 1967 ఎన్నికల్లో జరిగింది. దాంతో భారత దేశ రాజకీయ చరిత్రలో మొట్టమొదటి సారిగా ఏకపార్టీ ఆధిపత్యానికి గండి పడింది. అప్పటినుండి మన రాజకీయ చరిత్రలో విభిన్న సందర్భాల్లో ప్రాంతీయ పార్టీలు ముఖ్యమైన పాత్ర వహించడం ప్రారంభించాయి. కేవలం ఎన్నికల రాజకీయాల్లోనే కాకుండా మన దేశ ప్రజాతంత్ర రాజకీయ వ్యవస్థను తీర్చిదిద్దడంలోనూ, కొన్ని పరిమితులతోనే ఉన్న మన ఫెడరల్ వ్యవస్థను, కేంద్ర రాష్ట్ర సంబంధాలను తీర్చిదిద్దడంలోనూ ముఖ్యమైన పాత్ర నిర్వహించాయి. అంతే కాకుండా భాష, సంస్కృతి, సామాజిక, రాజకీయ రంగాల్లో మన దేశంలో నెలకొన్న భిన్నత్వాన్ని వ్యక్తం చేయడంలో కూడా అవి ముఖ్య భూమిక పోషించాయి.

అయితే 1960, 70, 80 దశకాల్లో ప్రాంతీయ పార్టీలు పోషించిన పాత్ర ఆ తరువాత కాలంలో ఎలా మార్పు చెందుతూ వచ్చిందో అర్థం చేసుకుంటేనే మనం నేడు వాటి పరిస్థితిని అర్థం చేసుకోగలం.

భారత రాజకీయాల్లో ప్రాంతీయ పార్టీల ఆవిర్భావం తొలి నాళ్లలో భారత దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధితోపాటే జరిగింది. దేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత బడా బూర్జువా వర్గ నాయకత్వంలోని బూర్జువా-భూస్వామ్య పాలక వర్గాలు అధికారంపై ఆధిపత్యం సాధించాయి. ఈ బడా బూర్జువా-భూస్వామ్య పాలక వర్గాల ప్రధాన ప్రతినిధిగా కాంగ్రెస్ పార్టీ పనిచేసింది. అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని పెట్టుబడిదారీ బాటలో అభివృద్ధి చేయడానికి ప్రయత్నించింది. ఈ పెట్టుబడిదారీ అభివృద్ధి పంథా వల్ల రెండు ఫలితాలు వచ్చాయి. మొదటిది, గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చెందింది. దేశ వ్యాపిత బడా పెట్టుబడిదారులు అభివృద్ధి చెందారు. రెండవది వివిధ ప్రాంతాల్లో, వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పెట్టుబదిదారీ అభివృద్ధి జరిగింది. దాని వల్ల ప్రాంతీయ పెట్టుబడిదారులు అభివృద్ధి చెందారు. ఈ ప్రాంతీయ పెట్టుబడిదారులు అఖిలభారత గుత్త పెట్టుబడిదారులు కారు. వారు ఆయా ప్రాంతాలకు పరిమితమైన మధ్యతరగతి, చిన్న పెట్టుబడిదారులు. 1950వ దశకంలో దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయి. ఈ భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం జరిగిన ఉద్యమాలకు అనేక ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీలు, ప్రజాతంత్ర శక్తులు నాయకత్వం వహించిన సంగతి మనకు తెలుసు. విశాలాంధ్ర, ఐక్య కేరళ, సంయుక్త మహారాష్ట్ర ఉద్యమాలు, గుజరాత్, కర్నాటక తదితర రాష్ట్రాలో ఇటువంటి ఉద్యమాలు జరిగాయి. ఈ భాషా ప్రయుక్త జాతి రాజ్యాలన్నిటిలోనూ కొత్త ప్రాంతీయ పెట్టుబడిదారీ వర్గాలు ఏర్పడ్డాయి. వీళ్లు గుత్తేతర పెట్టుబడిదారీ వర్గానికి చెందిన వారు. ఆనాడు అంటే 1960, 70 దశకాల్లో మనం 20 బడా గుత్త పారిశ్రామిక కుటుంబాల గురించి చెప్పుకునే వాళ్లం. టాటాలు, బిర్లాలు వంటి పారిశ్రామిక గుత్త సంస్థలుండేవి. ఆ విధంగా బడా బూర్జువా వర్గానికీ, ప్రధానంగా భాషా ప్రయుక్త రాష్ట్రాల్లోని ప్రాంతీయ లక్షణం గల బడా-ఏతర బూర్జువా వర్గానికీ మధ్య వైరుధ్యం ఉండేది. ఈ వైరుధ్యమే ప్రాంతీయ పార్టీల ఆవిర్భావానికి కారణమైంది.

ప్రాంతీయ పార్టీలు ఎక్కడ అభివృద్ధి చెందినా అవి ప్రాంతీయ బూర్జువాల ప్రయోజనాలు, ఆకాంక్షలకు ప్రాతినిధ్యం వహించేవి. ప్రాంతీయ బూర్జువా వర్గంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన భూస్వాములు, ధనిక రైతులు కూడా భాగంగా ఉండేవారు. ఎందుకంటే గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెట్టుబడిదారీ అభివృద్ధి జరగడం ప్రారంభించింది కనుక. ఈ ప్రాంతీయ పార్టీలు భాషా రాష్ట్రాల్లోని ప్రజల ఆకాంక్షలకు కూడా కొంతవరకు ప్రాతినిధ్యం వహించేవి.

> ❝ దేశంలోని పెట్టుబడి కొద్దిపాటి అఖిలభారత బడా బూర్జువాల చేతు ల్లో కేంద్రీకృతం అయ్యేందుకు ప్రభుత్వ విధానా లు దోహదపడ్డాయి. ఇలా బడా బూర్జువా వర్గానికీ ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ బూర్జువా వర్గం, భూస్వామ్య వర్గాలకు మధ్య తలెత్తిన వైరుధ్యం వల్ల ప్రాంతీయ పార్టీలు ఫెడరలిజాన్ని సమర్ధించాయి. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కోరాయి. ఇది ప్రాంతీయ పార్టీల ఉమ్మడి నినాదంగా మారింది. ❞

1952లో తొలి సార్వత్రిక ఎన్నికలు జరిగిన తరువాత దాదాపు దశాబ్దం వరకు అధికార కాంగ్రెస్ పార్టీకి ప్రత్యామ్నాయంగా జాతీయ స్థాయిలో అన్ని ప్రాంతాల్లోనూ ప్రభావం చూపించ గల మరోపార్టీ లేదు. 1952 ఎన్నికల తరువాత లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష బృందంగా ఏర్పడిన కమ్యూనిస్టు పార్టీగానీ, లేదా సోషలిస్టుల బృందంగానీ, లేదా భారతీయ జన సంఘ్ గానీ అఖిల భారత స్థాయిలో రాజకీయ శక్తిగా నాడు లేవు. అందువల్ల కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ పాలనకు వ్యతిరేకంగా ప్రజల్లో ఏర్పడిన అసంతృప్తి అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీల రూపంలో వ్యక్తమయింది. దీనికి కేరళ, తరువాతి కాలంలో పశ్చిమ బెంగాల్‌లు మినహాయింపు. ఈ రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చాయి. జన సంఘ్‌కు ఉత్తరాదిలోని రెండు మూడు రాష్ట్రాల్లో కొంత పునాది ఉండేది. మిగిలిన రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ప్రతిపక్షాలుగా ప్రాంతీయ పార్టీలు ముందుకు వచ్చాయి. ఆనాడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ గుత్త పెట్టుబడికీ, బడా వ్యాపార సంస్థలకూ ప్రాతినిధ్యం వహించేది. కాంగ్రెస్ ఆర్థిక విధానాలు ఈ గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలకు అనుగుణంగా ఉండేవి. ఆనాడు దేశంలో రాజ్య–ప్రాయోజిత, రాజ్య–నియంత్రిత పెట్టుబడిదారీ అభివృద్ధి జరిగింది. ఉదాహరణకు, ఆనాడు మనం దేశంలోని ఏ రాష్ట్రంలోనైనా ఏదైనా పరిశ్రమ పెట్టుకోవాలంటే కేంద్ర ప్రభుత్వం నుండి లైసెన్సు పొందాల్సి వచ్చేది. రాష్ట్ర ప్రభుత్వాలకు లైసెన్సులిచ్చే అధికారం లేదు. అందువల్ల ఏవరైనా ఆంధ్ర ప్రదేశ్‌లోగానీ, తమిళనాడులోగాని లేక ఉత్తర ప్రదేశ్‌లో గాని ఎక్కడ పరిశ్రమ పెట్టాలన్నా కేంద్రం నుండి లైసెన్సు తెచ్చుకోవాల్సిందే. దానివల్ల పారిశ్రామిక లైసెన్సుల్లో అత్యధిక భాగం అఖిల భారత బడా వ్యాపార సంస్థలు తన్నుకుపోయేవి. ప్రాంతీయ స్థాయిలో, రాష్ట్రాల స్థాయిలోని బడా–ఏతర బూర్జువా వర్గం పట్ల వివక్షత ప్రదర్శించబడేది. లైసెన్సుల మంజూరు విషయంలో వారిని సమానంగా చూసేవారు కాదు. 1966లో పారిశ్రామిక ప్రణాళిక, లైసెన్సుల మంజూరుపై కేంద్ర ప్రభుత్వం ప్రొఫెసర్ ఆర్‌కె హజారీ నాయకత్వంలో ఒక కమిటీ వేసింది. దేశంలో పారిశ్రామిక పెట్టుబడులకు లైసెన్సులు, అనుమతుల్లో 46 శాతాన్ని కేవలం 28 బడా వ్యాపార సంస్థలు చేజిక్కించుకున్నాయని హజారీ కమిటీ తన నివేదికలో తెలిపింది. ఈ 28 పారిశ్రామిక సంస్థల్లో కూడా టాటా, బిర్లాతో సహా కేవలం 4 సంస్థలు మెజారిటీ లైసెన్సులు చేజిక్కించుకున్నాయి. ఆవిధంగా దేశంలోని పెట్టుబడి కొద్దిపాటి అఖిలభారత బడా బూర్జువాల చేతుల్లో కేంద్రీకృతం అయ్యేందుకు ప్రభుత్వ విధానాలు దోహదపడ్డాయి. ఇలా బడా బూర్జువా వర్గానికీ ఆయా రాష్ట్రాల్లోని ప్రాంతీయ బూర్జువా వర్గం, భూస్వామ్య వర్గాలకు మధ్య తలెత్తిన వైరుధ్యం వల్ల ప్రాంతీయ పార్టీలు ఫెడరలిజాన్ని సమర్ధించాయి. రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలని కోరాయి. ఇది ప్రాంతీయ పార్టీల ఉమ్మడి నినాదంగా మారింది. దీనికి తమిళనాడులో ఏర్పడిన డిఎంకె పార్టీ ఒక మంచి ఉదాహరణ. దేశంలో కాంగ్రెస్‌ను ఓడించి పూర్తి మెజారిటీతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన తొలి ప్రాంతీయ పార్టీ డిఎంకె. 1967లో అది తమిళనాడులో అధికారంలోకి వచ్చింది. ఆ ప్రభుత్వం కేంద్ర రాష్ట్ర సంబంధాలను పరిశీలించేందుకు రిటైర్డ్ న్యాయమూర్తి రాజమన్నార్ నాయకత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కేంద్ర రాష్ట్ర సంబంధాలను ఎలా పునరుద్ధరించాలి అన్న విషయమై రాజమన్నార్ కమిటీ అత్యుత్తమమైన నివేదిక సమర్పించింది. మనకు మరింత ఫెడరల్ వ్యవస్థ ఉండాలనీ, రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కేటాయించాలనీ రాజమన్నార్ కమిటీ సిఫార్సు చేసింది. సిపిఐ(ఎం) వీటిని సానుకూల పరిణామాలుగా భావించింది. ఫెడరలిజం కావాలనీ, రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కేంద్ర రాష్ట్ర సంబంధాలను పునర్వ్యవస్థీకరించాలనీ, సమానత్వంతో కూడిన సమతుల్య అభివృద్ధి కావాలనీ కోరుతున్న ప్రాంతీయ పార్టీల పట్ల సానుకూల ధోరణితో వ్యవహరించింది. అదేవిధంగా దేశంలో కాంగ్రెస్ గుత్తాధికారానికి వ్యతిరేకంగా ఈ పార్టీలు పోరాడ్డాన్ని కూడా స్వాగతించింది. 1967 సార్వత్రిక ఎన్నికల్లో డిఎంకెతో అవగాహనకు వచ్చిన తొలి పార్టీ సిపిఐ(ఎం). ఆ ఎన్నికల్లో తమిళనాడు నుండి నలుగురు సిపిఐ(ఎం) అభ్యర్థులు లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీని ఓడించడం కోసం పార్టీ డిఎంకెకు మద్దతిచ్చింది. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక, గుత్తపెట్టుబడిదారీ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా, రాష్ట్రాల హక్కుల కోసం పోరాడే ప్రాంతీయ పార్టీలతో ఉమ్మడి అవగాహన ఏర్పాటుకు ప్రాతిపదిక ఉందని సిపిఐ(ఎం) భావించింది. అందువల్లనే 1967 నుండి పార్టీ తన పోరాటాన్ని కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ గుత్తపెట్టుబడిదారీ, భూస్వామ్య అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టింది. దాంతో ఒక్కో రాష్ట్రంలో ఏర్పడిన ప్రాంతీయ పార్టీలతో ఎన్నిల్లోగానీ, ఇతరత్రాగానీ పరస్పరం సహకరించుకోవడం ప్రారంభించింది. ఈ ప్రాంతీయ పార్టీల్లో కొన్నిటి కార్యక్రమాలు, విధానాలు ప్రజాతంత్ర సారం కలిగి ఉండేవి.

తమిళనాడులో డిఎంకె, పంజాబ్‌లో అకాలీ దళ్‌లు దేశంలో మొదట ఏర్పడిన ప్రాంతీయ పార్టీలు. తరువాతి కాలంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతిపక్షంగా ప్రాంతీయ పార్టీలు ముందుకొచ్చాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగు దేశం పార్టీ, అస్సాంలో అస్సాం గణ పరిషత్ తరువాత ఉత్తర భారత దేశంలోని యుపిలో సమాజ్‌వాదీ పార్టీ, బీహార్‌లో ఆర్‌జెడి వంటివి ఆవిర్భవించాయి. ఇవి ప్రధానంగా నాటి జనతా పార్టీ, జనతా దళ్ నుండి చీలి ఏర్పడ్డాయి. ఆ విధంగా 1990 దశకం వరకు కాంగ్రెస్‌కు ప్రధాన ప్రతి పక్షాలుగా, రాష్ట్రాల్లో అధికార పార్టీలుగా ప్రాంతీయ పార్టీలు ముందుకు రావడం ఒక ధోరణిగా సాగింది.

> **" ఇప్పుడు సరళీకరణ విధానాలు రావడంతో నియంత్ర ణలు తొలగిపోయాయి. కొత్త పరిశ్రమలు పెట్టడానికి లైసెన్సులు అక్కర లేదు. పర్మిట్లు అక్కరలేదు. ప్రతిదీ మార్కెట్‌కు అనుగుణంగా జరిగి పోతుంది. దీని వల్ల అనేక ప్రాంతీయ బూర్జువా సెక్షన్లకు అభివృద్ధి చెందడానికీ, విస్తరించడానికీ అవకాశాలు వచ్చాయి. ఆ విధంగా నయాఉదారవాద విధానాలు ప్రాంతీయ బూర్జువాలకు కొత్త అవకాశాలు కల్పించాయి గనుక ఈ ప్రాంతీయ పార్టీలు నయాఉ దారవాదానికి మద్దతుదారులుగా మారిపోయాయి. "**

అయితే ప్రాంతీయ పార్టీలు కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్షాలుగా ప్రధాన పాత్ర నిర్వహించినా, కొంత మేరకు ఆయా ప్రాంతాలు, రాష్ట్రాల ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించినా ప్రధానంగా అవి ప్రాంతీయ బూర్జువా వర్గానికీ, భూస్వామ్య వర్గానికీ ప్రాతినిధ్యం వహించే పార్టీలు గనుక అధికారం చేపట్టినప్పుడు వాటి విధానాలు కాంగ్రెస్ విధానాలకు పెద్దగా భిన్నంగా ఉండేవి కావు. మొత్తం మీద 1960వ దశకం నుండి 1990 దశకం మధ్యలో ప్రాంతీయ పార్టీలు ఇటువంటి పాత్ర నిర్వహించాయి.

ఈ విధంగా పలు రాష్ట్రాల్లో అధికారం లోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు కేంద్రం నుండి రాష్ట్రాలకు మరిన్ని అధికారాలు కావాలన్న సమస్యపైనా, కేంద్ర రాష్ట్ర సంబంధాల సమస్య లపైనా సిపిఐ(ఎం)తో సహకరించాయి. దీనిలో భాగంగా కేంద్ర రాష్ట్ర సంబంధాల సమస్యపై 1983లో శ్రీనగర్‌లో జరిగిన ప్రతిపక్షాల సమావేశం అత్యంత ముఖ్యమైన మైలురాయి. ఆనాడు తమిళనాడులో డిఎంకె ప్రభుత్వం, ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగు దేశం ప్రభుత్వం, జమ్మూ-కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభుత్వా లతో పాటు మరికొన్ని ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి. ఈ పార్టీలు పశ్చిమ బెంగాల్‌లో వామపక్ష ప్రభుత్వంతో కలిసి కేంద్ర రాష్ట్ర సంబంధాలపై డిమాండ్లు రూపొందించేందుకు ఈ సమావేశం నిర్వహిం చాయి. దీని ఫలితంగానే తరువాతి కాలంలో కేంద్ర రాష్ట్ర సంబంధాలపై సర్కారియా కమిషన్ నియమించబడింది.

అనేక రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి రావడంతో 1980వ నాటికి కాంగ్రెస్ పార్టీ శాశ్వతంగా తన ఏకపార్టీ గుత్తాధిపత్యాన్ని కోల్పోయింది. 1984లో ఇందిరాగాంధీ హత్యానంతర పరిస్థితుల్లో తప్పించి ఇంకే ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు పూర్తి మెజారిటీ రాలేదు. 1984 ఎన్నికల్లో మాత్రమే సానుభూతి ఓట్లతో కాంగ్రెస్ విజయం సాధించి రాజీవ్ గాంధీ ప్రభుత్వం ఏర్పడింది. ఈ ఎన్నికల్లో మినహా మిగిలిన కాలమంతా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల బలం, దాని ప్రభావం కూడా క్రమంగా తగ్గుతూ వచ్చింది. ఈ కాలంలో ప్రాతీయ పార్టీలు సిపిఐ(ఎం) ఇతర వామపక్ష పార్టీలతో కలిసి కేంద్రంలో లౌకిక ప్రత్యామ్నా యాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాయి. 1989లో విపి సింగ్ నాయకత్వంలోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. ఇది ప్రధానంగా ప్రాంతీయపార్టీలతో కూడిన ప్రభుత్వం. వామపక్షాలు దీనికి బయటినుండి మద్దతి చ్చాయి. ఈ సంకీర్ణ ప్రభుత్వంలోకి బిజెపిని చేర్చుకోలేదు. మళ్లీ 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఏర్పడింది. అప్పటికే బలం పెంచు కున్న బిజెపి కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయకుండా నిరోధిస్తూ ప్రాంతీయ పార్టీలు, వామపక్షాల సహకారంతో ఏర్పడిన ప్రభుత్వ ఇది. ప్రాంతీయ పార్టీలు స్వభావ రీత్యా లౌకిక పార్టీలు. అవి మత రాజకీయాల్లో పాల్గనవు, మతం ప్రాతిపదికగా ప్రజలను సమీకరించ బూనుకోవు. అందువల్ల ఆ కాలంలో దిగజారి పోతున్న కాంగ్రెస్‌కు లౌకిక ప్రత్యామ్నాయం ఏర్పాటుకు జరిగిన ప్రయత్నాల్లో అవి కలిసి వచ్చాయి.

అయితే ఈనాడు వెనక్కు తిరిగి చూసు కుంటే ఇదే కాలంలో ప్రాంతీయ పార్టీల లక్షణం, దృక్కోణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. చాలా కాలం పాటు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఈ పార్టీలు క్రమంగా బూర్జువా-భూస్వామ్య వర్గాలకు మరింత ఎక్కువగా ప్రాతినిధ్యం వహించడం ప్రారంభించాయి. 1991లో నయాఉదారవాద విధానాలు ప్రారంభమై, సరళీకరణ యుగం ప్రారంభం కావడంతో పెట్టుబడిదారీ అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభమైంది. ఈ మార్పు బడా పెట్టుబడిదారలుకూ బాడాఏతర పెట్టుబడి దారులకూ మధ్య సంబంధాల్లో మార్పు తెచ్చింది. గతంలో కేంద్ర ప్రభుత్వం లైసెన్సింగ్ వ్యవస్థను ఉపయోగించుకుని బడా పెట్టుబడి దారీ సంస్థలకు ఎలా ప్రయోజనం చేకూర్చిందో, దాని వల్ల చిన్నమధ్యతరగతి ప్రాంతీయ పెట్టుబడిదారలుకు ఎలా నష్టం జరిగేదో నేను ఇంతకు ముందే చెప్పాను. కానీ ఇప్పుడు సరళీకరణ విధానాలు రావడంతో నియంత్ర ణలు తొలగిపోయాయి. కొత్త పరిశ్రమలు పెట్టడానికి లైసెన్సులు అక్కరలేదు. పర్మిట్లు అక్కరలేదు. ప్రతిదీ మార్కెట్‌కు అనుగుణంగా జరిగిపోతుంది. దీని వల్ల అనేక ప్రాంతీయ బూర్జువా సెక్షన్లకు అభివృద్ధి చెందడానికీ, విస్తరించడానికీ అవకాశాలు వచ్చాయి. ఆ విధంగా నయాఉదారవాద విధానాలు ప్రాంతీయ బూర్జువాలకు కొత్త అవకాశాలు కల్పించాయి గనుక ఈ ప్రాంతీయ పార్టీలు నయాఉదారవాదానికి మద్దతుదారులుగా మారిపోయాయి. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న చోట అవి ఈ నయాఉదారవాద విధా నాలనే అమలు చేయడం ప్రారంభించాయి. ఆ విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలకూ, ప్రాంతీయ పార్టీల విధానలకూ మధ్య వైరుధ్యం లేకుండా పోయింది. బడాబూర్జువావర్గానికీ, బడాఏతర బూర్జువా వర్గానికీ మధ్య వైరుధ్యం సద్దుమణిగింది. దాంతో గతంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో వామపక్షాలతో సహకరిస్తూ వచ్చిన ప్రాంతీయ పార్టీలు క్రమంగా వైఖరి మార్చుకుంటూ వచ్చాయి. వామపక్షాలతో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడే వేదికలకు క్రమంగా దూరం జరగడం ప్రారంచాయి. అయితే ఈ పార్టీలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాత్రం వామపక్షాల సహకారం తీసుకునేవి, అధికారం లోకి వచ్చిన వెంటనే నయాఉదారవాద విధానాలు అమలు చేయడం మొదలుపెట్టేవి. ఆ విధంగా వర్గ రీత్యా చూసినప్పుడు ప్రాంతీయ పార్టీల విధానాల్లోనూ, వైఖరిలోనూ పెద్ద మార్పు సంభవించింది. ముఖ్యంగా రాష్ట్రాల్లో అధికారం లోకి వచ్చే అవకాశం ఉన్నవాటిలో ఈ మార్పు కొట్టచ్చినట్లు కనిపించింది.

ఇక రెండో అంశం, ప్రాంతీయ పార్టీల రాజకీయ దోరణిలోనూ, దృక్కోణంలోనూ మార్పు వచ్చింది. అంతకు ముందు ఈ ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడేవి. అదే సమయంలో బిజెపితో చేతులు కలపడానికి సిద్ధంగా ఉండేవి కావు. వాస్తవానికి ప్రాంతీయ పార్టీల వైఖరి 1989లోనూ, 1996లోనూ బిజెపి అధికారంలోకి రాకుండా అడ్డుకున్నది. అయితే ప్రాంతీయ పార్టీలకు ఉ

న్న పరిమితుల వల్ల ఈ అవగాహనగానీ, ఈ ధోరణిగానీ, లేక ఈ సంకీర్ణాలుగానీ నిలవలేక పోయాయి. ఆ రోజుల్లో మూడో ఫ్రంట్ లేక మూడో ప్రత్యామ్నాయం ఏర్పడాలన్న నినాదం వినిపించేది. కానీ ఈ ప్రాంతీయ పార్టీల లక్షణం వల్ల అది నిలవలేదు. ఒకవైపు కాంగ్రెస్ దిగజారిపోతూ ఉండగా ఆ కాలాన్ని సంకీర్ణాల యుగంగా పిలవడం జరిగింది.

మరోవైపు ఈ కాలంలో బిజెపి బలప డుతూ వచ్చింది. సరళీకరణ విధానాలతోపాటే బిజెపి హిందుత్వ రాజకీయాలు కూడా వృద్ధి చెందుతూ వచ్చాయి. 1996 నాటికి బిజెపి లోక్‌సభలో ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. అప్పట్లో ఈ ప్రాంతీయ పార్టీల్లో అనేకం రాష్ట్రాల్లో వాటి పట్టు పెంచుకోడానికి కేంద్రం లోని సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వాములైనాయి. కానీ తరువాతి కాలంలో 1998, 99 ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టే స్థితి వచ్చేసరికి ఈ ప్రాంతీయపార్టీలు అవకాశ వాదంతో బిజెపితో చేతులు కలిపాయి. ఈ ప్రాంతీయపార్టీలన్నీ... అత్యంత సెక్యులర్ పార్టీలయిన డిఎంకెతో సహా తెలుగు దేశం, ఎజిపి, అకాలీ దళ్..అన్నీ కూడా బిజెపితో ఎన్నికల పొత్తులు పెట్టుకున్నాయి, కేంద్రంలో బిజెపితో కలిసి సంకీర్ణ ప్రభుత్వాల్లో పాల్గన్నాయి. అదే సమయంలో ఈ ప్రాంతీయ పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నప్పుడు వివిధ స్థాయిల్లో నయా-ఉదారవాద విధానాలను అమలు పరిచాయి. ఆ రోజుల్లో చంద్రబాబు నాయుణ్ణి ఆంధ్ర ప్రదేశ్ సిఇఓ అని పిలిచిన విషయం మనందరికీ గుర్తుండి ఉంటుంది. ఆయన అంతగా నయా-ఉదారవాద విధానాల కొమ్ముకాసేవారు, అమలు చేసేవారు. ఈ విధంగా ఈ ప్రాంతీయ పార్టీల లక్షణం, పాత్ర రెంటిలోనూ మార్పు వచ్చింది. మొదటిది, వాటి వర్గ దృక్పథంలో, రెండోది, రాజకీయ దృక్పథంలో మార్పులు జగిగాయి. వాటి అవకాశవాదం వాటిని బిజెపి పంచన, మతశక్తుల పంచన చేర్చింది. ప్రాంతీయ పార్టీల ఈ ప్రతికూల పాత్ర నేడు మన దేశంలో బిజెపి ఏక పార్టీ ఆధిపత్య పాలన ఏర్పడ్డానికి తోడ్పడింది. కొన్ని దశాబ్దాల క్రితం దేశంలో ఏదైతే కాంగ్రెస్ ఏకపార్టీ ఆధిపత్యం ఉండేదో నేడు అదే విధంగా బిజెపి ఏకపార్టీ ఆధిపత్యం నెలకొన్నది. ప్రాంతీయ పార్టీల అవకాశవాద, అంటకాగే విధానాలు దీనికి తోడ్పడ్డాయి.

గతంలో ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడాయి. ఇలా పోరాడ్డంలో బిజెపి సహకారం తీసుకుని రాష్ట్రాల్లో అధికారం

> **❝ సరళీకరణ విధానాలతోపాటే బిజెపి హిందుత్వ రాజకీయాలు కూడా వృద్ధి చెందుతూ వచ్చాయి. 1996 నాటికి బిజెపి లోక్‌సభలో ఏకైక పెద్ద పార్టీగా అవతరించింది. అప్పట్లో ఈ ప్రాంతీయ పార్టీల్లో అనేకం రాష్ట్రాల్లో వాటి పట్టు పెంచుకోడానికి కేంద్రం లోని సంకీర్ణ ప్రభుత్వాల్లో భాగస్వాములైనాయి. కానీ తరువాతి కాలంలో 1998, 99 ఎన్నికల్లో కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టే స్థితి వచ్చేసరికి ఈ ప్రాంతీయపార్టీలు అవకాశ వాదంతో బిజెపితో చేతులు కలిపాయి. ❞**



**1986లో మద్రాసులో జరిగిన ప్రతిపక్ష నాయకుల సమావేశంలో జ్యోతి బసు, విపి సింగ్, ఎన్‌టి రామారావు, కరుణానిధి, దేవీలాల్, రామకృష్ణ హెగ్డె తదితరులు**

లోకి రావచ్చునని భావించాయి. కానీ ఇప్పుడు జాతీయ రాజకీయ పొందికలు మారిపోయాయి. ఈ రోజున కాంగ్రెస్ వాటి ప్రధాన ప్రతిపక్షం కాదు. ఎందుకంటే అనేక రాష్ట్రాల్లో దాని బలం దిగజారిపోయింది. నేడు ఆంధ్ర ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఒక శక్తిగా లేనేలేదు. ఒడిషాలో కూడా అది శక్తిగా లేదు. అయినా ఈ ప్రాంతీయ పార్టీలు తమ ప్రత్యర్థులతో పోరాడుతూ.. బిజెపి ఒక శక్తిగా ఎదిగే సరికి అవకాశవాదంతో దానితో పొత్తులకు సిద్ధపడిపోయాయి. దాని ఫలితం ఏమిటి? బిజెపి అనేది కాంగ్రెస్‌లాగా ఒక సాధారణ బూర్జువా పార్టీ కాదు. ఆర్ఎస్ఎస్, హిందుత్వ సిద్ధాంతం బిజెపిని నడిపిస్తున్నాయి. బిజెపి-ఆర్ఎస్ఎస్ ఎలా పనిచేస్తాయో తెలుసుకోవాలంటే మనం అస్సాం గణ పరిషత్ ఉదాహరణ చెప్పుకోవాలి. అస్సాం గణపరిషత్ రాష్ట్రంలో కాంగ్రెస్‌తో ప్రధానంగా పోరాడింది. రెండు సార్లు అది అధికారంలోకి వచ్చింది కూడా. కానీ 2001 ఎన్నికల్లో అది కాంగ్రెస్‌ను ఓడించడం కోసం బిజెపితో ఎన్నికల అవగాహనకు వచ్చింది. అప్పటి నుండి ఎజిపి ప్రజా బలం క్రమంగా బిజెపికి మళ్లిపోవడం జరిగింది. బిజెపి క్రమంగా అస్సాం గణ పరిషత్ సామాజిక పునాదిని కొల్లగొట్టేసింది. కాలక్రమంలో ఎజిపి కార్యకర్తలు, నాయకులు కూడా బిజెపిలో చేరిపోయారు. ప్రస్తుత అస్సాం ముఖ్యమంత్రి శర్బానంద సోనోవాల్ ఒకనాడు ఎజిపి ప్రధాన కార్యదర్శి. అస్సాం విద్యార్థి ఉద్యమంలో ప్రముఖ నాయకుడుగా ఎదిగిన ఆయన ఎజిపిలో ప్రధాన స్థానంలో ఉండేవారు. నేడు ఆయన రాష్ట్ర బిజెపి ముఖ్యమంత్రి అయిపోయారు. ఎజిపి అధ్యక్షుల్లో ఒకరు నేడు రాష్ట్రంలో బిజెపి మంత్రిగా ఉన్నారు. అస్సాం గణ పరిషత్ నేడు బిజెపి సంకీర్ణ మంత్రివర్గంలో జూనియర్ భాగస్వామిగా మారిపోయింది. అది నేడు చాలా చిన్న భాగస్వామి మాత్రమే. దాని పునాదిని బిజెపి లాగేసుకుంది. బిజెపి-ఆర్ఎస్ఎస్ ఏ ప్రాంతీయ పార్టీలతో సంకీర్ణం కడితే వాటి సామాజిక పునాదిని కబళించి ఆ పార్టీలను మింగేస్తాయి. ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చిన అన్ని రాష్ట్రాల్లోనూ ఈ పరిణామం జరిగింది. ఈ రోజున తెలంగాణాలో ఏం జరుగుతున్నదో మనం చూస్తున్నాం. అక్కడ టిఆర్ఎస్ ప్రభుత్వం ఉంది. ఒడిషాలో నవీన్ పట్నాయక్ నాయకత్వంలోని బిజూ జనతా దళ్ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఈ పార్టీలు, ప్రభుత్వాలు నేరుగా బిజెపితోనూ. కేంద్రంలోని ప్రభుత్వం తోనూ ఘర్షణ పడ్డానికి ఇష్టపడవు. బిజెపి విధానాలకూ, పార్లమెంటులో అది చేసే చట్టాలకూ అవి మద్దతిస్తాయి. టిఆర్ఎస్ పార్ల మెంటులో సిఎఎ చట్టాన్ని వ్యతిరేకించినట్లు ఎక్కడో ఒకటి రెండు సందర్భాల్లో మినహా సాధారణంగా అవి తటస్థంగా ఉండడమో లేక బిజెపి ప్రభుత్వానికి మద్దతివ్వడమో చేస్తున్నాయి. దానివల్ల తమ ప్రభుత్వాలపై కేంద్రం, బిజెపి

> ❝ ఆ విధంగా క్రమంగా తమ వైఖరులు మార్చుకుని, అవకాశవాదంతో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యర్థులకు వ్యతిరేకంగా బిజెపితో చేతులు కలిపిన ప్రాంతీయ పార్టీలు నేడు ఆ బిజెపి నుండి ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి.ఈనాడు వాటి మనుగకే బిజెపి-ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం నుండి ముప్పు ఏర్పడింది. ❞

దాడి చేయదని భావిస్తున్నాయి. కాని వాస్తవంలో జరిగిందేమిటి, కాంగ్రెస్ దిగజారిపోతూ బిజెపి బలం పుంజుకున్న కొద్దీ నేడు తెలంగాణాలో టిఆర్ఎస్‌కు బిజెపి ప్రమాదంగా మారిపోయింది. ఒడిషాలో కూడా ఇదే జరిగింది. అక్కడ కాంగ్రెస్ బలహీనపడి బిజెపి బలం పుంజుకున్నది. రానున్న శాసన సభ ఎన్నికల్లో అది బిజూ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి సమాయత్తమవుతున్నది. బీహార్‌లో దీర్ఘకాలంగా బిజెపి భాగస్వామిగా ఉన్న జెడి(యు) నేడు బలహీనపడిపోయింది. దాని బలాన్ని తీసుకుని బిజెపి బలం పుంజుకుంది. తమతో దీర్ఘ కాలం మిత్రపక్షాలుగా ఉన్న పార్టీలను కూడా బిజెపి సహించదు. ఎందుకంటే దానికి భిన్నమైన వైఖరి గల పార్టీలంటే గిట్టదు. మిత్రపక్షం ఏదైనా దానికి పూర్తిగా దాసోహంగా ఉండాల్సిందే. ఇది సహించలేకే నేడు మహరాష్ట్రలో శివసేన ఎన్డీఏ నుండి వైదొలగింది. పంజాబ్‌లో అకాలీ దళ్ వ్యవసాయ చట్టాల విషయంలో బయటికి వచ్చేసింది.

బిజెపిఆర్ఎస్ఎస్ సిద్ధాంతం దేశంలో భిన్నత్వానికి, బహుళత్వానికి వ్యతిరేకం. దానికి ఫెడరిలిజంలో నమ్మకం లేదు. దానికి నియంతృత్వ వ్యవస్థ, కేంద్రీకృత వ్యవస్థ కావాలి. అందుకే ఆర్ఎస్ఎస్ మొదటి నుండీ 'ఒకే దేశం, ఒకే సంస్కృతి, ఒకే భాష' అని నినదిస్తోంది. మన భాషా ప్రయుక్త రాష్ట్రాలన్నిటినీ, మన విభిన్న సామాజిక, సాంస్కృతిక ధోరణులన్నిటినీ తొక్కి పడేసి ఏకసదృశమైన 'హిందుత్వ' వ్యవస్థను తద్వారా 'హిందూరాష్ట్ర' ను నిర్మించడానికి అది ప్రయత్నిస్తోంది. ఆ విధంగా బిజెపిఆర్ఎస్ఎస్ తన ఆధిపత్యాన్ని పెంచుకుని, సుస్థిరపరుచుకునేందుకు ప్రాంతీయ పార్టీలను నిచ్చెన మెట్లుగా ఉపయోగించుకుంటోంది. మొత్తం ప్రాంతీయ పార్టీల్లో రెండు కేటగిరీలున్నాయి. కొన్ని బిజెపితో చేతులు కలిపి, పొత్తు పెట్టుకున్నాయి. అవి దెబ్బ తిన్నాయి. అలా కాకుండా టిఆర్ఎస్, బిజెడి వంటి మరికొన్ని పార్టీలు బిజెపిని వ్యతిరేకించకుండా విన్యాసాలు చేస్తున్నాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో తెలుగు దేశం పార్టీ బిజెపితో కలిసి వెళుతుంది, బయట కొస్తుంది, మళ్లీ కలుస్తుంది, బయటికొస్తుంది. మళ్లీ ఇప్పుడు అవకాశం ఉంటే బిజెపితో కలిసి వెళ్లడానికి ప్రయత్నిస్తోంది. దానికి మనుగడ నిలుపుకోవడం ఎలా అన్నదే ఇప్పుడు సమస్యగా ఉంది. ఇక వైసిపి ప్రభుత్వం పరిస్థితి టిఆర్ఎస్, బిజెడి లాగే ఉంది. అది బిజెపికి వ్యతిరేకంగా ఉండదు. ఒక్కోసారి తటస్థంగా మరోసారి మద్దతిస్తూ ఉంటుంది. కానీ ఈ విధానాలతో అవి బిజెపి-ఆర్ఎస్ఎస్ దాడి నుండి రక్షణ పొందలేవు.

ఆ విధంగా క్రమంగా తమ వైఖరులు మార్చుకుని, అవకాశవాదంతో ఆయా రాష్ట్రాల్లోని ప్రత్యర్థులకు వ్యతిరేకంగా బిజెపితో చేతులు కలిపిన ప్రాంతీయ పార్టీలు నేడు ఆ బిజెపి నుండి ప్రమాదాన్ని ఎదుర్కొంటున్నాయి. ఈనాడు వాటి మనుగకే బిజెపి-ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం నుండి ముప్పు ఏర్పడింది.

నరేంద్ర మోడీ అధికారం చెలాయిస్తున్న ఈ కాలంలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను హరిస్తూ వచ్చింది. అన్ని రాష్ట్రాల హక్కులపై దాడులు చేస్తోంది. అది అధికారాలను నియంతృత్వంతో కేంద్రీకరిస్తోంది. ప్రజా జీవితంలోని అన్ని రంగాలపైనా – విద్య, వైద్యం, సంస్కృతి, ఆర్థిక విధానాలు, వనరుల విభజన... ఒకటేమిటి అన్ని రంగాలపైనా ఈ నియంతృత్వ పోకడలు ప్రభావం చూపిస్తున్నాయి. ఇవన్నీ రాష్ట్ర ప్రభుత్వాలకు నష్టదాయకమైనవి. అయినా రాష్ట్రప్రభుత్వాల్లో అనేకం ఈ విధానాలకు వ్యతిరేకంగా నిలబడి పోరాడలేకపోతున్నాయి. పైగా అవి కేంద్రంతో అవకాశవాదంతో అవగాహనకు వస్తున్నాయి. దాని వల్ల రాష్ట్రాల అధికారాలకు కోతపడుతోంది.


ఇటీవల జిఎస్‌టి పరిహారం సమస్యపై ప్రతిపక్షాలన్నిటినీ కూడదీయడానికి కెసిఆర్ ప్రయత్నించారు. అందువల్ల ఇప్పటివరకు బిజెపితో పోరాడడానికి ఇష్టపడని, లేక దానితో చెట్టాపట్టాలేసుకుని వ్యవహరిస్తున్న ప్రాంతీయపార్టీలు రానున్న రోజుల్లో బిజెపికీ, హిందుత్వ శక్తులకూ వ్యతిరేకంగా నిలబడి పోరాడతాయో లేక అవి కూడా హిందూత్వ నియంతృత్వ శక్తుత చేత గుటకాయస్వాహా కాబడతాయో అవే నిర్ణయించుకోవాలి. హైదరాబాద్ కార్పొరేషన్ ఎన్నికల తరువాత, బీహార్‌లో జెడి(యు)ను బిజెపి ఎలా మింగేసిందో చూసిన తరువాత అయినా ఈ పార్టీల్లో కొన్నయినా ఈ మార్గంలో కొనసాగలేమనీ, బిజెపితో పోరాడ్డమే మార్గమనీ నిర్ణయించుకుంటాయని ఆశించవచ్చు. గతంలో నయా–ఉదారవాద విధానాల వల్ల లబ్దిపొందిన ప్రాంతీయ బూర్జువాలు ఇప్పుడు మోడీ అనుసరిస్తున్న ఉగ్ర నయా–ఉదారవాద విధానాల వల్ల, అంబానీలకూ, అదానీలకూ ప్రయోజనం చేకూర్చే విధానాల వల్ల నష్టపోతున్నాయి. అందువల్ల అవి కూడా బిజెపి నియంతృత్వానికి వ్యవతిరేకంగా పోరాటానికి ముందుకొచ్చే అవకాశాలు పెరుగుతున్నాయి. ప్రాంతీయ పార్టీలు ఇప్పుడు కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. భవిష్యత్తు ఈ నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ఆ పార్టీలు గనుక కేంద్ర నియంతృత్వ, కేంద్రీకృత విధానాలకు వ్యతిరేకంగా, హిందూత్వ సైద్ధాంతిక దాడికి వ్యతిరేకంగా గట్టిగా నిలబడితే, అవి నిజంగానే తమ ప్రజల సామాజిక, సాంస్కృతిక వారసత్వాలను కాపాడ్డానికి పూనుకుంటే అప్పుడు హిందూత్వ కేంద్రీకృత నియంతృత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం విజయం సాధిస్తుంది. ఈ విధమైన పోరాటం చేయడానికి నిరాకరించే ప్రాంతీయ పార్టీలు చరిత్ర చెత్తబుట్టలో కలిసిపోతాయి. ఈ ప్రాంతీయ పార్టీల్లో కొన్ని తమ స్వంత రాష్ట్రాల, వారి ప్రజల హక్కుల రక్షణ కోసం నిలబడతాయని వామ పక్షాలు ఆశాభావంతో ఉన్నాయి. ఇదే రానున్న కాలంలో బిజెపి హిందూత్వ నియంతృత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఐక్యతకు ప్రాతిపదికగా ఉంటుంది. అందువల్ల నేడు ప్రాంతీయ పార్టీలు ఒక మూల మలుపులో ఉన్నాయి. రాష్ట్రాల హక్కులు, వారి ప్రజల ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక హక్కుల కోసం జరిగే పోరాటంలో ప్రాంతీయ పార్టీలు తగిన పాత్ర వహిస్తాయని ఆశిద్దాం. ఆయా పార్టీలతో ఆర్థిక, ఇతర విధానాల్లో కొన్ని తేడాలు ఉన్నప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నుండి మన లౌకిక, ప్రజాతంత్ర, ఫెడరల్ రాజ్యాంగానికి ఎదురవుతున్న ప్రమాదాన్ని ఎదుర్కోవడంలో ప్రాంతీయ పార్టీలు కలిసి వస్తాయని ఆశిద్దాం.

**(అనువాదం: ఎన్. వెంకట్రావు)**

ఈ మాసం ప్రత్యేకం

# 'సహకార' ఫెడరలిజం అంటూనే రాష్ట్రాల హక్కుల హరింపు

**బి తులసీదాస్**


రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు

స్వతంత్ర భారత చరిత్రలో కేంద్ర రాష్ట్ర సంబంధాలు ఒక ముఖ్యాంశంగా వుంది. కేంద్రంలో పాలన సాగించిన కాంగ్రెస్ పార్టీ 1960వ దశకంలో తన గుత్తాధిపత్యాన్ని కోల్పోతున్న దశలో రాష్ట్రాలపై మితిమీరిన పెత్తనం చేయడంతో దానికి వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించారు. 1967లో జరిగిన సాధారణ ఎన్నికల్లో 9 రాష్ట్రాల్లో కాంగ్రెస్ చిత్తుగా ఓడిపోవడం గత చరిత్ర. అయితే, గడచిన ఐదు దశాబ్దాల్లో కేంద్ర రాష్ట్ర సంబంధాలు ఒక చర్చనీయాంశంగా, ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసే విషయమే. కేంద్రంలో అటు కాంగ్రెస్ లేదా బిజెపి ఏ పార్టీ అధికారంలో వున్నా రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నాయని ప్రజలకు తమ అనుభవంలో తేటతెల్లమైంది. ఈ నేపథ్యంలోనే 2014 సాధారణ ఎన్నికల్లో 'సహకార ఫెడరలిజం' తమ విధానమని మేనిఫెస్టోలో పేర్కొన్న బిజెపి అధికారానికి వచ్చాక ఆచరణలో దానికి తూట్లు పొడుస్తూనే ఉంది. వాటిలో కొన్ని ముఖ్యమైన అంశాలను పరిశీలిద్దాం.

### వ్యవసాయ చట్టాలూ రాష్ట్రాలకు హాని

దేశ వ్యాప్తంగా రైతులతోపాటు యావత్ ప్రజానీకమూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించడానికి కారణమైన వ్యవసాయ చట్టాలలో అన్నదాతను నష్టపరిచే అంశాలకు తోడు రాష్ట్రాల హక్కులకు, ప్రయోజనాలకూ హాని కలిగించే విషయాలెన్నో వున్నాయి. రైతు తన పంటను ఎక్కడైనా అమ్ముకునే స్వేచ్ఛ కల్పించామన్న పేరిట వ్యవసాయ మార్కెట్లను నిర్వీర్యం చేసే చట్టం వల్ల రైతు మద్దతు ధరను పొందలేకపోతే రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాకు వచ్చే మార్కెట్ సెస్సును కోల్పోతాయి. కార్పొరేట్ల ఆధీనంలోని ప్రైవేట్ మార్కెట్ యార్డుల్లో ధరల అమలు, తూనికలు, ఇతర అంశాల్లో రాష్ట్రాల పర్యవేక్షణకు, జోక్యానికీ రాష్ట్ర ప్రభుత్వానికి వీలుండదు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన చట్టాల్లో ఏమివున్నప్పటికీ మోడీ సర్కారు తాజాగా తెచ్చిన కాంట్రాక్టు వ్యవసాయ చట్టంలోని నిబంధనలు మాత్రమే వర్తిస్తాయని పేర్కొంది. ఆ విధంగా రాష్ట్రాల చట్టాలను చెత్తబుట్టలోకి విసిరేసింది. కొన్ని సరుకులకు ఆయా రాష్ట్రాల్లో ఏర్పడిన కొరత, పెరిగిన ధరలు తదితర పరిస్థితులనుబట్టి రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర సరుకుల చట్టం ప్రయోగించి ప్రజలకు సరుకులను అందించడానికి, ధరలను అదుపు చేయడానికీ ఇప్పుడు అవకాశం వుంది. బిజెపి తెచ్చిన కొత్త చట్టంతో కార్పొరేట్ వ్యాపారులు గుట్టలుగా నిల్వ చేసుకోవడానికి తలుపులు బార్లా తెరవడమేగాక నిత్యావసర సరుకుల చట్ట నిబంధనల్ని ప్రయోగించకుండా రాష్ట్ర ప్రభుత్వాల చేతులు కట్టేసింది.

### విద్యుత్ చట్ట సవరణలతో ముప్పు

ప్రస్తుతం అమలులోవున్న 2003 విద్యుత్ చట్టానికి కేంద్రం తెచ్చిన సవరణలను దేశం యావత్తూ వ్యతిరేకిస్తోంది. పరిశ్రమలు, వాణిజ్య వినియోగదార్ల నుండి కొంత ఎక్కువ రేటును వసూలు చేసి, అల్పాదాయ వర్గాలకు, సామాజిక వినియోగానికీ తక్కువ రేటుకు సరఫరా చేసే క్రాస్ సబ్సిడైజేషన్ విధానాన్ని పూర్తిగా తొలగించడం లేదా తగ్గించాలన్నది తాజా సవరణల్లోని ఒక ముఖ్యాంశం. ఆయా రాష్ట్రాల పరిస్థితినిబట్టి ఏయే తరగతులు, వర్గాల ప్రజలకు లేదా వృత్తులకు అలాగే కొన్ని ప్రాంతాలకు, పంటలకూ రాయితీలివ్వాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయిస్తుంటాయి. రాయితీల కోసం ప్రజలు చేసే ఉద్యమాల ఫలితంగానే ఆ నిర్ణయాలుంటాయి. (2000 నాటి విద్యుత్ ఉద్యమం, ముగ్గురి బలి దానం ఫలితంగానే తెలుగు రాష్ట్రాల్లో వ్యవసాయానికి ఉచిత విద్యుత్, చిన్న గృహ వినియోగదార్లకు ఇప్పటికీ తక్కువ చార్జీ వంటివి కొనసాగుతున్నాయి) అలాగే ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఇస్తున్న సబ్సిడీ, క్రాస్ సబ్సిడైజేషన్ లేకుండా కాస్ట్ టు సెర్వ్ (విద్యుత్ కొనుగోలు, ప్రసార, పంపిణీ ఖర్చులన్నీ కలిపి అయ్యేది) రేటుకే విద్యుత్ ఛార్జీలు నిర్ణయించాలని తాజా సవరణలు చెబుతున్నాయి. గృహ వినియోగదార్లు, అల్పాదాయ వర్గాలవారు కూడా ఇప్పుడు పొందుతున్న రాయితీలను కోల్పోతారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్లకు సభ్యులను, ఛైర్మన్లనూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నియమిస్తుండగా ఇకపై కేంద్ర ప్రభుత్వమే నియమిస్తుంది. విద్యుత్ చట్ట సవరణలతో కేంద్రం రైతులు, సామాన్య ప్రజలకిచ్చే రాయితీలు ఎగ్గొట్టడంతోపాటు రాష్ట్రాల అధికారాలపై దాడి చేస్తోంది.

### జిఎస్‌టి నిలువు దోపిడీ

రాష్ట్రాల ఖజానాలకు ఆదాయ వనరుల్లో అమ్మకం పన్ను ప్రధానమైనది. ఆయా రాష్ట్రాల్లోని ఉత్పత్తి, వినియోగాన్నిబట్టి, ప్రజల చెల్లింపు సామర్థ్యానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు వస్తువులపై అమ్మకం పన్ను విధించేవి. 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట మోడీ ప్రభుత్వం తెచ్చిన జిఎస్‌టి విధానంతో ఇప్పుడు రాష్ట్రాలకు ఆ అవకాశం లేదు. ఏ వస్తువులకు, ఏయే సేవలకు ఎంత రేటు పన్ను విధించేదీ కేంద్ర ఆర్థిక మంత్రి అధ్యక్షతన వుండే జిఎస్‌టి కౌన్సిల్‌కు కట్టబెట్టారు. రాష్ట్రాలు కొత్తగా విధించడానికి లేదా ఉన్న రేటు పెంచడానికీ అవకాశం లేదు. జిఎస్‌టి చట్టంవల్ల తమ ఆదాయానికి గండి పడుతుందని అర్థం చేసుకొని పలు రాష్ట్ర ప్రభుత్వాలు, పార్టీలు వ్యతిరేకించాయి. రాష్ట్రాలకు తగ్గిన ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుందని చట్టంలో చేర్చాకనే కొన్ని రాష్ట్రాలు మెత్తబడ్డాయి. కాని, ఆ

**“ భారతదేశంలో న్యాయవ్యవస్థ స్వతంత్రతకు ప్రమాదం చట్టసభల నుండి లేదా అధికార వ్యవస్థ నుండి వస్తున్నదని భావించటం పరిపాటిగా ఉన్నది. కానీ న్యాయ వ్యవస్థలోని వారు ఇతర విభాగాలకు లొంగిపోతే అది పూర్తిగా భిన్నమైన పరిస్థితి అవుతుంది. 1985లోనే జస్టిస్ వైవి చంద్రచూడ్ ఈనాటి పరిస్థితిని ముందుగా చూడగలిగారు. “న్యాయవ్యవస్థ స్వతంత్రతకు బయటి నుండి కాక అంతర్గతంగానే ఎక్కువ ప్రమాదం వస్తుందని” వ్యాఖ్యానించారు. ”**

నిబంధనను సైతం మోడీ సర్కారు తుంగలో తొక్కింది. కరోనా విపత్తు మూలంగా రాష్ట్రాలు ఖర్చు పెరిగి ఆదాయాన్ని కోల్పోయిన సమయంలో కూడా వాటికివ్వాల్సిన జిఎస్‌టి లోటు మొత్తాన్ని చెల్లించడానికి కేంద్ర ప్రభుత్వం 'అది దేవుడి లీల' అంటూ తిరస్కరించడం దారుణం.

**రాష్ట్రాలకు వనరుల కుదింపు**

ఆదాయ పన్ను, సంపద పన్ను, వివిధ వస్తువులపై సుంకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం భారీ ఆదాయం పొందుతుంది. అందులో రాష్ట్ర ప్రభుత్వాలకు, స్థానికసంస్థలకు కేంద్ర ప్రభుత్వం ఏ దామాషాలో చెల్లించాలో శాస్త్రీయంగా నిర్ణయించి సూచించేందుకు భారత రాజ్యాంగం ఫైనాన్స్ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కాని, మోడీ సర్కారు వచ్చాక ఫైనాన్స్ కమిషన్‌ను ఓ ప్రహసనంగా మార్చేస్తోంది. ఫైనాన్స్ కమిషన్ విధివిధానాలను అడ్డగోలుగా సవరించి పరిశీలనా ప్రాతిపదికల్ని మార్చింది. రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా రాష్ట్రాలకు కేటాయింపుల శాతాన్ని మార్చేలా అవి ఉపయోగపడ్డాయి. మెరుగైన మానవాభివృద్ధి సూచికలున్న రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయాయి. కాగా 14వ ఫైనాన్స్ కమిషన్ రాష్ట్రాలకు కేటాయించిన 42 శాతాన్ని 15వ ఫైనాన్స్ కమిషన్ 41 శాతానికి తగ్గించింది.

వనరులు చాలని నేపథ్యంలో ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడానికి అప్పులు చేద్దామన్నా రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ అవకాశం కూడా లేకుండా ఎఫ్ఆర్‌బిఎం చట్ట నిబంధనలు ఆటంకంగా వున్నాయి. 'అమ్మ పెట్టాపెట్టదు అడుక్కు తిననివ్వదు' అన్న చందంగా రాష్ట్రాలకు అప్పులు కూడా పుట్టకుండా బిజెపి కట్టడి చేస్తోంది. ఎఫ్ఆర్‌బిఎం నిబంధనలు సడలించాలంటే కొత్త షరతులు విధిస్తోంది. వ్యవసాయ పంప్‌సెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని, ప్రజలపై ఆస్తి పన్ను, చెత్త పన్నువంటివి విధించాలని, రేషన్ కార్డులను కుదించాలని, కార్మిక చట్టాలను నిర్వీర్యం చేయాలనీ చెబుతూ ఇవన్నీ అమలు చేస్తే తమ స్థూల ఆదాయంలో రెండు శాతం మేర అదనంగా అప్పు చేసుకోవడానికి రాష్ట్రాలకు అనుమతిస్తామన్న తాజా నిబంధనలు అందరికీ తెలిసిందే.

మోడీ సర్కారు గద్దెనెక్కుతూనే దశాబ్దాలుగా పని చేస్తున్న ప్లానింగ్ కమిషన్‌ను రద్దు చేసి కేంద్రం చెప్పినదానికి అనుగుణంగా పత్రాలు రూపొందించే నీతి ఆయోగ్ అనే ఒక భజన బృందాన్ని ఏర్పాటు చేసింది. (పార్లమెంటు సాక్షిగా కేంద్రప్రభుత్వం అంగీకరించిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇప్పుడివ్వడం కుదరదని ఆ సంస్థతోనే చెప్పించారు.) వెనుకబడిన రాష్ట్రాలు, ప్రాంతాలు, తరగతుల ప్రజల అభివృద్ధికి శాస్త్రీయ పరిష్కారాలను సూచించి, వాటి అమలుకు అవసరమైన భూమికను ఏర్పాటు చేసేందుకు ఆనాడు ప్లానింగ్ కమిషన్ స్థాపించారు. దాని పనితీరులో లోపాలను సరిదిద్ది మెరుగు పర్చడం కాకుండా ఏకంగా రద్దు చేయడం మోడీ సర్కారు కేంద్రీకృత భావనకు సంకేతం. నీతి ఆయోగ్ వివక్షాపూరిత చర్యలకు పాల్పడుతోంది. యాస్పిరేషనల్ జిల్లాల పేరిట నేరుగా వాటిని పర్యవేక్షణ చేయడం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలివ్వడం తీవ్రమైన విషయం.

**జమిలి ఎన్నికలు ప్రజాస్వామ్యానికి చేటు**

జమిలి ఎన్నికల పేరిట దేశంలో ఏక పార్టీ లేదా ఒకే వ్యక్తి (అధ్యక్ష తరహా) పాలన తీసుకురావాలన్న ప్రయత్నమూ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర సంబంధిత అంశాలు, పార్లమెంటు ఎన్నికల్లో జాతీయ విధానాలూ ప్రజలను ప్రధానంగా ప్రభావితం చేస్తాయి. రెండూ ఒకేసారి జరిగితే రాష్ట్ర అంశాలు వెనక్కుపోతుంటాయి. అంతకన్న ముఖ్యంగా ఏ కారణంతో అయినా ఒక రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ విశ్వాసం కోల్పోతే అప్పటినుండి పార్లమెంటు ఎన్నికలు జరిగే వరకూ రాష్ట్రపతి పాలనలోనే మగ్గాలనడం రాజ్యాంగ ఉల్లంఘనే! ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. ఇప్పుడు ఎదో ఒక సమయంలో జమిలి ఎన్నికలు పెట్టాలంటే ఐదేళ్ల పదవీ కాలానికి ఆ రాష్ట్ర ప్రజలెన్నుకున్న అసెంబ్లీల్లో కొన్నిటిని ముందుగానే రద్దు చేయవలసి వుంటుంది. ఇది ప్రజా తీర్పును మంటగలపడమే కదా! పోనీ గడువు ముగిసిన అసెంబ్లీలకు పదవీ కాలం పొడిగించేద్దాం అని అంటే రాజ్యాంగం అలాంటి అధికారాన్ని ఎవరికీ దఖలు చెయ్యలేదు. జమిలి ఎన్నికలు పాలన కేంద్రీకరణకు, రాష్ట్రాల హక్కుల హరణకూ, ప్రజాస్వామ్య హననానికి బాట వేస్తాయి.

**రాష్ట్రాలను, ఆయా ప్రభుత్వాలనూ దెబ్బ తీస్తున్నారు**

బిజెపియేతర పార్టీల పాలనలోని ప్రభుత్వాలను కూల్చేయడానికి ఫిరాయింపులను ప్రోత్సహించడంతోపాటు గవర్నర్లను దుర్వినియోగపర్చడమూ మోడీ హయాంలో పెచ్చుమీరింది. కర్ణాటక, గోవా, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర.... ఇలా ఎన్నో ఉదంతాలున్నాయి. కేంద్రంలోని అధికారాన్ని వినియోగించి రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపర్చడం, తమకు అనుకూలమైన వారిని గద్దెనెక్కించడం నిరంకుశ చర్యల్లో భాగమే. ఒకే దేశం ఒకే భాష అంటూ హిందీని రుద్ది ప్రాంతీయ భాషలను దెబ్బతీస్తున్నారు. దేశమంతటికీ ఒకే విధమైన టెక్స్ట్ పుస్తకాలను కేంద్రమే రూపొందిస్తుందనడం, సంస్కృతానికి పెద్దపీట వేయడం వంటి నూతన విద్యా విధాన ప్రతిపాదనలు రాష్ట్రాలకు చేటు తెస్తాయి. ఒకే దేశం ఒకే మతం అంటూ రెచ్చగొట్టడం ద్వారా ప్రజల మధ్య చీలికలు– ఘర్షణలకు దారి తీస్తుంది. శాంతి భద్రతలకు విఘాతం కలిగితే దాన్ని పరిరక్షించడం మళ్లీ రాష్ట్ర ప్రభుత్వాలకు పెద్ద సమస్య అవుతుంది. మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం వివిధ రూపాల్లో రాష్ట్రాలకు తీవ్ర హాని కలిగిస్తోంది.

❃

చరిత్ర

# ఆర్యులు: దస్యులు, దాసులు, చాతుర్వర్ణ వ్యవస్థ ఆవిర్భావం

ఎంవిఎస్ శర్మ



రచయిత సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, ప్రజాశక్తి సంపాదకులు

**ఋ**గ్వేదంలో ఆర్యులను 'విశులు' (అంటే ప్రజలు) అని, మంచి దేహచ్ఛాయ కలవారని, ఋగ్వేద దేవతలను ఆరాధిస్తూ, వారికి బలులిచ్చేవారని, ఇంద్రుని రక్షణలో ఉండేవారని వర్ణించారు. ఆర్యులు గాక ఇతరుల గురించి వచ్చిన ప్రస్తావనలలో 'దస్యుల'గురించినవి ప్రధానమైనవి. అందవిహీనంగా ఉంటారని, చట్టిముక్కులతో ఉంటారని, నల్లని దేహంతో ఉంటారని వర్ణనలు ఉన్నాయి. ఈ దస్యులను అణచివేసి తన 'తెల్లరంగు' సహచరులకు ఈ భూమిని జయించిఇచ్చాడని ఇంద్రుడిని కీర్తించిన ఋక్కులుఉన్నాయి. దస్యులు,దాసులు అనే రెండు పదాలనూ ఉపయోగించినా, ఆ రెండింటి మధ్యా పెద్ద తేడా ఏమీ చూపలేదు. తమ శత్రువుల గురించి ప్రస్తావించినప్పుడు ఈ రెండు పదాలనూ ఉపయోగించారు. నిజానికి దస్య, దాస అనే రెండు పదాలూ ఇండో-ఇరానియన్ పదాలే. దస్యు అనే పదానికి పోలిన 'దైన్హు' అన్న ఇరానియన్ పదం ఉంది. ఋగ్వేదంలో దస్య అన్న పదాన్ని శత్రువులను ప్రస్తావించి నపుడు ఉపయోగించారు. దైన్హు అన్న పదానికి కూడా శత్రువు అనే అర్థం. అదే విధంగా దాస అన్న పదానికి ఇరానియన్ పదం దాహ అన్నది ఉంది. రెండింటికీ బానిస అనేదే సమానార్థం. ఇటువంటి పదాలను ఆర్యులు తమలో తమకే ఆపాదించుకునే అవకాశం లేదు. అదే విధంగా ఈ పదాలను దస్యులు, దాసులు తమకు తామే ఆపాదించుకుని ఉండరు. కనుక తమను ఎదిరించిన ఆర్యేతరులకు ఆర్యులు ఈ నిందా పూర్వకమైన పేర్లను పెట్టారని అనుకోవాలి. దస్యులు అన్న పదంతో శత్రువులను గురించి చెప్పినంతగా దాసుల గురించి

చెప్పలేదు. దాస అన్న పదాన్ని కొందరు ఆర్య తెగలకు చెందిన వారికి కూడా ఉపయోగించారు. దివోదాసు, సుదాసుదు అన్న పేర్లతో ఇద్దరు ఆర్య తెగల నాయకుల గురించి ప్రస్తావనలు ఉన్నాయి.

ఈ దస్యులు లేదా దాసులు తెగలుగా జీవించినవారే. షిమ్యు తెగకు చెందిన నాయకుడు శంబరుడు అనేవాడికి 90 నుంచి 100 వరకూ కోటలు ఉన్నట్టు, వర్చినుడు అనే దాసుడికి పెద్ద సంఖ్యలో బలగాలున్నట్టు వర్ణన లున్నాయి. పణి తెగకు చెందిన వారువ్యాపారం చేసేవారిగా పేర్కొనబడ్డారు. తమను ఎదిరించిన ఈతెగల వారిని దస్యులు, లేదా దాసులు అని, తమతో పోరాడిన వారిని రాక్షసులు అని ఋగ్వేదంలో పేర్కొన్నారు.


ఆర్యుల తెగలు సింధునదీ పరీవాహక ప్రాంతానికి చేరిన వైనాన్ని రేఖామాత్రంగా ఋగ్వేదంలోని సాహిత్యాన్ని ఆధారం చేసుకుని మనం నిర్ధారించవచ్చు. ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోగల సరయు నది (దీనిని హరి-రుద్ అని కూడా అంటారు) సమీపం లో యదు, తుర్వశ తెగలకు చెందిన ఆర్యులకు, కొన్ని ఇతర ఆర్యతెగల ప్రత్యర్థులకు మధ్య జరిగిన యుద్ధంలో ప్రత్యర్థులను వధించిన యదు, తుర్వతి తెగలుతమ నేత తుర్వీతి సారధ్యంలో సింధు నదిని దాటి వచ్చారు. అదే విధంగా ఆఫ్ఘనిస్తాన్ లోని అర్గందబ్-హెల్మండ్ ప్రాంతంలోని సరస్వతి (దీనినే హరక్వైతి అని అంటారు) తీరంలో భరత తెగకు చెందిన ఆర్యులు దివోదాసు నాయకత్వంలో ఇంకొక ఆర్య తెగకు చెందిన పర్వతులను (వీళ్ళ నాయకుడు శంబరుడు అనే వాడు. ఇతడిని దాస శబ్దంతో ప్రస్తావించారు)ఓడించి సింధు ప్రాంతానికి చేరారు. యదు, తుర్వశ, ద్రహ్యు,అను, పురు అనే అయిదు తెగల గురించి పలు ప్రస్తావనలున్నాయి. సుదాసుడి నాయకత్వంలో భరత తెగకుచెందిన ఆర్యులు రావి నదీ తీరాన ఈ ఐదు తెగలతో పోరాడి ఆ తర్వాత బియాస్, సట్లెజ్ నదులను దాటి ప్రస్తు హర్యానా ప్రాంతం వచ్చి అక్కడభూములను ఆక్రమించినట్టు కథనాలు ఉన్నాయి.

ఈ కథనాలను బట్టిఆర్యులు స్థానికులైన దస్యులతోనేగాక తమ తోటి ఆర్యతెగలతో కూడా ఘర్షణలు పడినట్టు భావించాలి. ఈ ఘర్షణల్లో ఓడిన వారిని -ఆర్యులైనా, ఆర్యేతరులైనా - దాసులు గా - అంటే బానిసలుగా పరిగణించే వారని అనుకోవచ్చు. అనేక యుద్ధాలు జరిగి, వాటిలో ఓడిన, లంగిపోయిన జనం అంతా దాసులుగా - అంటే ఏ హక్కులూ లేని వారిగా - ఉండడం, వారి సంఖ్య బాగాపెరగడంతో అప్పటిదాకా ఉన్న మూడుసామాజిక తరగతులకు తోడు నాల్గవది చేరింది. పాలకులైన క్షత్రియులు, పురోహితులైన బ్రాహ్మణులు, సామాన్య పౌరులు - ఈ మూడు తరగతులకు తోడు శూద్రులు అనే అదనపు తరగతి తోడైంది.

ఋగ్వేదంలోని 10వ మండలం (అధ్యాయం)లో పురుషసూక్తం ఉంది. ఇందులోని భాషను బట్టి ఇది క్రీ.పూ. 1000 నాటిది అని, ఋగ్వేదంలో ఆఖరున దీనిని చేర్చివుంటారని చరిత్రకారులు నిర్ధారిస్తున్నారు. అందులో బ్రాహ్మణులు సృష్టికర్త ముఖం (నోటినుండి) నుండి, క్షత్రియులు అతని బాహువులనుండి,

వైశ్యులు అతని తొడలనుండి, శూద్రులు అతని పాదాలనుండి పుట్టినట్టు వర్ణించారు. ఈ సూక్తంలో వర్ణం లేదా కులం అనే ప్రస్తావన లేకపోయినా నాలుగు సామాజిక తరగతుల ప్రస్తావన వచ్చింది కనుక చాతుర్వర్ణ వ్యవస్థ గురించిన తొలి ప్రకటనగా దీనిని పేర్కొనవచ్చు. ఐతే అంతకు ముందే పురోహితులను బ్రాహ్మణులుగా, పాలకులను క్షత్రియులుగా, ఇతర సామాన్యపౌరులను వైశ్యులుగా (విశ్ అనే పదం నుండి వైశ్యుడు అన్న పదం వచ్చింది. విశ్ అంటే సామాన్యుడు అని అర్థం.) ప్రస్తావించడం ఉంది. ఇక శూద్ర అనే పదం ఓడిపోయి లొంగిపోయిన వారిని ఉద్దేశించి మొదటిసారి పురుషసూక్తంలోనే వాడారు. క్రమంగా ఆర్యేతరులలో దస్యులు, దాసులు అన్న పదాలు ఋగ్వేదానాంతర సాహిత్యంలో కనుమరుగై ఆర్యులు, శూద్రులు అన్న విభజన కొనసాగింది.

**❝ అవేస్త లోను, ఋగ్వేదంలోను ఉమ్మడిగా ఉన్న మానవాతీత శక్తులు ముప్పైమూడు ఉన్నాయి. తూర్పు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలో ఆర్య తెగలు సంచరిస్తూ వారిలో కొన్ని తెగలు భారత ఉపఖండం వైపు తరలిపోవడానికి ముందు కాలంలో ఈ శక్తుల పట్ల విశ్వాసాలు ఏర్పడివుండాలి. దేవతలు, అసురులు అని ఈ అతీత శక్తులను రెండు తరగతులుగా వారు విభజించారు. భారత దేశంలోకి వచ్చేసరికి అసురులు దుష్టశక్తులుగా పరిగణింపబడ్డాయి. అదే అవేస్తలో ఈ అసురులు ( అవేస్తలో అహురులు) దేవతలయ్యారు. ❞**




(మ్యాప్ క్రీ.పూ. 1400 నాటిసింధునది ప్రాంతం)

ఐతే పురుషసూక్తంలో నాలుగు వర్ణాల నిచ్చెనమెట్ల క్రమం ప్రస్తావన తప్ప ఇంకేమీ లేదని ఇక్కడ మనం గుర్తుంచుకోవాలి. ఏ వర్ణానికి ఆ వర్ణంలోపలే వివాహాలు జరగాలన్న నియమం గాని, ఫలానా వర్ణం వారు ఫలానా వృత్తి చేయాలన్న నియమం గాని పురుష సూక్తంలో లేవు.

**మత విశ్వాసాలూఆచారాలు**

ఋగ్వేదంలో ఆనాటి ఆర్యుల మత విశ్వాసాలు, వారుపాటించిన ఆచారాలు, ఆచరించిన క్రతువుల వివరాలు ఉన్నాయి. ఇండోఇరానియన్ మత గ్రంథం అవేస్త, ఋగ్వేదరా రెండింటిలోనూ చాలా ఉమ్మడి లక్షణాలు మనకు కనిపిస్తాయి. భారత ఉపఖండం వైపు వచ్చిన ఆర్యులకు, ఇరాన్ ప్రాంతం వైపు మళ్ళిన ఆర్యులకు మత విశ్వాసాలలో ఉండిన ఉమ్మడి లక్షణాలు గణనీయంగానే ఉన్నాయి.

అవేస్త లోను, ఋగ్వేదంలోను ఉమ్మడిగా ఉన్న మానవాతీత శక్తులు ముప్పైమూడు ఉన్నాయి. తూర్పు ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలో ఆర్య తెగలు సంచరిస్తూ వారిలో కొన్ని తెగలు భారత ఉపఖండం వైపు తరలిపోవడానికి ముందు కాలంలో ఈ శక్తుల పట్ల విశ్వాసాలు ఏర్పడివుండాలి. దేవతలు, అసురులు అని ఈ అతీత శక్తులను రెండు తరగతులుగా వారు విభజించారు. భారత దేశంలోకి వచ్చేసరికి అసురులు దుష్టశక్తులుగా పరిగణింపబడ్డాయి. అదే అవేస్తలో ఈ అసురులు ( అవేస్తలో అహురులు) దేవతలయ్యారు. అహుర మజ్దా వారి ప్రధాన దేవత అయాడు. ఋగ్వేదంలోని ఇంద్రుడు అవేస్తలో వృత్రాహన్ (వృత్రుడిని సంహరించిన వాడు అని అర్థం. ఇదే అర్థంతో ఋగ్వేదం లోనూ వర్ణించారు) అయాడు. వరుణుడు, మిత్రుడు రెండు గ్రంథాలలోనూ దేవతలే. ఋగ్వేదంలో వరుణుడికి సన్నిహితుడైన మిత్రుడు అవేస్తలో సూర్యదేవుడైనాడు. అశ్వినీ దేవతలు అవేస్తలో నవోహైత్య అనే అసురుడిగా వర్ణించ బడ్డారు. యముడు అవేస్తలో ఇముడు అయాడు. ఋగ్వేదం రుతం గురించి చెప్పింది. ఈ రుతం అన్న పదం నుండే వ్రతం అన్న పదం వచ్చింది. అంటే మానవులు శ్రద్ధగా అనుసరించవలసిన పద్ధతులు అని అర్థం. అంటే తప్పకుండా పాటించవలసిన ఆచారాలు, నియమాలు అని మనం గ్రహించాలి. ఈ రుతం అన్న పదం అవేస్తలో అర్త అయింది. ఋగ్వేదంలో యజ్ఞం అవేస్తలో యశ్న అయింది. యజ్ఞం నిర్వహించే వాడు ఋగ్వేదంలో హోత అయితే అవేస్తలో జోతర్ అయాడు. యజ్ఞంలో సేవించే పానీయం సోమరసం. దానినే అవేస్తలో హోమ అన్నారు. హోమకుండాన్ని (నిప్పు)నిర్వహించేవాడు అథర్వుడు. ఇతడే అవేస్తలో అథర్వన్ అయాడు.

ఋగ్వేదంలో కాని, అవేస్తలో కాని విగ్రహారాధన ప్రస్తావన ఎక్కడా లేదు. అంటే తొలినాటి ఆర్యులు విగ్రహారాధకులు కారు. సింధునాగరికతలో ప్రజలు ప్రకృతిశక్తులను, జంతువులను. మానవాకారాలను కలిగివున్న దేవతామూర్తులను ఆరాధించారు. తొలినాటి ఆర్యులు ఇందుకు భిన్నం. నిప్పు, సూర్యుడు వంటి కంటికికానవచ్చే ప్రకృతి రూపాలను ఆర్యులుఆరాధించారు. అవిగాక, వరుణుడు వంటి అగోచర దేవతను రుతానికి ప్రతినిధిగా ఆరాధించారు. యుద్ధ నాయకుడిగా ఇంద్రుడిని కొలిచారు.

ఋగ్వేదంలో ఆరాధన పద్ధతుల్లో దేవతలకు పాలు, పెరుగు, నెయ్యి, ధాన్యం, రొట్టెలు వంటి వస్తువులతోబాటు మేకలు, ఎద్దులు, ఆవులు, గొర్రెలు, గుర్రాలు వంటి జంతువులను కూడా వధించి కానుకలుగా ఇచ్చేవారు. ఈ కానుకలకు వారు పెట్టిన పేరు 'బలి'. వీటితో పాటు ఇంకో ముఖ్యమైన కానుక సోమరసం. ఇది ఒక మొక్క నుంచి తీసిన రసాన్ని పాలతో, నీటితో కలిపి చేసే పానీయం. (భంగు తరహాలో)

బలి ఇచ్చిన జంతువులను కాల్చి దేవతలకు సమర్పించేవారు. అందుచేత యజ్ఞంలో అగ్ని ఒక ముఖ్యమైన పాత్ర పోషించింది. ఋగ్వేదంలో దాదాపు 200 ఋక్కులు అగ్ని వర్ణనతో ఉంటాయి. ఐతే అందరికన్నా ఎక్కువ స్తుతించ బడినదేవత ఇంద్రుడు. దస్యులను, దాసులను, ఇతర శత్రువులను సంహరించి ఆర్యులను కాపాడిన నాయకుడిగా ఇంద్రుడిని స్తుతించారు. ఆర్యతెగలుతమలో తాము ఘర్షణ పడుతున్న పుడుసైతం ఇంద్రుడు ఆ ఘర్షణలో ఎవరి పక్షం వహిస్తే వారిదే విజయం. విపరీతంగా సోమ

రసం తాగి ఇంద్రుడి పొట్ట బానకడుపు అయిందని, అతడికి దున్న మాంసం అంటే చాలా ప్రీతి అని, అనేక గుర్రాలు లాగే రథంమీద ఇంద్రుడు ప్రయాణం చేస్తాడని వర్ణనలు ఉన్నాయి. ఆ తర్వాత కాలంలో ఏర్పడిన రాచరిక వ్యవస్థల్లో పాలకులెరీతిన వ్యవహరిస్తారో ఈ వర్ణనల్లో మనకు రేఖామాత్రంగా కనపడుతుంది. త్రిమూర్తులలో శివుడు ఋగ్వేదంలో రుద్రుడిగా వర్ణించబడ్డాడు. పిడుగుపాటు ఇతడి ఆయుధం. విధ్వంసానికి మారుపేరు. విష్ణువు ప్రస్తావన ఉంది కాని త్రిమూర్తులు ఎవరూ ఇంద్రుడి స్థాయిలో స్తుతులు పొందలేదు. సూర్యుడు, అగ్ని తో బాటుస్తుతించబడిన దేవత ఉషస్సు (సూర్యోదయం)

> ❝ యజ్ఞాల్లో ఇచ్చే బలులకు దేవతలు స్పందించాలంటే మంత్రాలను సరైన పద్ధతిలో ఉచ్చరించడం కీలకం అని భావించేవారు. అందుకే యజ్ఞాల తంతును నడిపించే హోత్రి కీలకం అయాడు. యజ్ఞాన్ని నిర్వహించేవాడు యజమాని. అతడికి యజ్ఞ ఫలం దక్కాలంటే దానిని సక్రమంగా నిర్వహించే హోత్రికి బాగా పారితోషకం, కానుకలు ముట్టజెప్పుకోవాల్సిందే. ఈజిప్టులో గాని పశ్చిమాసియాలో గాని దేవాలయాలకు చాలా ప్రాధాన్యత ఉంది. కాని వేద పురోహితులకు అవి అక్కరలేదు. ❞

యజ్ఞాల్లో ఇచ్చే బలులకు దేవతలు స్పందించాలంటే మంత్రాలను సరైన పద్ధతిలో ఉచ్చరించడం కీలకం అని భావించేవారు. అందుకే యజ్ఞాల తంతును నడిపించే హోత్రి కీలకం అయాడు. యజ్ఞాన్ని నిర్వహించేవాడు యజమాని. అతడికి యజ్ఞ ఫలం దక్కాలంటే దానిని సక్రమంగా నిర్వహించే హోత్రికి బాగా పారితోషకం, కానుకలు ముట్టజెప్పుకోవాల్సిందే. ఈజిప్టులో గాని పశ్చిమాసియాలో గాని దేవాలయాలకు చాలా ప్రాధాన్యత ఉంది. కాని వేద పురోహితులకు అవి అక్కరలేదు.

యజ్ఞాలు సంపన్నులు మాత్రమే నిర్వహించగలరు. మరి సామాన్యుల మాటేమిటి? పంటపొలాన్ని రక్షించే క్షేత్రపతి, పొలాన్ని దున్నే నాగటి చాలు (సీత అంటే నాగటి చాలు అని అర్థం) ఇంటిని రక్షించే వాస్తుపతి, సంతాన దేవత వంటి దేవతల ప్రస్తావనలు కూడా ఋగ్వేదంలో ఉన్నాయి. ఐతే ఈ దేవతల ఆరాధనలో యజ్ఞాలూ లేవు, పురోహితులకు ఎటువంటి పాత్రా లేదు.

ఋగ్వేదంలోని ఆఖరి మండలంలో పెళ్ళికి, చావుకు సంబంధించిన మంత్రాలు ఉన్నాయి. క్రమంగా సమాజం మొత్తాన్ని బ్రాహ్మణ పురోహితుల పెత్తనం కిందకు తీసుకు వచ్చే ప్రయత్నంలో భాగం గానే ఇవి రూపొందాయని చెప్పవచ్చు.

సృష్టికర్త ఒక్కడే అన్న ధోరణివైపు ఋగ్వేద ఆర్యులు మొగ్గు చూపినట్టు కనపడుతుంది. ఋగ్వేదపు చివరి కాలంలో చేర్చిన పురుషసూక్తం సారాంశంలో మొత్తం ప్రజలందరూ ఆ సృష్టికర్తనుండి వచ్చినవారేనన్న భావన ఉంది. ఆదిపురుషుడిని బలి ఇచ్చిన మహా యజ్ఞంలో ఆ శరీరం నుండే నాలుగు వర్ణాల ప్రజలూ, వారితోబాటు అగ్ని, సూర్యుడు, చంద్రుడు, ఇంద్రుడు వంటి దేవతలు కూడా ఆవిర్భవించారని పురుషసూక్తం చెప్తుంది.

ఋగ్వేదంలో భౌతికవాద తాత్విక ధోరణులు కూడా ఉన్నాయి. పదవ మండలంలో గురు, శిష్యుల సంభాషణ రూపంలో అసలు ఈ విశ్వం ఎందుకు, ఎలా వచ్చింది? ఆదిపు రుషుడినుంచి వచ్చివుంటే ఆ ఆదిపురుషుడెలా వచ్చాడు? వంటి లోతైన ప్రశ్నలున్నాయి.

### సంస్కృతి

భాష్ణ ఋగ్వేద భాషకు రాతపూర్వక లిపి లేదని ముందే చెప్పుకున్నాం. నిజానికి క్రీ.పూ. 4వ శతాబ్దం వరకూ మన దేశంలో లిపి లేదు. అందుచేత అచ్చులు, హల్లులు అనే విభజన లేదు. నోటిద్వారా ఉచ్చరించే శబ్దమే ప్రాతిపదిక. ఒక దగ్గర చెప్పినదాన్నే తిరిగిపదే పదే చెప్పే విధానం ఉండేది. అందుచేత ఋగ్వేదం కవితాత్మకంగా ఉండే కావ్యం అనడానికి వీలు లేదు. ఐతే సూర్యోదయ వర్ణన, ఊర్వశి–పురూరవ ప్రేమగాథ, యమ–యమి సంవాదం వంటి సందర్భాలలో కవిత్వపు వివిధ రసాలు వ్యక్తం అయాయి.

శాస్త్ర విజ్ఞానమ్ణ సైన్సు కు సంబంధించి ఋగ్వేదంలో ఉన్న పరిజ్ఞానం చాలా ప్రాథమిక దశకు చెందినది. పదులు, వందలు, వేలు వంటి అంకెల ప్రస్తావన ఉన్నా అవి పెద్ద మొత్తంలో ఉన్న వాటిని వర్ణించడానికే పరిమితం. అంతే తప్ప అప్పటికే 'సున్నా' ను కనుగొన్నారంటూ ఇటీవల కొందరు చేస్తున్న ప్రచారం బత్తిగా అర్థరహితం. కాలాన్ని కొలిచేందుకు సౌరమానం గురించి ప్రస్తావించారు. ఐతే అందులో 360 రోజులే ఉన్నాయి. కొరవ రోజులను ఏవిధంగా సర్దుబాటు చేశారన్నది వివరం లేదు. ఖగోళ పరిజ్ఞానం చాలా తక్కువ. భూమిని గోళాకారంలో గాక, చక్రాకారంలో ఊహించారు.

వైద్యమ్ణ వైద్యం ప్రస్తావన ఉంది. ప్రధానంగా మూలికావైద్యం చేసేవారు. ఐతే దానికన్నా,రోగం తగ్గడానికి ప్రార్థనలపై, మంత్రాలపై ఆధారపడ్డారు.

వినోద కార్యక్రమాలలో ప్రధానంగా రథాలపోటీ గురించిన ప్రస్తావనలున్నాయి. పాచికలాట మరో ముఖ్యమైన వినోదం. ఇవి సంపన్న, ఆధిపత్య వర్గాలకేనని వేరే చెప్పనక్కర లేదు.

**ఋగ్వేదం రూపకల్పనా వివిధ దశలు**

ఋగ్వేదంలోతొలిసూక్తులు.....క్రీ.పూ. 1500
మొదటి ఆరు మండలాలు............1400
మొదటిమండలంలో 51 నుండి 191 వరకు ఋక్కులు............................1300
8వమండలం........................1200
9వ మండలం సోమరస స్తుతులు....1100
10వ మండలం......................1000


## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!


'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**

ఈ మాసం ప్రత్యేకం

# వ్యవసాయ చట్టాలతో రైతుకు మరణశాసనం



రచయిత సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు

**వి శ్రీనివాసరావు**

కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నవంబర్ 26 నుంచి ఢిల్లీ సరిహద్దుల్లో లక్షలాది మంది రైతులు బైఠాయించారు. ఎముకలు కొరికే చలిలో రోడ్లపక్కన ట్రాక్టర్ ట్రాలీలనే వసతులుగా మార్చుకొని సామూహిక భోజనశాలల్లో వంటలు చేసి, తాము తింటూ ఇతరులకు పెడుతూ అవిశ్రాంతంగా ఆందోళన చేస్తున్నారు. వ్యవసాయ చట్టాలు రద్దు చేయందే వెనక్కి తిరిగేది లేదని తెగేసి చెప్తున్నారు. పసిపిల్లలు మొదలుకొని వృద్ధుల వరకు మహిళలతో సహా రేయింబవళ్లు అక్కడే క్యాంపు చేశారు. అదే రోజు దేశమంతా కార్మిక సమ్మె, గ్రామీణ బంద్ జరిగాయి. ఈ ఉద్యమం మొదలై మూడు నెలలు దాటింది. జూన్‌లో కేంద్ర ప్రభుత్వం హడావుడిగా కరోనా లాక్ డౌన్ ను కూడా లెక్కచేయకుండా వ్యవసాయ సంస్కరణల పేరుతో మూడు ఆర్డినెన్సులు జారీ చేసింది. అవి 1) వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య (ప్రోత్సాహం, అవకాశాల కల్పన) చట్టం, 2) రైతు (సాధికారిత, రక్షణ) ధరల హామీ, వ్యవసాయ సేవల ఒప్పంద చట్టం, 3)నిత్యావసర సరుకుల (సవరణ) చట్టం. సెప్టెంబర్ 5వ తేదీన వీటిని పార్లమెంట్‌లో ఆమోదానికి పెట్టారు. ఎంపీల అభిప్రాయాలు వినలేదు. బిల్లులను చర్చించే స్టాండింగ్ కమిటీకీ పంపలేదు. ఓటింగుకూ అనుమతించలేదు. మైకులు, టీవీ కెమేరాలు ఆఫ్ చేసి నిరంకుశంగా చట్టాల ఆమోదం పొందినట్టుగా ప్రకటించేశారు. అంతే హడావుడిగా రాష్ట్రపతి ఆమోదముద్ర వేయించి క్షణాల్లో నోటిఫికేషన్ కూడా జారీచేశారు. దేశభవిష్యత్తును ప్రభావితం చేసే ఇంతటి ముఖ్యమైన వ్యవసాయ చట్టాలను ఏకపక్షంగా మూడునెలల వ్యవధిలో తీసుకురావాల్సిన అవశ్యకత ఏమిటి? ఎవరి కోసం ఈ బిల్లులు తెచ్చారు. రైతుల కోసమే అని చెబుతున్న ప్రభుత్వం రైతులతో కాని, రైతు సంఘాలతో కాని చర్చించలేదు. ఆఖరికి ఎంపీల మాట వినటానికి సిద్ధపడలేదు. డిసెంబర్ 8వ తేదీ రైతులతో జరిగిన చర్చల సందర్భంగా హోం మంత్రి అమిత్ షా తమకు కొన్ని కంపల్షన్స్ (ఒత్తిళ్లు) ఉన్నాయని చెప్పారు. బహిర్గతం కాని ఆ ఒత్తిళ్లు కార్పొరేట్ శక్తుల నుంచే అన్న విషయాన్ని ఎవరైనా అర్థం చేసుకోగలరు. అందులో ప్రధానమైన పాత్ర అంబానీ, అదానీలదే. అందుకే వ్యవసాయ చట్టాల రద్దుతో పాటు అంబానీ, అదానీల ఉత్పత్తులకు వ్యతిరేకంగా కూడా రైతులు పోరాడుతున్నారు. ఇది ప్రత్యక్షంగా వ్యవసాయ చట్టాల రద్దుకు జరుగుతున్న పోరాటం. పరోక్షంగా రైతుల్ని నిలువు దోపిడీ చేస్తున్న కార్పొరేట్ శక్తులకు, శ్రమనే నమ్ముకున్న రైతాంగానికి మధ్య సాగుతున్న సమరం.

### చారిత్రాత్మక పోరాటం

దేశ చరిత్రలో ఇన్ని రోజులు శాంతియుతంగా లక్షలాది మంది రైతులు దేశరాజధానిని దిగ్బంధం చేయడం అపూర్వం. అనేక సంఘాలు, వివిధ రాష్ట్రాల రైతులున్నప్పటికీ ఐక్యంగా సాగుతున్నారు. రాజకీయపార్టీలకు అతీతంగా విశాలవేదికగా ఇది నడుస్తోంది. వారి సహనం, క్రమశిక్షణ చూసిన వారంతా ముక్కుమీద వేలేసుకుంటున్నారు. చారిత్రత్మకమైన ఈ పోరాటంలో ఇప్పటికే 31 మంది రైతులు బలైపోయారు. చలిగాలులకు తట్టుకోలేక కొందరు, ప్రమాదాల్లో మరికొందరు మరణించారు. పంజాబ్, హర్యానాల నుంచే కాక ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ వంటి ఢిల్లీ చుట్టుపక్కల రాష్ట్రాల నుంచి రైతులు వచ్చి చేరుతున్నారు. ఈ ఉద్యమానికి మద్దతుగా దేశంలోని అన్ని ప్రాంతాల్లో రైతులు పెద్ద సంఖ్యలో ఆందోళనలకు దిగారు. 22 రాష్ట్రాల్లో 20వేల కేంద్రాల్లో నిరసనలు కొనసాగుతున్నాయి. డిసెంబర్ 8 భారత్ బంద్ ఎవరూ ఊహించని విధంగా జయప్రదం అయింది. రైతులకు అండగా కార్మికులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, యువజన, విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు, దళితులు, ఆదివాసీలు ఇలా.. వివిధ తరగతుల, వర్గాల ప్రజలు సంఘీ భావం తెలియజేస్తున్నారు. కార్మికులు, ఉద్యోగులు పెద్దఎత్తున విరాళాలు, వస్తువులు అందిస్తున్నారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిస్తున్నాయి. అంతర్జాతీయంగా కూడా దీనికి సంఘీభావం వెల్లడవుతోంది. ఐక్యరాజ్యసమితి కూడా స్పందించింది. కెనడా ప్రధాని బలపరిచారు. ఇంత విస్తృతంగా మద్దతు పొందిన ఉద్యమం బహుశా ఈ మధ్యకాలంలో జరగలేదు.

### రైతులపై నిర్బంధం

ఈ మహత్తర ఉద్యమానికి తలొగ్గి శాసనాలు వెనక్కి తీసుకోవడానికి బదులు కేంద్ర ప్రభుత్వం, బీజేపీ రైతులపై ఎదురుదాడికి పూనుకుంటున్నది. మొదటి నుంచి దీన్ని రైతులు వ్యతిరేకిస్తున్నా ఏనాడు చర్చించడానికి సిద్ధపడలేదు. కనీసం పరిగణలోకి కూడా తీసుకోలేదు. పంజాబ్ లో రైలు పట్టాలపై రైతులు బైటాయించినా లెక్కచేయలేదు. పైగా ప్రతీకారంగా ఎరువులు సరఫరా చేసే రైల్వేవ్యాగన్లను నిలిపివేసింది. నవంబర్ 26 ఛలో ఢిల్లీకి నెల రోజులు ముందే పిలుపునిచ్చినా పట్టించుకోలేదు. రైతులు లక్షల సంఖ్యలో ట్రాక్టర్లపై ఢిల్లీ చేరుకుంటుంటే సరిహద్దుల్లోనే ఆటంకాలు సృష్టించింది. ముళ్ల కంచెలు వేసింది. ఢిల్లీ రోడ్లన్నీ దిగ్బంధనం చేసింది. శత్రుదేశంపై సైనిక చర్య లాగా కందకాలు తవ్వింది. అయినా లెక్కచేయకుండా రైతులు ప్రవేశిస్తుంటే బాష్పవాయువు, నీటిఫిరంగులు ప్రయోగించింది. దుర్మార్గంగా లాఠీచార్జి చేసింది. బెదిరిపోయి రైతులు వెనక్కి తిరుగుతారని కేంద్ర ప్రభుత్వం భావించింది. ఢిల్లీకి చేరుకొని రాంలీలా మైదానంలో ఢిల్లీ పౌరులకు ఇబ్బంది లేకుండా శాంతియుతంగా ధర్నా చేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. కాని సరిహద్దుల్లోనే

రైతుల్ని నిలవరించి సరిహద్దుల్ని దిగ్బంధనం చేసింది కేంద్ర ప్రభుత్వమే. కాని రైతులు ముందడుగు వేయడానికే సిద్ధపడటంతో రోడ్లమీదనే రైతులను అనుమతించక తప్పలేదు. రైతుల సంఖ్యను, వారి పట్టుదలను తక్కువ అంచనా వేసిన ప్రభుత్వం చివరకు దిగొచ్చి చర్చలకు సిద్ధపడింది.

> **“ ఢిల్లీకి చేరుకొని రాంలీలా మైదానంలో ఢిల్లీ పౌరులకు ఇబ్బంది లేకుండా శాంతియుతంగా ధర్నా చేయాలని రైతులు నిర్ణయించుకున్నారు. కాని సరిహద్దుల్లోనే రైతుల్ని నిలవరించి సరిహద్దుల్ని దిగ్బంధనం చేసింది కేంద్ర ప్రభుత్వమే. కాని రైతులు ముందడుగు వేయడానికే సిద్ధపడటంతో రోడ్లమీదనే రైతులను అనుమతించక తప్పలేదు. రైతుల సంఖ్యను, వారి పట్టుదలను తక్కువ అంచనా వేసిన ప్రభుత్వం చివరకు దిగొచ్చి చర్చలకు సిద్ధపడింది. ”**

### చర్చలు ఓ ప్రహసనం

లక్షల సంఖ్యలో రైతులు ఢిల్లీకి చేరుకోవాలని ప్రయత్నించడంతో సరిహద్దుల్లోనే వారిని ఆపేసి బురానీ గ్రౌండ్‌కి తరలిపోవాలని ప్రభుత్వం కోరింది. అది బహిరంగ జైలు వంటిదని, తాము వెళ్లబోమని సింగు, సిక్రి రోడ్లపైనే బైటాయించారు. ధర్నా ఎక్కడ జరపాలో చర్చిద్దాం రమ్మని హోంమంత్రి ఆమిత్ షా వారిని పిలిచారు. ధర్నా స్థలంపై కాక వ్యవసాయ చట్టాలపైనే తాము చర్చిస్తామని, అది కూడా ఉన్నతస్థాయి ప్రతినిధి బృందంతోనే చర్చిస్తామని రైతులు ప్రకటించారు. గత్యంతరం లేని ప్రభుత్వం ముగ్గురు మంత్రులతో చర్చలకు బృందాన్ని సిద్ధం చేసింది. రైతు ఉద్యమానికి స్పందించిన ప్రధాని కనీస మద్దతు ధర ఉంటుందని ప్రకటించారు. ప్రధాని మాటనే హామీగా తీసుకొని ఉద్యమాన్ని విరమించాలని మంత్రులు కోరారు. నోటిమాట హామీలను విశ్వసించబోమని రైతులు చెప్పడంతో రాత పూర్వకంగా ఇస్తామని ప్రకటించారు. రాత పూర్వక హామీకి చట్టబద్ధత ఏమిటని ప్రశ్నించడంతో చట్ట సవరణ చేస్తామని చెప్పారు. చట్ట సవరణలు కాదు, చట్టాలనే వెనక్కి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. చర్చల కోసం ముందు పంజాబ్, హర్యానా ప్రతినిధులను మాత్రమే పిలిచారు. జాతీయ నాయకులు లేకుండా తాము చర్చలకు రాబోమని చెప్పడంతో వారిని కూడా ఒకరిద్దరిని చేరుస్తామన్నారు. ఒకరిద్దరు కాదు, ఒక బృందాన్నే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో చివరకు 40మంది ప్రతినిధివర్గంతో చర్చలుచేశారు. ఐదు దఫాలుగా జరిగిన ఈ చర్చల్లో ఏమీ తెలలేదు. చట్టాల్లో కొన్ని సవరణలు చేస్తామని వారు ప్రతిపాధించిన అంశాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరించే పరిధిలోనే వారి సవరణలు ఉన్నాయి. కనీస మద్దతు ధరకు గ్యారంటీ కాని, మార్కెట్ యార్డులను బలపరిచే సవరణలు కాని లేవు. అందుకే రైతుసంఘాల ప్రతినిధులు ఈ సవరణలను తిరస్కరించారు. చర్చలు నిలిచిపోయాయి. రైతుల డిమాండ్ల పరిశీలనకు కమిటీ వేస్తామని చెప్పారు. ఆరేండ్లుగా “మన్‌కిబాత్” పేరుతో మీరు చెప్పింది వింటున్నాం. ఇప్పుడు మేం చెప్పేది మీరు వినమని ప్రధానికి రైతులు చెప్పారు. కమిటీ వేయడమంటే ఆపేరుతో కాలయాపన చేయడానికి తప్ప అది ఎందుకూ కొరకాదని రైతుసంఘాలు తిరస్కరించాయి. రోజులు గడిచేకొద్దీ రైతుల సంఖ్య తగ్గి ఉద్యమం బలహీనపడు తుందని భావించిన ప్రభుత్వానికి ఆశాభంగం అయింది. కొంతమంది డమ్మీ నాయకుల్ని పిలిపించుకొని, చర్చలంటూ ప్రచారం చేసుకుంటోంది. ప్రతిరోజూ వేలసంఖ్యలో రైతులు వచ్చి చేరుతూనే ఉన్నారు. కొత్త ప్రాంతాల నుంచి వస్తున్నారు. ఒకరు పోతే పదిమంది చేరుతున్నారని ప్రముఖ జాతీయ పత్రిక ఒకటి వ్యాఖ్యానించింది. డాక్టర్లు, లాయర్లు, ఐటీ నిపుణులు, పోలీసు అధికారులు, క్రీడాకారులు, సినిమా నటులు, ఆఖరికి పరమ వీరచక్ర బిరుదాంకితులైన మాజీ సైనికులు కూడా ఉద్యమానికి మద్దతు తెలుపుతున్నారు. క్యాంపుల్లో చేరి సేవలు అందిస్తున్నారు. ఆంధ్ర, తెలంగాణ నుంచి కూడా డాక్టర్ల బృందం వెళ్లి సేవలు అందించింది. ఈ ఉద్యమానికి వ్యతిరేకంగా దాఖలైన కేసులపై వ్యాఖ్యానిస్తూ సుప్రీం కోర్టు “శాంతియుతంగా ఆందోళన తెలిపే హక్కు రైతులకు ఉందని, అందులో తాము జోక్యం చేసుకోలేమ”ని స్పష్టం చేసింది. చట్టాల అమలును తాత్కాలికంగా వాయిదా వేసి రైతుసంఘాలతో చర్చించమని ప్రభుత్వానికి సూచించింది. కాని చట్టాల అమలును నిలిపివేయడానికి కేంద్రం నిరాకరించింది. బీజేపీ జాతీయ నాయకులు ఒకరు రాసిన పత్రికావ్యాసంలో ఒకటి రెండు చిన్న సవరణలు అవసరమైతే చేయొచ్చు తప్ప చట్టాలు అమలుకావాలని చెప్పారు. ఈ చర్చల్లో కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించే డిమాండును ప్రభుత్వం పదేపదే తిరస్కరిస్తూ వచ్చింది. అందుకే రైతులు ఈ చట్టాలు పూర్తిగా ఉపసంహరించుకోవాలని మరింత ఉధృతంగా ఆందోళన చేస్తున్నారు. తాము సమస్య పరిష్కారానికి సుముఖంగా ఉన్నామని జనాన్ని నమ్మించడానికి బీజేపీ ప్రభుత్వం చర్చలను ఓ ప్రహాసనంగా చేపట్టింది. చర్చలు నడపటంలో వారికి చిత్తశుద్ధి, నిజాయితీ లేదు.

కేంద్ర ప్రభుత్వం మొదట ఈ ఉద్యమాన్ని పట్టించుకోలేదు. తర్వాత నిర్బంధంగా అణచాలని చూసింది. దానికీ లొంగకపోవ డంతో చీలికలు పెట్టాలని చూసింది. ఆ ప్రయత్నమూ విఫలం అవడంతో ఇప్పుడు తప్పుడు ప్రచారం ఆరంభించింది. ఈ ఉద్యమాన్ని నైతికంగా దెబ్బకొట్టాలని, అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నది. తద్వారా దీన్ని భౌతికంగా అణిచి వేయడానికి రోడ్డు మ్యాపును సిద్ధం చేసింది.

### రైతులపై దుష్ప్రచారం

ఈ ఉద్యమంలో రైతులు ఎవరూ లేరు, కొన్ని రాజకీయ పార్టీలు పోగేసిన అల్లరి మూకలని ప్రభుత్వం మొదట దుష్ప్రచారానికి దిగింది. లక్షల సంఖ్యలో రైతుల్ని ప్రత్యక్షంగా వీక్షించిన దేశప్రజల కళ్లు కప్పలేకపోయారు. దీనిలో ఖలిస్తానీ ఉగ్రవాదులు చేరారంటూ ప్రచారం మొదలు పెట్టింది. దాన్ని జనం నమ్మలేదు. చైనా, పాకిస్తాన్ ఏజెంట్లు జొరబడి నడుపుతున్నారని ప్రచారం చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీలు డబ్బులిచ్చి నడుపుతున్నారని ప్రచారం చేసింది. ఇంకొన్ని రోజులయ్యాక మావోయిస్టులు చేరారంటున్నారు. ఇప్పుడేమో సంఘ వ్యతిరేక శక్తులు నడుపుతున్నాయంటున్నారు. ఇన్ని రోజులుగా ఉద్యమం నడుస్తున్నా చిన్న ఘటన కూడా జరగలేదు. బిజేపీకి ఇది నచ్చడం లేదు. ఏదో ఒక రకంగా శాంతియుతంగా సాగుతున్న ఆందోళనను పక్కదారి పట్టించి హింసను ప్రేరేపించి, అణచి వేయాలని పథకం పన్నుతోంది. ప్రధానమంత్రి సైతం అబద్దాలనే ఆయుధాలుగా మలుచుకుంటున్నారు. ఇప్పుడు రైతులు, రైతుకష్టాలపై మొసలికన్నీరు కారుస్తూ ఈ కష్టాల నుంచి

> **" ప్రతిపక్షాలు రాజకీయ దురుద్దేశంతో రైతులను రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఈ ఉద్యమాన్ని ఏ రాజకీయపార్టీ ప్రారంభించలేదు. పైగా లక్షల సంఖ్యలో రైతులు వీధుల్లోకి రావడంతోనే రాజకీయ పార్టీలు స్పందించాయి. ఈ రైతుల్లో అన్ని పార్టీల వారు ఉన్నారు. అఖరికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వారిని బలపరిచేవారూ ఉన్నారు. అన్ని కులాలు, మతాలవారు ఉన్నారు. సూర్యుడిపై ఉమ్మేసినట్టు ఈ ఉద్యమంపైదుష్ప్రచారం చేయడమంటే ప్రభుత్వం తన కళ్లు తానే పొడుచుకున్నట్లు. "**

విముక్తి చేయడానికే చట్టాలు తెచ్చామంటున్నారు. ప్రతిపక్షపార్టీలు పనిగట్టుకొని రైతులను తప్పు దారి పట్టిస్తున్నాయని ఆరోపిస్తున్నారు. రైతులు తమ సమస్యల గురించి, చట్టాల ఉపసంహరణ గురించి మాట్లాడుతుంటే ప్రధాని రాజకీయాల గురించి, రాజకీయపార్టీల గురించి మాట్లాడుతున్నారు. చెప్పిన అబద్ధాలనే పదేపదే చెప్తున్నారు.

**ఎవరు ఎవరిని ప్రభావితం చేస్తున్నారు?**

ప్రతిపక్షాలు రాజకీయ దురుద్దేశంతో రైతులను రెచ్చగొడుతున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తున్నది. ఈ ఉద్యమాన్ని ఏ రాజకీయపార్టీ ప్రారంభించలేదు. పైగా లక్షల సంఖ్యలో రైతులు వీధుల్లోకి రావడంతోనే రాజకీయ పార్టీలు స్పందించాయి. ఈ రైతుల్లో అన్ని పార్టీల వారు ఉన్నారు. అఖరికి బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ వారిని బలపరిచేవారూ ఉన్నారు. అన్ని కులాలు, మతాలవారు ఉన్నారు. సూర్యుడిపై ఉమ్మేసినట్టుగా ఈ ఉద్యమంపై దుష్ప్రచారం చేయడం అంటే ప్రభుత్వం తన కళ్లు తానే పొడుచుకున్నట్లు. ఉద్యమశక్తిని చూశాకే అనేక పార్టీలు, సంస్థలు, వ్యక్తులు, సంఘాలు మద్దతుగా ముందుకు వచ్చాయి. ఇప్పటివరకు మౌనంగా ఉన్నవారు కూడా నోరుతెరిచారు. బీజేపీ మిత్రపక్షంగా ఉన్న అకాళిదళ్ రాజీనామా చేసి కేంద్ర ప్రభుత్వం నుంచి బయటకు వచ్చింది. మరో మిత్రపక్షం హర్యానాపార్టీ నాయకుడు చౌతాలా ఈ ఉద్యమాన్ని బలపరుస్తున్నారు. పార్లమెంటులో ఈ చట్టాలకు ఓటేసిన వైయస్సార్, తెలుగుదేశం పార్టీలు ఇప్పుడు తటస్థంగా మారాయి. ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తున్నారు. టీఆర్‌ఎస్, డీఎంకే, సమాజ్ వాద్ పార్టీ, త్రుణముల్ కాంగ్రెస్, శివసేన, ఆర్జేడీ, ఎన్సీపీ, ఆమ్ ఆద్మీ వంటి అనేక ప్రాంతీయ పార్టీలు రైతు ఉద్యమానికి ప్రత్యక్షంగా మద్దతు ప్రకటించాయి. వామపక్ష పార్టీలు ఈ ఉద్యమంలో చురుగ్గా ఉన్నాయి. ఇదంతా రైతాంగ ఉద్యమ ప్రభావం. రాజకీయ పార్టీలు రెచ్చగొడితే రంగంలోకి రాలేదు. రైతులు రంగంలోకి వచ్చారు కాబట్టేరాజకీయపార్టీలు వచ్చాయి. న్యాయమైన రైతాంగ పోరాటానికి మద్దతునిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం మొండి తనం, బీజేపీ రైతు వ్యతిరేక ధోరణి దీనికి అవకాశం ఇచ్చాయి.

**చట్టాలు ఎందుకు వద్దు**

కాయ కష్టం చేసుకునే రైతు కేంద్రంగా ఉన్న వ్యవసాయాన్ని కార్పొరేట్ వ్యవసాయంగా మార్చడమే ఈ చట్టాల ప్రధాన ఉద్దేశం. అందుకోసమే మూడు వ్యవసాయ చట్టాలు చేసింది. వీటితో పాటు విద్యుత్ చట్టాన్ని సవరించింది. ఈ నాలుగు చట్టాలు రైతుకు మరణశాసనం రాశాయి. మరణశాసనానికి సవరణలు ఉండవు. ఉపసంహరించు కోవడమా, అమలుచేయడమా తప్ప.

**ఈ చట్టాలు ఎవరికోసం తెచ్చారు?**

ఈ చట్టాలు రావడానికి ముందే అంబానీ, అదానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలు 20కిపైగా వ్యవసాయ కంపెనీలను రిజిస్టర్ చేశాయి. హర్యానా, పంజాబ్ ల్లోని భూములను సేకరించి గోదాములను నిర్మిస్తున్నారు. ఇంకా అనేక రాష్ట్రాల్లో భూములను సేకరిస్తున్నారు. ఇప్పటికే రియలన్స్ ఫ్రెష్, హెరిటేజ్, ఐటిసి, అమెజాన్, వాల్మార్ట్ వంటి అనేక విదేశీ, స్వదేశీ కంపెనీలు రిటైల్ రంగంలో ప్రవేశించి వ్యవసాయ ఉత్పత్తుల సేకరణకు రంగం సిద్ధం చేసుకున్నాయి. మన రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో రిలయన్స్ ఫౌండేషన్ రైతులతో ఒప్పందాలు చేసుకుంది. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను (ఎఫ్పీఓ) ఏర్పాటుచేసింది. కరోనాకు ముందే దేశం ఆర్థికమాంద్యంలోకి దిగబడింది. మార్కెట్లు కుంచించుకుపోయాయి. కరోనాతో అది మరింత ముదిరింది. కార్పొరేట్ మార్కెట్లు కొత్తగా విస్తరించడానికి ఉన్న అవకాశం వ్యవసాయరంగమే. అందుకే ఇంత హడావుడిగా ప్రభుత్వం ఈ చట్టాలు చేసింది.

ఈ కార్పొరేట్ కంపెనీలు ప్రతి గ్రామంలోనూ వారి ఆఫీసులు నెలకొల్పుతారు. ఏజెంట్లను నియమించు కుంటారు. రైతు సంఘాలు ఏర్పరిచి వారితో కాంట్రాక్టు కుదుర్చుకుంటారు. ప్రతి రైతుకి ఏ పొలంలో ఏ పంట వేయాలో చెబుతారు. కాని ఏ రైతుతోనూ విడిగా ఒప్పందాలు చేసుకోరు. వారు రాసి తెచ్చిన కాంట్రాక్టుపైనే అందరూ సంతకాలు చేయాలి. ఇందులో రైతులకు బేరమాడే వీల్లేదు. మార్కెట్ రేటుకి విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తారు. వారి సాంకేతిక నిపుణులు సలహాలు, సూచనలు చేస్తారు. పండించిన పంటను వారే కొనుగోలు చేస్తారు. అలా కొనుగోలు చేసిన పంటల ఉత్పత్తులను దేశమంతా మార్కెట్ చేసుకుంటారు. ఈ వ్యూహానికి అనుగుణంగానే చట్టాలు, చట్టసవరణలు తెచ్చారు.

**కార్పొరేట్లు ఎందుకు వస్తారు?**

వ్యవసాయ రంగంలో పెట్టుబడులను ప్రోత్సహించి రైతుల ఆదాయాలను రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని మోడీ పదేపదే చెబుతున్నాడు. కాని వాస్తవానికి ఈ ఆరేండ్లలో రైతుల ఆదాయం పడిపోయింది. ఆత్మహత్యలు పెరిగాయి. ఉపాధి లేక వలసలు పెరిగాయి. ఉపాధి పెంపుదలకు తోడ్పడే గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు కోత పెట్టారు. దాన్ని బలహీనపరుస్తున్నారు. గ్రామాల నుండి పట్టణాలకు వసలు పెరిగితే కార్పొరేట్ కంపెనీలకు చౌకగా లేబర్ దొరుకుతుంది. ఎంత ఎక్కువ నిరుద్యోగం పెరిగితే పారిశ్రామికాధిపతులకు అంత లాభం. అదే వారి వ్యూహం.

కార్పొరేట్ పెట్టుబడులు లాభాలకోసం వస్తాయి. రైతుల శ్రేయస్సు, సంక్షేమం కోసం కాదు. రైతుల్ని దోపిడీ చేయకుండా కంపెనీలకు లాభాలు రావు. కార్పొరేట్ కంపెనీలు లేకుండా మానవజీవితం లేదని కొందరు మేధావులు వాదిస్తున్నారు. మన ఒంటి మీది చొక్కా వేసుకునే చొప్పులు, రాసే పెన్ను, వాడే ట్రాక్టరు, వేసే ఎరువు.. అన్ని కార్పొరేట్లవే అని, అవి వ్యవసాయంలో వస్తే నష్టం ఏమిటని పైగా మార్కెట్ విస్తరించి రైతులకు లాభాలు వస్తాయని వాదిస్తున్నారు. ఇంతకన్నా అన్యాయమైన వాదన ఇంకోటి లేదు. కార్పొరేట్ కంపెనీలు రాకముందే చొక్కాలు, చొప్పులు, వ్యవసాయ ఉత్పత్తులు ఉన్నాయి. బట్టలు నేసే నేతన్నలను, చొప్పులు కుట్టే వృత్తిదారులను నాశనం చేసి కార్పొరేట్లు ఎదిగారు. మనుషుల శ్రమతో తయారైన ఉత్పత్తులన్నింటినీ తమ సొంతం చేసుకున్నారు. ఈ ఉత్పత్తుల్లో కార్మికుల శ్రమ తప్ప, కార్పొరేట్ల శ్రమ ఏమీ ఉండదు. లాభాలు తప్ప. కార్పొరేట్లను కీర్తించే మేధావులు ఈ శ్రమను

గుర్తించడానికే నిరాకరిస్తున్నారు. గతంలో వృత్తిదారులు ఎలా నాశనం అయిపోయారో ఇప్పుడు వ్యవసాయదారులు అలాగే నాశనం అయిపోతారు. రైతుల్ని నాశనం చేయకుండా వ్యవసాయంపై కార్పొరేట్ అధిపత్యం రాదు. అందుకే ఈ చట్టాలు రైతుల పాలిట మరణశాసనం అంటున్నది.

**కార్పొరేట్లు రైతులను ఉద్ధరిస్తాయా?**

పంజాబ్ లో గతంలో పెప్సీ కంపెనీ టమాటా, బంగాళదుంపుల రైతులతో ఒప్పందం చేసుకున్నది. వారు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా లేదని చేసుకున్న ఒప్పందాలకు భిన్నంగా ధర తగ్గించి కొన్నారు. ఆగ్రహించిన రైతులు టమాటాలను రోడ్లమీద పారబోసి నిరసన తెలిపిన ఘటనలు ఉన్నాయి. మోడీ స్వంత రాష్ట్రం గుజరాత్ లో లేస్ కంపెనీ చిప్స్ కోసం బంగాళాదుంప రైతులతో ఒప్పందం చేసుకున్నది. అనుమతి లేకుండా తమ విత్తనం రైతులు వాడారని కోటి రూపాయిల పరిహారం కోరుతూ 90మంది రైతులపై కేసులు పెట్టి ఆరెస్ట్ చేశారు. దేశమంతా గగ్గోలు పెట్టడంతో ప్రభుత్వం కేసులు ఉపసంహరించుకుంది. ఇక్కడ కంపెనీల తరుపునే ప్రభుత్వం కేసులు పెట్టిన విషయం మరిచిపోరాదు. మన రాష్ట్రంలోనూ కార్పొరేట్ కంపెనీలతో రైతులకు ప్రత్యక్ష అనుబంధం ఉంది. ఐటీసీ కంపెనీ చేతిలో పొగాకు రైతులు దీర్ఘకాలంగా నలిగిపోతూనే ఉన్నారు. ఒక సంవత్సరం మంచి రేటు ఇచ్చి, మూడేళ్ళ నాణ్యతలేదని దిగ్గొసేస్తారు. పొగాకు బోర్డు రాకముందు కొన్న సరుక్కి డబ్బు గ్యారంటీ కూడా ఉండేది కాదు. డబ్బు వసూళ్లకు కంపెనీల చుట్టూ తిరగాల్సి వచ్చేది. తాజాగా సుబాబుల్ రైతులు పడుతున్న అవస్థలు చూస్తున్నాం. ఐదేళ్ల కిందట కంపెనీ ప్రతినిధులు, రైతు ప్రతినిధులు ప్రభుత్వ అధికారులతో టన్నుకు రూ.4200 ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నారు. ప్రభుత్వం జీవో కూడా ఇచ్చింది. కాని ఇప్పుడు రూ.1800లకు కూడా కొనడం లేదు. పశ్చిమగోదావరి జిల్లా పామాయిల్ రైతుల పరిస్థితీ ఇదే. సహకార రంగం దెబ్బతిన్నాక ప్రయివేట్ చక్కెర ఫ్యాక్టరీలు, డెయిరీలు రేట్లు ఎలా దిగ్గోసాయో అందరికీ తెలుసు. ప్రభుత్వ సలహా ధర లేదు, బోనస్ లేదు.. వందల కోట్లు రైతులకు బకాయిలు ఉన్నాయి. ఈ చట్టాలు వచ్చిన రెండు నెలల్లోనే ధాన్యం ధర దారుణంగా పడిపోయింది. ప్రభుత్వం కొనదు, మిల్లర్లు ధర పెంచరు. రైతులు అనాధలయ్యారు.

విత్తనాలపై పేటెంట్ హక్కుల పేరుతో కార్పోరేట్ కంపెనీలు విత్తన రైతులపై అక్రమ

> **❝ రైతులకు ఎవరో సంకెళ్లు వేస్తే వాటిని తెంపి విముక్తి ఈ చట్టాలతో విముక్తి ప్రసాదిస్తు న్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. తమ ఉత్పత్తుల్ని పొలంలోనే అమ్ముకునే రైతులే అత్యధికులు. ఇలా అమ్ముకునేవాళ్లపై ఏ ఆంక్షలూ లేవు. సెస్సు కట్టడం, లైసెన్సులు వంటి ఆంక్షలున్నది వ్యాపారస్తులపైనే. ఇప్పుడు తొలగిస్తున్నదీ వారిపైనే. చిన్న వ్యాపారస్తుల్ని దెబ్బకొట్టి బడా కార్పోరేట్ దిగ్గజాలకు ఇది ఉపయోగపడు తుంది. ❞**



ఢిల్లీలోని సింఘూ వద్ద రైతుల నిరసన శిబిరం

కేసులు బనాయించారు. పదేళ్ల క్రితం మాన్సెంటో కంపెనీ బీటీ విత్తనాలు తెచ్చి అధిక ధరలకు రైతులపై రుద్దింది. పురుగు పట్టదు, రెట్టింపు ఉత్పాదకత, రెట్టింపు ఆదాయం అని చెప్పారు. కాని ఈ రోజు బీటీ విత్తనాలు వాడేవాళ్లే బలైపోతున్నారు. పత్తి రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కాని పత్తి కొని బట్టలు తయారుచేసే రిలయన్స్ లాంటి కంపెనీల ఆస్తులు ఆకాశానంటుతున్నాయి.

చంద్రబాబు మొదటి దఫా ముఖ్యమంత్రి అయినప్పుడు కుప్పం ప్రాజెక్టు పేరుతో కాంట్రాక్టు వ్యవసాయం ప్రారంభించాడు. ఇజ్రాయిల్ టెక్నాలజీ అన్నారు. కాని ఈ రోజు ఆ ప్రాజెక్టు గతి ఏమయిందో ఎవరికీ తెలియదు. రైతులకు డివిడెండ్లు లేవు, భూములు బీళ్లయ్యాయి. కార్పొరేట్ కంపెనీల కింద రైతుల గతిఏమిటో ఈ అనుభవం చాలదా! రైతులను దోచుకోకుండా కార్పొరేట్ కంపెనీలు లాభాలు సంపాదించగలవా? కార్పొరేట్ కంపెనీల లాభాలు పెరగకుండా వాటి షేర్ మార్కెట్ విలువ పెరుగుతుందా? కంపెనీ షేర్ విలువ పెరగకుండా మార్కెట్లో నిలబడగలుగుతాయా? ఇదంతా ఒక విష వలయం. కార్పొరేట్ కంపెనీల గాట్లో రైతులను కట్టిపడేసి స్వేచ్ఛగా సేద్యం చేయమని సూక్తులు చెబుతున్నారు.

**సంకెళ్లు ఎవరు వేశారు?**

రైతులకు ఎవరో సంకెళ్లు వేస్తే వాటిని తెంపి విముక్తి ఈ చట్టాలతో విముక్తి ప్రసాదిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోంది. తమ ఉత్పత్తుల్ని పొలంలోనే అమ్ముకునే రైతులే అత్యధికులు. కొంతమంది దగ్గర మార్కెట్లకు తీసుకుపోతారు. కొద్దిమంది పండ్లు, కూరగాయలు, చేపలు వంటి ఉత్పత్తుల్ని సుదూర ప్రాంతాలకు తీసుకుపోయి అమ్ముకుంటారు. ఇలా అమ్ముకునేవాళ్లపై ఏ ఆంక్షలూ లేవు. సెస్సు కట్టడం, లైసెన్సులు వంటి ఆంక్షలున్నది వ్యాపారస్తులపైనే. ఇప్పుడు తొలగిస్తున్నదీ వారిపైనే. చిన్న వ్యాపారస్తుల్ని దెబ్బకొట్టి బడా కార్పోరేట్ దిగ్గజాలకు ఇది ఉపయోగపడు తుంది.

**తోమర్‌గారూ ప్రధానికి ఉత్తరం రాయండి**

కేంద్ర వ్యవసాయ శాఖామాత్యులు నరేంద్ర తోమర్‌గారు రైతులనుద్దేశించి అసత్య ఆరోపణలు, అబద్ధాలతో 8పేజీల బహిరంగ లేఖ రాశారు. తానూ రైతుబిడ్డనేనంటున్న ఆయనకు నిజంగా రైతు కష్టాలు తెలిస్తే, వారి ఆవేదన అర్ధమైతే దుర్మార్గమైన ఈ నల్ల చట్టాలను

> **" కాంట్రాక్టు వ్యవసాయం వచ్చినంత మాత్రాన రైతుల భూములు ఎక్కడికీ పోవని భరోసా ఇచ్చారు. భూములెక్కడికీ పోవు. కాని రైతుల చేతుల్లో ఉండవు. కాంట్రాక్టు వ్యవసాయం తర్వాత వచ్చేది కార్పోరేట్ సేద్యమే. రైతులకు పంటలు పండించడం చేతకావడం లేదని కంపెనీలే భూముల్ని రైతుల నుండి లీజుకి తీసుకుంటాయి. చివరకు వ్యవసాయంలో 5 లేదా 10 శాతం మిగులుతారు. మిగతా వారంతా పట్టణాలకు వలసలు పోయి కూలీ పనులు చేసుకొని బతకాలి. "**

వెనక్కి తీసుకోమని ప్రధానికి ఉత్తరం రాయాలి. ఇందులో రైతుల్ని ఏవో బయట శక్తులు తప్పుదారి పట్టిస్తున్నాయంటూ అరిగిపోయిన రికార్డునే వేశారు. నిజానికి ప్రభుత్వాన్నే బయటశక్తులు నడిపిస్తున్నాయి. స్వదేశీ, విదేశీ కార్పోరేట్ల స్వార్ధానికి రైతుల్ని బలిపెట్టడమే ఈ చట్టాల ఉద్దేశమని ఇప్పటికే దేశవాసులకు అర్ధమైంది. కార్పోరేట్ల గురించి ఆలోచించడం మాని రైతుల గురించి ఆలోచించమని రైతుసంఘాలు విజ్ఞప్తి చేశాయి.

**స్వేచ్ఛ ఎవరికి..?**

దేశానికి 1947 ఆగస్టున స్వాతంత్ర్యం వస్తే రైతులకు 2020 ఆగస్టులో వచ్చిందని ప్రధాని పదేపదే చెబుతున్నాడు. ఎవరికొచ్చిన స్వేచ్ఛ ఇది. ఈ చట్టంలోనే రైతులకు, వ్యాపారుస్థులకు స్వేచ్ఛని రాశారు. రైతు తన సరుకును తన ఇష్టం వచ్చిన చోట ఎక్కడైనా అమ్ముకోవచ్చు అని, ఏ మార్కెట్ యార్డుకి బందీ కావాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. ఇదే చట్టం వ్యాపారస్థుడు ఏ సరుకునైనా, ఏ ధరకైనా కొనుక్కోవచ్చు. ఎంతైనా నిల్వ పెట్టుకోవచ్చని చెబుతున్నది. కాబట్టి ఈ స్వేచ్ఛ ఎవరికి ఉపయోగపడుతుంది. పెద్ద కార్పోరేట్ల ముందు రైతు మద్దతు ధర కోసం బేరం చేయగలడా? రైతు చెప్పిన రేటుకి వ్యాపారస్థుడు కొంటాడా, వ్యాపారస్థుడు చెప్పిన రేటుకి రైతు అమ్మాలా? ఈ చట్టంలో ఎక్కడా వ్యాపారస్థుడు ఫలానా రేటుకి కొనాలని కాని, కొనకపోతే చర్య తీసుకుంటామని కాని, లేదా పోటీపడి ప్రభుత్వమే కొంటుంటుందని కానీ లేదు. కాబట్టి ఈ స్వేచ్ఛ కార్పొరేట్ కంపెనీలకు ఇచ్చేదే కాని రైతులకు కాదు.

**రైతుల భూములు మిగులుతాయా?**

కాంట్రాక్టు వ్యవసాయం వచ్చినంత మాత్రాన రైతుల భూములు ఎక్కడికీ పోవని కేంద్ర వ్యవసాయ మంత్రి రైతులకు రాసిన బహిరంగ లేఖలో భరోసా ఇచ్చారు. భూములెక్కడికీ పోవు. కాని రైతుల చేతుల్లో ఉండవు. కాంట్రాక్టు వ్యవసాయం తర్వాత వచ్చేది కార్పోరేట్ సేద్యమే. రైతులకు పంటలు పండించడం చేతకావడం లేదని కంపెనీలే భూముల్ని రైతుల నుండి లీజుకి తీసుకుంటాయి. వారి లీజుకి రక్షణగా ఇప్పటికే లీజు నమూనా చట్టాన్ని నీటిఆయోగ్ తయారు చేసింది. అలా భూములు పరాయీకరణ చెందుతాయి. చివరకు వ్యవసాయంలో 5 లేదా 10 శాతం మిగులుతారు. మిగతా వారంతా పట్టణాలకు వలసలు పోయి కూలీ పనులు చేసుకొని బతకాలి. వ్యవసాయంలో యంత్రాలతో పని చేయిస్తారు. కూలీలకు పని దినాలు కూడా పడిపోతాయి. ఆదాయాలు తగ్గిపోతాయి. కరోనా కష్టకాలంలో వలసకార్మికుల వెతలు దేశమంతా ప్రత్యక్షంగా వీక్షించింది.

రైతుల భూములు ఎక్కడికీ పోవని, పంటపై మాత్రమే ఒప్పందాలు జరుగుతాయని మంత్రి అంటున్నారు. ఇది వాస్తవం కాదు. కాంట్రాక్టు చట్టం 2020లో సెక్షన్ 9 ప్రకారం రైతు భూముల్ని కంపెనీ తాకట్టు పెట్టవచ్చు. కంపెనీ దగ్గర రైతులు తీసుకునే అప్పులు, బకాయిలకు సెక్షన్ 14.2, 14.7 ప్రకారం భూముల్ని తీసుకోవచ్చు. వ్యవసాయ మంత్రి కావాలనే వాస్తవాలు దాస్తున్నారు.

ఈ దేశంలో నూటికి 70మంది హెక్టార్ లోపు భూమున్న రైతులే. మిగతా 25శాతం మధ్యతరగతి, ఆ పైన వారు. ఇక, కేవలం 5శాతం మంది మాత్రమే 25ఎకరాలు, ఆ పైన ఉన్న ధనిక, భూస్వామ్య రైతులు. గ్రామీణ జనాభాలో నూటికి 40మందికి అసలు భూములే లేవు. సన్న, చిన్నకారు రైతులు భూముల్లేని వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు ఉపాధి కోసం కౌలు రైతులుగా మారారు. అలాంటి వారు ప్రయివేట్ వడ్డీలపై ఆధారపడతారు. ముందుగానే కౌలు చెల్లించాలి. వీరు పంట చేతికి రాగానే కల్లాల్లోనే పంటలను అమ్మేస్తారు. కొద్దిమంది భూస్వాములకు మాత్రమే నిల్వ పెట్టుకునే సామర్థం కాని, సుదూర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకునే శక్తి కాని ఉంటుంది. కనీసం ఇప్పటివరకు కనీస మద్దతు ధర ఉండటం, దాన్ని ప్రభుత్వ సంస్థలు కొనుగోలు చేయడం వంటి సౌకర్యాలు, ఇన్ పుట్ సబ్సిడీ వంటి సంక్షేమ కార్యక్రమాల వల్ల నెగ్గుకు రాగలుగుతున్నారు. ఈ హక్కులు కోల్పోయి, ప్రయివేట్ మార్కెట్ మీద ఆధారపడితే అత్యంత వేగంగా రైతులు దివాళా తీస్తారు. అప్పుడు భూములు అమ్ముకోవడమో, వదులుకోవడమో తప్ప గత్యంతరం ఉండదు. ఈ పరిణామాలతో భూములు కోల్పోతారు. ఆ భూములన్నీ కార్పొరేట్ కంపెనీల చేతుల్లోకి పోతాయి.

పేరుకు రైతులకు స్వేచ్ఛ, ఆచరణలో కార్పొరేట్ కంపెనీల ఇష్టారాజ్యంగా మారుతుంది. రైతులు తమ ఉత్పత్తుల్ని ఎక్కడైనా అమ్ముకోవచ్చని చెపుతూ మరో వైపు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్న తర్వాత ఈ స్వేచ్ఛకు అర్థం ఉండదు. ఒప్పందాలు చేసుకున్న కంపెనీలే ఈ స్వేచ్ఛను అనుభవిస్తాయి. రైతుల నుంచి ఉత్పత్తులు సేకరించిన కంపెనీలే దేశమంతా ఎలాంటి ఆటంకాలు లేకుండా ఇష్టానుసారం రేట్లు పెంచి అమ్ముకోగలుగుతారు. వినియోగదారులపై భారం పడుతుంది. కంపెనీలకు వచ్చే లాభాల్లో రైతులకు వాటాలు కూడా రావు. లాభాలు వస్తున్నాయని దయ తలిచి రైతులకు గిట్టుబాటు ధరా ఇవ్వరు. అందుకనే ఆచరణలో ఇది కంపెనీ సేద్యం, కార్పొరేట్ స్వేచ్ఛ అవుతుంది.

**రైతులకిచ్చే స్వేచ్ఛ కంపెనీలకు వరం**

కంపెనీలు ఒప్పంద సేద్యం ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను సేకరిస్తారు. వాటిని దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా అమ్ముకుంటారు. వ్యవసాయ పంటల సీజనులో నిల్వ సరుకును విడుదల చేసి ధరలు తగ్గిస్తారు. రైతుల అమ్ముకున్నాక నిల్వ పెట్టుకొని ధరలు పెంచుతారు. మార్కెట్ గురించి తెలిసినవారెవరైనా దీన్ని అంగీకరిస్తారు. ఈ బేరసారాల్లో రైతులు బలిపశువులవుతారు. ఉదాహరణకు కర్నూలు మార్కెట్‌లో ఉల్లి రైతుల పాట్లే. అమ్ముకొన్నది 5 నుండి 10 రూపాయలు. అమ్ముకున్నాకా మార్కెట్‌లో 50 నుండి 100 రూపాయలకు పెరిగింది. రైతులు చెప్పిన రేటుకి కంపెనీలు కొనవు. కంపెనీలు అడిగిన రేటుకే రైతులు అమ్ముకోవాలి. ఒకసారి ఒప్పందసేద్యం చేసుకున్నాక తన ఉత్పత్తి తన ఇష్టం అని ఏ రైతూ ఎక్కడా అమ్ముకోడానికి వీలుండదు. ఒప్పందాన్ని ఉల్లంఘించారని కేసులు మోపు

తారు. అనేక రాష్ట్రాల్లో అదే జరిగింది. ఈ చట్టంలో తీర్పులిచ్చేది ఆర్డీవోలు, కలెక్టర్లు. వారు ఎవరి ఆధీనంలో ఉంటారో తెలుసు. ధైర్యంగా, నిజాయితీ ఉండే కొద్ది మంది అధికారులు మినహా మిగతావారంతా కంపెనీలకు లొంగిపో తారు. న్యాయవ్యవస్థలాగా వీరు స్వతంత్రులు కూడా కారు. ప్రభుత్వ ఆదీనంలో ఉంటారు. ప్రభుత్వాలు కంపెనీల ఆధీనంలో ఉంటాయి. దీన్ని బట్టే న్యాయం ఎటువైపు మొగ్గుతుందో తెలుస్తుంది.

### మద్దతు ధర ఉంటుందా?

కొత్త చట్టాలు అమల్లోకి వచ్చినా కనీస మద్దతు ధర కొనసాగుతుందని మోడీ చెప్తున్నారు. మద్దతు ధరలుంటాయి. కాని అమలు కావు. అమలు జరిపే వ్యవస్థా ఉండదు. ఆ అవసర మూ ప్రభుత్వానికుండదు. శాంతకుమార్ కమిటీ దీన్నే సిఫార్సు చేసింది. ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే బోనస్ ధరను కూడా ఆపేయాలని వారు కోరారు. ఈ రోజు ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం ప్రభుత్వం బఫరు స్టాకు నిర్వహిస్తోంది. ఎఫ్ సీ ఐ ద్వారా బియ్యం, గోధుమలు, పప్పులు సేకరించి ప్రజలకు చౌకధరలకు అందిస్తున్నారు. కాని నగదుబదిలీ పథకాలు పెట్టి ఈ వ్యవస్తను రద్దు చేస్తారు. అప్పుడు ప్రభుత్వానికి ఆహార పంటలను సేకరించాల్సిన అవసరం ఉండదు. అవసరాలకు బహిరంగ మార్కెట్ నుండి అధిక ధరలకు సేకరిస్తారు. అదీ కార్పోరేట్ కంపెనీలకు లాభమే. ప్రభుత్వం ప్రకటించే మద్దతుధరలు ఒట్టి ప్రహసనంగా మిగిలిపోతాయి. యుపీఏ హయాంలో ప్రతి సంవత్సరం మద్దతు ధరలు 8 నుండి 12శాతం వరకు పెంచితే బిజేపీ హయాంలో కేవలం 1 నుండి 5 శాతం వరకు పెంచారు. ఈ చట్టాలతో ప్రైవేటు కంపెనీలు కనీస మద్దతు ధరలను కూడా ఖాతరు చేయవు. అలాంటి నిబంధనలు ఈ చట్టంలో లేవు. ఎరువులపై సబ్సిడీలు ఎత్తేయాలని, ప్రైవేటు రంగాన్ని వ్యవసాయంలో అనుమతించాలని, ఆహార ధాన్యాలపై సబ్సిడీ, కార్డులు 40శాతానికి తగించాలని కూడా శాంతకుమార్ కమిటీ సిఫార్సు చేసింది.

### జాతీయ మార్కెట్

దేశంలో ధర ఎక్కడ ఎక్కువ ఉంటే అక్కడ అమ్ముకోడానికి ఆటంకాలు తొలగించామంటు న్నారు. దేశంలో ధర ఎక్కడ ఎక్కువ ఉందో ముందు ప్రభుత్వం చెప్పాలి. అన్ని రాష్ట్రాల్లోనూ రైతులంగా సంక్షోభంలో ఉన్నారు. మన రాష్ట్రంలో ఒక పెద్దమనిషి టెలివిజన్ చర్చల్లో పాల్గొంటూ 2017లో ఇక్కడ ధర పడిపోతే తాను నిబంధనలను ధిక్కరించి నెత్తిమీద

“ 2014లో మోడీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే స్వామినాథన్ కమిటీని పక్కన పెట్టి శాంతకుమార్ కమిటీని నియమించారు. వారి సిఫార్సులనే నేడు చట్టాల రూపంలో తెచ్చారు. దాని ప్రకారం రైతుల నుండి ఎఫ్ సి ఐ ద్వారా ధాన్యం సేకరించడం ఆపేస్తారు. చౌకదుకాణా లుండవు. అందుకు బదులుగా ప్రజలు బహిరంగ మార్కెట్లో బియ్యం కొనుగోలు చేయాలి. అది ఎంత రేటున్నా పేదలకు ఫిక్సు డుగా నగదు బదిలీ చేస్తారు. ”



న్యూ ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులతో రైతు సంఘాల నాయకుల చర్చలు

మూటలు పెట్టుకొని పక్క రాష్ట్రంలో ధాన్యం అమ్మానని, దాని వల్ల ఇక్కడ ధరలు పెరిగాయని అన్నాడు. ఇక్కడ డిమాండు పెరిగి దర పెరిగితే పక్క రాష్ట్రంలో సప్లయి పెరిగి ధర పడిపోయ అక్కడ రైతులు నష్టపోయారన్న విషయాన్ని ఆయన చెప్పలేదు. అదే 2017-18లో మహారాష్ట్రలో గిట్టుబాటుధరల కోసం మహాపాద యాత్ర వంటి పెద్ద ఉద్యమం జరిగింది. అక్కడే ఈ పెద్దమనిషి అధిక ధరలకు అమ్మానంటున్నాడా? ఇలాంటి కాకమ్మ కథల్ని నమ్మాలా?

నాలుగేండ్ల క్రితం ఈనామ్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒక పథకం తెచ్చింది. రైతు ఉత్పత్తుల్ని దేశంలో ఎవరైనా కొనుక్కోవచ్చన్నారు. ఎక్కడైనా అలా ధర పెరిగిన ఉదంతాలున్నాయా? ఎక్కడైనా ధర పెరిగిందంటే రైతులు పోరాడి ప్రభుత్వజోకాన్ని సాధించుకున్న చోటే ఎంతో కొంత పెరిగింది. ఇది రైతుల అనుభవం.

### ఆహార అభద్రత

2014లో మోడీ అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే స్వామినాథన్ కమిటీని పక్కన పెట్టి శాంతకుమార్ కమిటీని నియమించారు. వారి సిఫార్సులనే నేడు చట్టాల రూపంలో తెచ్చారు. దాని ప్రకారం రైతుల నుండి ఎఫ్ సి ఐ ద్వారా ధాన్యం సేకరించడం ఆపేస్తారు. చౌకదుకాణా లుండవు. అందుకు బదులుగా ప్రజలు బహిరంగ మార్కెట్లో బియ్యం కొనుగోలు చేయాలి. అది ఎంత రేటున్నా పేదలకు ఫిక్సు డుగా నగదు బదిలీ చేస్తారు. ఉదాహరణకు ఇప్పుడు కిలో బియ్యం రేషను షాపుల ద్వారా రూపాయికే ఇస్తున్నారు. ఇక నుండి గ్యాసు మాదిరి పూర్తి ధర చెల్లించి మార్కెట్లో కొనుక్కో వాలి. కేజీకి రు. 30 నగదు బదిలీ చేస్తారు. రిలయన్సు లాంటి కంపెనీలు రైతుల నుండి సేకరించిన ధాన్యాన్ని బియ్యం కింద మార్చి అందమైన ప్యాకెట్లలో పార్సిల్ చేసి ఐరన్, కాల్షియం ఉన్న బియ్యం అంటూ కిలో వందకు పైన అమ్ముతారు. అంటే పేదలకు రు. 30లు ప్రభుత్వాలు నగదు బదిలీ చేసినా కిలో బియ్యా నికి అదనంగా రు. 70లు పెట్టాలి. పేదలు కొని తినగలరా? ఇప్పుడు రైతుల ఆత్మహత్యలే చూస్తున్నాం. ఇక ముందు ఆకలిచావులు కూడా చూస్తాం. అన్నదాత రైతన్నలు బలవుతారు. అంబానీయే అన్నదాత అవుతాడు.

### విద్యుత్ చట్టానికి సవరణలు

కేంద్ర విద్యుత్ చట్టాన్ని సవరించారు. దాని ప్రకారం కిందిస్థాయిలో విద్యుత్ పంపిణీ సంస్థల్ని ప్రైవేటుపరం చేస్తారు. విద్యుత్ఉత్పత్తి ఇప్పటికే ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి పోయిం ది. ఈ రంగంలో అనేక మంది యంపీలు, ఎమ్మేల్యేలు కూడా ఉన్నారు. వారే చట్టాలు చేస్తారు. ఉత్పత్తి ఖర్చులో సబ్సిడీ 20 శాతానికి మించరాని షరతు విధించారు. వ్యవసాయ పంపుసెట్లకు ఉచిత విద్యుత్ బదులు నగదు

> **❝ రైతుల ఉత్పత్తుల్ని మీ ఇష్టం వచ్చిన రేటుకి మీ ఇష్టం వచ్చిన చోట అమ్ముకోడానికి స్వేచ్ఛనిచ్చామని చెప్తున్న ప్రభుత్వం రేపు రేటు రాకపోతే ఏం చేయాలనే ప్రశ్నకు సమాధానం ఇవ్వడం లేదు. కనీస మద్దతు ధరల కన్నా మార్కెట్లో రేట్లు తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులకు కనీస గ్యారంటీ ఉంటుంది. కాని ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ పాత్ర ఏమీ ఉండదు. మీ సరుకు మీఇష్టం అంటున్నదంటే మా బాధ్యతేమీ లేదని తేల్చి చెప్పడమే. ❞**

బదిలీ పథకం ప్రవేశపెట్టాలని కేంద్రం ఆదేశించింది. మన రాష్ట్రంలో ఇప్పటికే అమలు చేస్తున్నారు. స్మార్టుమీటర్లు పెడితే బిల్లులు తడిసి మోపెడవుతాయి. ఉచిత విద్యుత్ 30 ఏండ్లు కొనసాగుతుందని ఈరోజు జగన్ ప్రభుత్వం ప్రకటించవచ్చు. రేపు వచ్చే ప్రభుత్వాలు కొనసాగిస్తాయని ఎలాంటి గ్యారంటీ లేదు. డిస్కాంలు ప్రైవేటుపరం అయితే బిల్లులు కట్టకుంటే కనెక్షన్ ఆటోమేటిగ్గా కట్ అవుతుంది. డబ్బులు కట్టకుండా ఎంత మొత్తుకున్నా దయ తలచరు. ఈ స్థితిలో వ్యవసాయం సాగుతుందా? అందుకే విద్యుత్ చట్టం 2020ను ఉపసంహరించుకోవాలని రైతుసంఘాలు డిమాండు చేస్తున్నాయి.

**మార్కెట్ యార్డులు లేకుంటే ఏమవుతుంది?**

మన రాష్ట్రంలో మార్కెట్ యార్డుల ద్వారా సరుకులు అమ్ముకోవడం లేదు కాబట్టి వాటి వల్ల ఉపయోగం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు. ఒక మేధావి అక్కడ పందులు, కుక్కలు తిరుగుతాయి. కంపు కొడుతుంటాయి అవెందుకు దండగ అన్నారు. నిజమే. అపరిశుభ్రత ఉంటే సంస్కరించాలి కానీ ఇంట్లో ఎలుకలున్నాయని ఇంటినే తగులబెట్టుకోము కదా. రేపు అంబానీ, అదానీలు ఏసీ మార్కెట్ యార్డులు కట్టొచ్చు. కాని వాటిని ఉపయోగించుకోడానికి రైతులు మిగిలి ఉండాలి కదా. బెల్లం, ఉల్లిపాయలు, పొగాకు, మిర్చి, పత్తి, పసుపు వంటి పంటలు ఇప్పటికీ మార్కెట్ యార్డుల ద్వారానే అమ్మకాలవుతున్నాయి. కూరగాయలు, పండ్లు కూడా మార్కెట్ యార్డుల కేంద్రంగానే అమ్మకాలు సాగుతున్నాయి. ధరలు పడిపోయినప్పుడు మార్కెట్ యార్డుల కేంద్రంగా మొక్కజొన్న, శనగలు వంటి పంటల్ని కొనుగోలు చేస్తున్నారు. అదే పంజాబు, హర్యానా, ఉత్తరప్రదేశ్ లలో అత్యధికభాగం ధాన్యాలు మార్కెట్ యార్డుల్లోనే ప్రభుత్వ సంస్థల ద్వారా అమ్మకాలు సాగుతున్నాయి. 2006 బిహార్‌లో మార్కెట్ యార్డుల చట్టాన్ని రద్దు చేశారు. కానీ రైతు ఉత్పత్తుల ధరల పెరగలేదు. ఈ కాలంలో పంజాబ్ మార్కెట్ యార్డుల్లో అమ్ముకుంటున్న ధాన్యానికన్నా బీహార్ బహిరంగ మార్కెట్‌లో 30శాతం తక్కువ ధర ఉంది. అందుకే ఈ ఉద్యమంలో రైతులు అంత పెద్ద సంఖ్యలో కదులుతున్నారు. మార్కెట్ యార్డు కేంద్రంగా కనీస మద్దతు ధరలు ప్రాతిపదికగా సరుకులను ప్రభుత్వమే వేలం నిర్వహించాలి. వాటిలో అంబానీ, అదానీ కూడా పోటీ పడి కొనుక్కోవచ్చు. అప్పుడు రైతులకు మంచి ధర లభిస్తుంది. కాని ప్రభుత్వ నియంత్రణ లేని మార్కెట్ను వారు కోరుకుంటున్నారు. ప్రైవేటు మార్కెటు యార్డుల్లో వారిదే ఇష్టారాజ్యం. వారు చెప్పిందే ధర. చెల్లించిందే రేటు అన్న చందంగా సాగుతుంది. ఎవరూ ప్రశ్నించడానికి వీలుండదు. ప్రభుత్వమూ జోక్యం చేసుకోదు. అందుకే స్వేఛ్ఛా విధానాల పేరుతో మార్కెట్ యార్డుల కోరలు పీకి సెస్సులు రద్దు చేసింది. ఏ ఆంక్షలూ లేవు. ఇదంతా కార్పోరేట్లకు లాభమే. రేపోమాపో విలువైన మార్కెట్ యార్డు స్థలాలను కూడా అమ్మేస్తారు. ప్రభుత్వ మార్కెట్ అంటే బానిసత్వమని, ప్రయివేటు యార్డులంటే స్వేచ్ఛ అని ప్రభుత్వమే ప్రచారం చేస్తోంది. ప్రభుత్వమే ప్రభుత్వాన్ని నిందించుకుంటున్నందుకు సిగ్గుపడాలి. కానీ బిజెపి గర్వపడుతోంది.

**ప్రభుత్వం రైతులకు సాయం చేయొద్దా?**

రైతుల ఉత్పత్తుల్ని మీ ఇష్టం వచ్చిన రేటుకి మీ ఇష్టం వచ్చిన చోట అమ్ముకోడానికి స్వేచ్ఛనిచ్చామని చెప్తున్న ప్రభుత్వం రేపు రేటు రాకపోతే ఏం చేయాలనే ప్రశ్నకు సమాధానం ఇవ్వడం లేదు. కనీస మద్దతు ధరల కన్నా మార్కెట్లో రేట్లు తగ్గితే ప్రభుత్వం కొనుగోలు చేస్తే రైతులకు కనీస గ్యారంటీ ఉంటుంది. కాని ఈ చట్టం ప్రకారం ప్రభుత్వ పాత్ర ఏమీ ఉండదు. మీ సరుకు మీఇష్టం అంటున్నదంటే మా బాధ్యతేమీ లేదని తేల్చి చెప్పడమే. ప్రభుత్వం మార్కెట్లో జోక్యం చేసుకొని ధరలను నిలబెట్టకుండా రైతుభరోసా లాంటి పథకాలతో బిక్షం వేసి తప్పుకుంటానంటోంది. ఇది రైతులకు సమ్మతం కాదు.

కార్పోరేట్ కంపెనీలకు అన్ని గ్యారెంటీలిస్తున్న ప్రభుత్వం రైతులకు కనీస మద్దతు ధర కల్పించడానికి ముందుకు రావడం లేదు. ఈ చట్టాల ప్రభావం మన రాష్ట్రంలో అప్పుడే కనిపిస్తున్నది. ఖరీఫ్ ధాన్యం మార్కెట్లోకి వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర ప్రకారం బస్తా (75కిలోలు) ధాన్యం రు. 1400లు పలకాలి. కాని మార్కెట్లో 1200లకు లోపే ఉంది. ప్రభుత్వ వాదన ప్రకారం మార్కెట్లో రు. 1400 పైనే ఉండాలి. కాని తగ్గింది. ఎక్కడైనా రు. 1500 ఉందా? అక్కడ రైతులు అమ్ముకోగలరా? ప్రైవేటు కంపెనీలు ఎందుకు ధర పెంచడం లేదు. ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి. రేపు పూర్తిగా ఈ చట్టాలు అమల్లోకి వస్తే ఇంత కన్నా ఘోరంగా ఉంటుంది. అందుకే ఈచట్టాలను ఉపసంహరించు కోవాలని రైతులు కోర్తున్నారు.

కొత్త పరిస్థితులకు పాత చట్టాలు పనికి రావని, అందుకే కొత్త చట్టాలు తెచ్చామని మోడీ చెప్తున్నారు. వాస్తవమేమంటే అసలు పాత చట్టాలే లేవు. కనీస మద్దతు ధరలకు ఇప్పటి వరకు చట్టబద్దత లేదు. ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అవి అమలవుతున్నాయి. ఇప్పుడు కొత్త చట్టాల్లో దాని ఊసు కూడా లేదు. ఈ ఉద్యమం రావడంతో కనీస మద్దతు ధరలుంటాయని, దానికి రాత పూర్వక హామీ ఇస్తామని చెప్తున్నారు. రాత పూర్వక హామీలకు విలువేమిటి? మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించి వెనక్కి పోయారు. పార్లమెంటు మాజీ ప్రధాని స్వయంగా ఇచ్చిన హామీ ఇది. తిరుపతి బహిరంగసభలో మోడీ ఇచ్చిన హామీ ఇది. కాని అమలు చేయలేదు. మాట తప్పినా చట్టం ఏం చేయలేకపోతోంది. అందుకే గిట్టుబాటు ధరల చట్టం చేయాలని గత మూడేండ్లగా 250 సంఘాలతో ఏర్పడిన అఖిలభారత కిసాన్ సంఘర్ష సమన్వయ కమిటీ పోరాడుతోంది. నేటి పోరాటానికి కూడా ఈ కమిటీయే నాయకత్వం వహిస్తోంది. గిట్టుబాటు ధరల చట్టం చేయమని రైతులడుగుతుంటే మార్కెట్ స్వేచ్ఛ అంటూ ప్రభుత్వం కూనిరాగాలు తీస్తోంది. రైతులు కోరేది రక్షణ. మార్కెట్ స్వేచ్ఛ కాదు. మార్కెట్లో స్వేచ్ఛ ఆ మార్కెట్ పై ఆధిపత్యం ఉన్నవారికే పోతుంది. రైతులకు ఉపయోగపడదు. అందుకే కొత్త పరిస్థితులకు

తగ్గట్లుగా కొత్త చట్టాలు చేయమని రైతుసంఘాలు డిమాండు చేస్తున్నాయి. మోడీ చట్టాలు దేశాన్ని వందేళ్ల వెనక్కి తీసుకుపోతాయి.

**స్వామినాథన్ సిఫార్సులు ఎక్కడ?**

2014లో మోడీ తాను అధికారంలోకి వస్తే స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తానని వాగ్దానం చేశారు. దాని ప్రకారం ఉత్పత్తి ఖర్చులపై 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలి. కాని అధికారంలో వచ్చాక దానికి విరుద్ధంగా శాంతకుమార్ అధ్యక్షతన మరో కమిటీ వేసి వారి సిఫార్సులు అమలు చేస్తామన్నారు. వారు ఎఫ్ సి ఐ పాత్రను తగ్గించి, మార్కెట్టుకు స్వేచ్ఛనిస్తే రైతులకు లాభం జరుగుతుందని చెప్పారు. ఇలాంటి కమిటీలు గత ఇరవై ఏండ్లుగా చాలా వేశారు. ఆ కమిటీలు చెప్పిన వాటినే అమలు చేస్తున్నామని మోడీ చెప్తున్నారు. కాంగ్రెసు పాలన న్యాయం చేయలేదనే జనం మోడీకి పట్టం కట్టారు. కాని ఆయన కాంగ్రెసు విధానాలనే అమలు చేస్తానంటున్నారు. అదేనా జనం కోరుకున్నది? ఇరవై ఏండ్లుగా చర్చ సాగుతుంటే ఇంత హఠాత్తుగా చట్టాలు చేయాల్సిన అవసరం ఏమిటి? ఇప్పుడు చర్చలకు సిద్ధమంటున్న ప్రభుత్వం చట్టాలు చేయడానికి ముందు ఎందుకు చర్చించలేదు. హడావుడిగా ఆర్డినెన్సులు తేవాల్సిన అవసరం ఏమిటి? కనీసం ఈ ఉద్యమం సాగుతున్నందువల్ల చర్చలు సాఫీగా సాగడానికి వీలుగా ఈ చట్టాల అమలును కొంతకాలం వాయిదా వేసి సమస్యను ఒక కొలిక్కి తీసుకురావాలని సుప్రీంకోర్టు కోరినా కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. రైతుల కోర్కెనే కాదు ఉన్నత న్యాయస్థానం అభ్యర్థనను కూడా తోసి పుచ్చడం ఎవరి కోసం? 50వేల మంది వీధులకెక్కి అడిగితే 130కోట్ల మంది అంగీకరించాలా? అని బిజేపీ నాయకులంటున్నారు.

> **“ బిజేపీ నాయకులు, వారికి మద్దతునిస్తున్న కొందరు మేధావులు రైతుల కష్టాలపై కన్నీరు కారుస్తున్నారు. వారి కష్టాలు నిజమేనని, కాని కొందరు వాటిని ఉపయోగించుకొని మోడీ ప్రభుత్వాన్ని సాధించాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు నిజమే అయినప్పుడు దానికి ఏమిటి పరిష్కారం. జబ్బొకటైతే మందు మరొకటిస్తే వికటిస్తుంది. ఇప్పుడీ చట్టాల విషయంలోనూ అదే జరుగుతోంది. కష్టాల్లో ఉన్న రైతుల కు శాశ్వత స్వేచ్ఛ కల్పించడానికే ఈ మరణశాసనం లిఖించారు. ”**

ఈ 50వేల మందికి కోట్లాది ప్రజల మద్దతు ఉందన్న విషయాన్ని వారు మరుగుపరుస్తున్నారు. మోడీ ప్రభుత్వానికి 130 కోట్ల మంది మద్దతు ఉందా? 32శాతమే ఆయనకు ఓటేశారు. అయినా ప్రధానిగా వారిని ప్రజలు గుర్తించారు కదా? అదే ప్రజాస్వామ్యమంటే? ఒక్కరన్న మాటకు రాముడు స్పందించాడు. మరి రోజూ రామ జపం చేసే బిజేపీకి ప్రజల మాటంటే లెక్క లేదా? తమ మిత్రపక్షాలు కూడా చెప్తున్నాయే. వారి మాటకు విలువ లేదా? ఇదేనా వారి రామభక్తి, దేశభక్తి?మోడీ,షాలు, వారు నెత్తికెత్తుకున్న అదానీ, అంబానీలు తప్ప మిగతా ఎవ్వరూ ప్రజలు కారా?

**చట్టాలు వెనక్కి తీసుకోవాల్సిందే**

చట్టాల్లో సవరణలు చేస్తే మంచిదే కదా రైతులు అంగీకరించొచ్చు కదా అని కొందరంటున్నారు. వాళ్లు చేస్తామన్న సవరణలు ఏమిటి? కనీస మద్దతు ధర కొనసాగుతుందని రాతపూర్వక హామీ ఇస్తామంటున్నారు. మార్కెట్ యార్డులు కొనసాగుతాయి, ప్రైవేటు యార్డులూ ఉంటాయంటున్నారు. రైతులు తమ ఇష్టం వచ్చిన చోటకు పోవచ్చునంటున్నారు. ఇలాంటి సవరణల వల్ల ఒరిగేదేమిటి? కార్పోరేటు వ్యవసాయం దిశగా చట్టాలు చేశారు. సవరణలూ అందుకే ప్రతిపాదిస్తున్నారు. మరణశాసనానికి సవరణలేముంటాయి? దాన్ని వెనక్కి తీసుకోవడమా? అమలు చేయడమా? అన్నదే ప్రశ్న. కేంద్రం రెండోదానికే మొగ్గుచూపుతున్నది. ఉరికంభం ఈరోజు ఎక్కాలా రేపు ఎక్కాలా? ఉరికొయ్యను ఇనుముతో చేయాలా? చెక్క చేస్తే సరిపోతుందా? వంటి సవరణలు చేయాలా? ఈ మధ్య ఒక తెలుగు పత్రికలో బిజేపీ జాతీయ నాయకులు రాంమాధవ్ ఒక వ్యాసం రాశారు. అందులో తప్పనిసరైతే ఒకటి లేదా రెండు సవరణలు చేయొచ్చు. కాని చట్టాన్ని మార్చలేమని, యథావిధిగా కొనసాగుతుందని రాశారు. దీన్ని బట్టే సవరణలపై వారి చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతుంది. అబద్దాలు, మోసపుమాటలతో రైతుల్ని నమ్మించాలని చూస్తున్నారు. అది చెల్లదు.

**మెర్సీ కిల్లింగ్**

బిజేపీ నాయకులు, వారికి మద్దతునిస్తున్న కొందరు మేధావులు రైతుల కష్టాలపై కన్నీరు


**'మార్క్సిస్టు'కు మీ సందేహాలు రాయండి!**

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రికలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రతినెలా పాఠకుల సందేహాలకు సమాధానాలిస్తున్న సంగతి మీకు తెలుసు. ప్రస్తుత అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మీ సందేహాలను నివృత్తి చేసుకు నేందుకు ప్రశ్నలను రాసి పంపండి! ప్రతినెలా 20వ తేదీలోపు మీ ప్రశ్నలు మాకు చేరితే తదుపరి సంచికలో రాఘవులు సమాధానాలు లభిస్తాయి. మీ ప్రశ్నలు అందాల్సిన చిరునామా!

**ఎడిటర్, మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ఎం.బి. విజ్ఞానకేంద్రం,**
**డోర్ నెం. 27-30-3, ఆకులవారి వీధి, గవర్నర్‌పేట, విజయవాడ-520 002**

**❝ గత 20 సంవత్సరాల ఆర్థిక సంస్కరణల ఫలితంగా వ్యవసాయం సంక్షోభంలో పడింది. అప్పులు పెరిగాయి. ఆత్మ హత్యలూ పెరిగాయి. మోడీ వచ్చాక అవి తగ్గకపోగా ఇంకా పెరుగుతున్నాయి. వీన్ని అరికట్టడానికి స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని అన్ని సంఘాలూ కోరుతున్నాయి. కానీ రైతుల్ని బలిపెట్టి వ్యవసాయాన్ని కార్పొరేట్‌పరం చేయడానికి మోడీ సర్కార్ ఈ నల్ల చట్టాలను తెచ్చింది. వాటికి వ్యతిరేకంగా నేడు రైతు నడుంకట్టి కదనరంగంలోకి దిగాడు. ❞**

కారుస్తున్నారు. వారి కష్టాలు నిజమేనని, కాని కొందరు వాటిని ఉపయోగించుకొని మోడీ ప్రభుత్వాన్ని సాధించాలని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. రైతుల కష్టాలు, కన్నీళ్లు నిజమే అయినప్పుడు దానికి ఏమిటి పరిష్కారం. జబ్బొకటైతే మందు మరొకటిస్తే వికటిస్తుంది. ఇప్పుడీ చట్టాల విషయంలోనూ అదే జరుగుతోంది. కష్టాల్లో ఉన్న రైతులకు శాశ్వత స్వేచ్ఛ కల్పించడానికే ఈ మరణశాసనం లిఖించారు. ఎలాగూ ఇహలోకంలో కష్టాలు తప్పవు. పరలోకంలోనైనా స్వేచ్ఛగా ఉండమంటుంది మతం. మతాన్ని రాజకీయాలకు వాడుకునే బీజేపీ ఇంతకన్నా భిన్నంగా ఎలా ఆలోచించగలుగుతుంది. ఎవరికైనా నయంకాని జబ్బు వస్తే వారి బాధలు చూడలేక బంధువులు మెర్సీకల్లింగుకు దరఖాస్తు చేసుకుంటారు. అలాగే ప్రభుత్వం కూడా రైతులకు ఇన్ని కష్టాలెందుకు, కష్టాలతో బతకడమెందుకు అని ఒకేసారి మరణం ప్రసాదించమని మెర్సీ కిల్లింగు సూత్రాన్ని అప్లయి చేసి రైతుకు వ్యవసాయ చట్టాల పేరుతో మరణశాసనం రాసింది. 1990లో డంకెల్ ప్రతిపాదనల పేరుతో ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చేరాం. ఆ తర్వాత అభి వృద్ధి అయ్యింది కదా అని కొందరంటున్నారు. వాస్తవమేమంటే ఆతర్వాతే రైతు ఆత్మహత్యలు మొదలయ్యాయి. వ్యవసాయమూ సంక్షోభంలో పడింది. ఇది కాదనలేని సత్యం.

**బీజేపీకి మాటపై నిలబడే చిత్తశుద్ధి ఉందా?**

ఈ ఆరేండ్ల పాలనలో బీజేపీ చెప్పిందొకటి, చేసింది మరొకటన్న సంగతి రుజువైంది. పెద్దనోట్లు రద్దు చేసి బ్లాక్ మనీని అరికడతామన్నారు. ఉగ్రవాదం రూపుమాసి పోతుందన్నారు. ఏం జరిగింది? బ్లాక్ మనీ చట్టబద్ధమైంది. ఉగ్రవాదం ఉధృతమైంది. ఏం సాధించారు జనాన్ని ఇబ్బందులపాటు చేయడం తప్ప. నగదు లేక జనం నానా ఇక్కట్లు పడ్డారు. ఇంకా పడుతూనే ఉన్నారు. ఆన్ లైను వ్యాపారం, ఫైనాన్సు వ్యాపారాలు పెరిగాయి. దీనివల్ల లాభపడ్డదెవరు? జీఎస్టీ ద్వారా ఒకే దేశం ఒకే పన్ను అన్నారు. పన్నులు పెరిగాయి. ధరలు పెరిగాయి. కాని రాష్ట్రాల ఆదాయం పడిపోయింది. దాన్ని పూడుస్తామన్నారు. కాని ఇప్పుడు పూడ్చకుండా అప్పులు తెచ్చుకోమంటున్నారు. తిరిగి ఆఅప్పుల భారం ప్రజలపైనే పడుతుంది. వ్యవసాయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేస్తామన్నారు. కాని దానికి విరుద్ధంగా ఒకేదేశం ఒకే మార్కెట్ అంటూ శాంతకుమార్ కమిటీ సిఫార్సులను అమలు చేస్తున్నారు. కరోనాలో ప్రజలు కష్టాలు పడుతుంటే సందట్లో సడేమియా అన్నట్లుగా ప్రజలపై కొత్తచట్టాలు తెచ్చి రుద్దుతున్నారు. విద్య, వైద్యం, ప్రభుత్వ సంస్థలు, ప్రకృతి వనరులు అన్నింటినీ ప్రైవేటుపరం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా ఇస్తామన్నారు. కాని దాన్ని తుంగలో తొక్కారు. మోసపు మాటలు చెప్పే మోడీ మాటలు విని పదేపదే మోసపోవాలా?

**వైయస్సార్ కాంగ్రెసు, తెలుగుదేశం పార్టీలు రైతు ఉద్యమానికి మద్దతునీయాలి**

మన రాష్ట్రంలోను రైతులు ఈ చట్టాలను వ్యతిరేకిస్తున్నారు. వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన 10 సంఘాలతో ఏర్పడిన కిసాన్ సంఘర్ష్ సమన్వయ కమిటీ (ఏఐకేయస్ సిసి) ఈ ఉద్యమానికి నాయకత్వం వహిస్తోంది. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం,కౌలుసంఘం, వ్యవసాయకార్మిక సంఘాలు ఇందులో భాగస్వాములుగా ఉన్నాయి. విశాల వేదికగా ఇది నడుస్తోంది. ఇందులో అనేక పార్టీలకు చెందిన వారున్నారు. డిశంబరు 8న జయప్రదమైన బందే ఇందుకు ఉదాహరణ. ఆ తర్వాత జరిగిన కార్యక్రమాల్లోనూ గ్రామీణ పేదలు, రైతులు, కార్మికులు పెద్దఎత్తున పాల్గొంటున్నారు. మధ్యతరగతి వారు విరాళాలిచ్చి ప్రోత్సహిస్తున్నారు. ఈ ఉద్యమానికి వామపక్ష పార్టీలు దన్నుగా నిలబడ్డాయి. నిర్బంధాలను ఎదుర్కొని నిలబడ్డారు. వివిధ రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు కూడా మద్దతునిస్తున్నాయి. కాని దురదృష్టవశాత్తు అధికారపార్టీగా ఉన్న వైయస్సార్ కాంగ్రెసు, ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం ఈ ఉద్యమానికి దూరంగా ఉన్నాయి. నాడు పార్లమెంటులో ఈ బిల్లుల్ని వారు బలపరిచారు. ఈ ఉద్యమ ప్రభావంతో తటస్థంగా మారారు. రాష్ట్ర ప్రభుత్వం డిశంబరు 8బందుకు సంఘీభావం ప్రకటించింది. తెలుగుదేశం పార్టీ జిల్లా కలెక్టర్లకు అర్జీలు ఇచ్చి సరిపుచ్చుకుంది. చంద్రబాబు నాయుడు చట్టాలకు సవరణ చేయాలని కోరారు. రోజూ ఒకరిపై ఒకరు కారాలు మిరియాలు నూరుకునే ఈ పార్టీలు బీజేపీని బలపరిచే విషయంలో ఒక్కటిగా వ్యవహరిస్తు న్నాయి. కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని చూసి భయపడుతున్నారు. వ్యవసాయ, విద్యుత్, రాష్ట్రాల హక్కు. రాష్ట్రాల్ని కనీసం సంప్రదించకుండా కేంద్రం నిరంకుశంగా చట్టాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. ప్రత్యేక హోదా ఊసు ఎత్తడం లేదు. రాష్ట్రానికి 4600 కోట్లు జీఎస్టీ పరిహారం ఇవ్వకపోయినా అడగడం లేదు. రాష్ట్రానికి నష్టాలు జరుగుతున్నా ప్రశ్నించడం లేదు. రాష్ట్రం హక్కులకోసం అయినా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నిలబడాలి. రైతాంగానికి, రాష్ట్ర ప్రజలకు ఈ వైఖరి తీరని హాని చేస్తుంది. ఆయా పార్టీల వెనుకనున్న రైతాంగం ఈ ఉద్యమానికి పూర్తి సంఘీభావంతో ఉన్నారు. సానుభూతితో బలపరుస్తున్నారు. ఇప్పటికైనా వారు తమ వైఖరిని పునరాలోచించుకొని ఈ ఉద్యమాన్ని చురుగ్గా బలపరచాలి. బీజేపీ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న అకాలీదళ్ పార్లమెంటులో రైతులకు మద్దతుగా వ్యవసాయ బిల్లుల్ని వ్యతిరేకిస్తూ మంత్రివర్గం, ఎన్ డీ ఏ కూటమి నుండి తప్పుకుంది. ఇలాంటి పార్టీలను చూసైనా వైయస్సార్ కాంగ్రెసు, తెలుగు దేశం పార్టీలు నేర్చుకోవాలి. లొంగుబాటు విధానాలకు స్వస్తి చెప్పాలి. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడాలి. తక్షణం అసెంబ్లీని సమావేశపర్చి ఈ చట్టాలకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి. ఈ చారిత్రక దశలో వారు సరైన నిర్ణయం తీసుకోవడంలో విఫలమైతే చరిత్ర వారిని క్షమించదు.

**సమైక్య శంఖారావం**

గత 20 సంవత్సరాల ఆర్థిక సంస్కరణల ఫలితంగా వ్యవసాయం సంక్షోభంలో పడింది. అప్పులు పెరిగాయి. ఆత్మహత్యలూ పెరిగాయి. మోడీ వచ్చాక అవి తగ్గకపోగా ఇంకా పెరుగు

(మిగతా 35వ పేజీలో)

ఈ మాసం ప్రత్యేకం

# పట్టణ సంస్కరణలు ప్రజావ్యతిరేక అంశాలు

డా॥ బి గంగారావు



రచయిత సిపిఐ(ఎం) గ్రేటర్ విశాఖ నగర కార్యదర్శి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కరోనాను అడ్డం పెట్టుకొని దేశవ్యాప్తంగా ప్రపంచ బ్యాంకు ఆదేశిత పట్టణ సంస్కరణల అమలుకు సిద్ధమయ్యింది. దీంతో పాటు ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు, సులభతర వాణిజ్యం, విద్యుత్ రంగంలో సంస్కరణలు వేగంగా అమలు చేయాలని నిర్ణయించింది. ఈ నాలుగు సంస్కరణలు అమలుకు అంగీకరించే రాష్ట్ర ప్రభుత్వాలకు ఆ రాష్ట్రాల జీఎస్‌డీపీలపై 2 శాతం అదనంగా మార్కెట్ నుండి రుణం సేకరించుకోవటానికి అనుమతిస్తామని షరతు విధించింది. ఈ రుణం కోసం మనరాష్ట్రంలోని జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కేంద్రానికి లొంగిపోయి ప్రజలకు తీవ్ర హాని చేసే ఈ నాలుగు సంస్కరణలను అమలుకు అంగీకరించింది. ఇప్పుడు ఆఘమేఘాల మీద రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలైన మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు, నగర పంచాయితీల్లో పట్టణ సంస్కరణల అమలుకు పూనుకుంది. ఇందుకు రాష్ట్రప్రభుత్వం మున్సిపల్ కార్పోరేషన్ చట్టం-1955, ఏపి మున్సిపాలిటీస్ చట్టం-1965, విశాఖపట్నం మున్సిపల్ కార్పోరేషన్ చట్టం-1979, విజయవాడ మున్సిపల్ కార్పోరేషన్ చట్టం-1981, ఏపి మున్సిపల్ కార్పోరేషన్ చట్టం-1994లో సవరణలు తీసుకొచ్చి ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను మదింపు పద్ధతిని తీసుకొచ్చింది. దీంతో పాటు మంచినీటి సరఫరా, మురుగునీటి నిర్వాహణ, చెత్త సేకరణకు అయ్యే పూర్తి ఖర్చును ప్రజల నుండి యూజర్ చార్జీల పేర రాబట్టాలని కేంద్ర ప్రభుత్వం విధించిన మరొక షరతు. వీటి అమలుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఇందుకు 196, 197, 198 జీవోలు తీసుకొచ్చింది. ఈ పట్టణ సంస్కరణలు అమలు చేస్తున్నందుకు ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ నుండి అదనంగా రు 2,525 కోట్లు రుణం సమీకరించుకోవటానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ సంస్కరణలు ప్రజలపై తీవ్ర భారాలు మోపటమే కాక భవిష్యత్తులో పౌర సేవలన్నింటిని ప్రైవేటీకరిస్తాయి.

**ఆస్తి విలువ ఆధారంగా ఆస్తిపన్ను**

పట్టణ సంస్కరణల్లో మొదటిది ప్రస్తుతం అమలులో ఉన్న ఇంటి అద్దె విలువ ఆధారంగా "ఆస్తి పన్ను" విధించే పద్ధతిని రద్దుచేసి దాని స్థానంలో ఆస్తి యొక్క మార్కెట్ విలువ ఆధారంగా మదించి ఆస్తి పన్ను విధించే పద్ధతి అమలు పర్చటం. అంటే ఇప్పటి వరకు ఆస్తి పన్నును భవనం ప్లింత్ ఏరియా బట్టి చదరపు మీటరుకు వసూలు చేయదగిన అద్దెను నిర్ధారణ చేస్తారు. ఈ విలువ కూడా ఒకేరకంగా ఉండదు. అనేక అంశాలు పరిగణలోకి తీసుకొని వివిధ రకాల రేట్లు నిర్ధారిస్తారు. ఉదాహరణకి మున్సిపాలిటిని అనేక జోన్లుగా విభజించటం. అంటే పేదలు, దిగువ తరగతి, మధ్య తరగతి, శివారు ప్రాంతాలు, వ్యాపార వాణిజ్య ప్రాంతాలు, పారిశ్రామిక ప్రాంతాలుగా వర్గీకరించి వివిధ ప్రాంతాల్లో వివిధ అద్దెరేట్లు నిర్ణయిస్తారు. అలాగే భవనాల నిర్మాణాలను బట్టి ఏడు కేటగిరీలుగా విభజించటం. భవన ప్రయోజనం, భవన కాలపరిమితి వంటి అంశాలను కూడా పరిగణలోకి తీసుకొని ప్రస్తుతం అద్దె విలువను లెక్కించి ఆస్తి పన్నును నిర్ణయిస్తున్నారు. కొత్త చట్టాలతో ప్రజలకున్న ఈ సదుపాయాలన్నీ రద్దయ్యాయి.

నూతన ఆస్తి పన్ను చట్టం ప్రకారం నివాస గృహాలపై 0.1 శాతం నుండి 0.5 శాతం వరకు, నివాసేతర గృహాలపై అనగా వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు ఇతర నిర్మాణాలపై 0.2 శాతం నుండి 2 శాతం వరకు పన్ను విధిస్తారు. ఖాళీ స్థలాలపై భూమి విలువపై మున్సిపాలిటీల్లో 0.2 శాతం, మున్సిపల్ కార్పోరేషన్‌లలో 0.5 శాతం వరకు పన్ను విధిస్తారు. ఆక్రమణ స్థలాల్లో, పట్టాలు లేని స్థలాల్లో నివసించే వారిపై ఆస్తి విలువపై రెట్టింపు పన్ను, అలాగే ప్లాను లేకపోయినా లేదా ప్లాన్ ఉండి అతిక్రమణలు ఉన్నట్లయితే 25 నుండి 100 శాతం వరకు అదనంగా పన్ను వేస్తారు. ప్రతి ఏడాది భూముల మార్కెట్ విలువను ప్రభుత్వం పెంచుతుంది కాబట్టి ఈ పెరుగుదలకు అనుగుణంగా ఆటోమేటిక్‌గా ఆస్తి పన్ను కూడా పెరుగుతుంది. కాని ప్రభుత్వం ఈ ఏడాది ప్రస్తుతం ఉన్న పన్నుపై 15 శాతం మించి పెంచొద్దని జివోలో పేర్కొన్నది. అయితే ఇది తాత్కాలికమే. పేదవారికి 375 చ॥ అడుగుల లోపు ఉన్న ఇళ్ళకు ఏడాదికి రూ. 50లు మాత్రమే పన్ను విధిస్తామని పేర్కొన్నారు. ఇది ఎంతవరకు అమలు చేస్తారో చెప్పలేం. ఎందుకంటే పట్టణ ప్రాంత పేద ప్రజల కొరకు టైపు డిజైన్ ప్రకారం నిర్మించబడిన ఇండ్లకు ఆస్తి పన్ను క్రింద అర్ధ సంవత్సరానికి రూ. 2 వసూలు చేయాలని మున్సిపల్ చట్టంలో ఉంది. కాని ఇది ఎక్కడా అమలు చేసిన దాఖలాలు రాష్ట్రంలో లేవు.

ఆస్తి పన్నులో భారీమార్పులు తీసుకు రావడానికి గత దశాబ్దం నుండి పాలకులు తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. ప్రజల వ్యతిరేకతతో ఇప్పటి వరకు మౌలికమైన మార్పులు తీసుకురాలేకపోయారు. ఆస్తి పన్ను పెరుగుదలపై ఉన్న సీలింగ్‌ను ఎత్తివేయడం, భవనాలను భౌగోళిక సమాచార వ్యవస్థ (జిఐసి) మ్యాపులను అనుసంధానం చేయడం, కొన్ని నగరాల్లో ఆస్తి పన్ను స్వయం మదింపు పద్ధతి వంటి మార్పులకే పరిమితమయ్యారు. అలాగే 13వ ఆర్థిక సంఘం గ్రాంట్లు పొందాలంటే తప్పనిసరిగా రాష్ట్రాల్లో ఆస్తి పన్ను బోర్డులు ఏర్పాటుచేయాయలనే షరతు విధించటంతో అనేక రాష్ట్రాలు అనివార్యంగా ఆస్తి పన్ను బోర్డులను ఏర్పాటుచేశాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ షరతును ఆమోదించి ఆస్తి పన్ను బోర్డు ఏర్పాటుకు 107 జీవోను విడుదల

> ఈ చర్య పూర్తిగా 72వ రాజ్యాంగ సవరణకి విరుద్ధమైనది. పట్టణ స్థానిక సంస్థల ఆస్తి పన్ను విధించే అధికారాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరించివేయటమే. భవిష్యత్తులో ఆస్తి పన్ను విధింపు ను దేశవ్యాప్తంగా ఆస్తి విలువలో 1 శాతానికి తీసుకువెళ్లాలనేదే ప్రభుత్వం ప్రయత్నం. అలాగే ఆస్తి పన్ను బోర్డులను ప్రైవేటీకరించ డంతో పాటు పట్టణాలు, నగరాల్లో ఆస్తి పన్ను విధింపు నుండి ఆస్తి పన్ను వసూళ్ళు దాకా ప్రైవేట్ సంస్థలపరం చేస్తారు. ఇప్పటికే జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల్లో ప్రైవేటు సంస్థలకు ఇచ్చారు.

చేసింది. ఇప్పుడు ఈ బోర్డుని ఫంక్షనింగ్‌లోకి తీసుకొస్తున్నారు. కొత్త చట్టం ప్రకారం ఆస్తి పన్ను పెంపుపై మున్సిపల్ కౌన్సిల్స్ కన్నా ఆస్తి పన్ను బోర్డే సర్వాధికారాలు కలిగి వుంది.

2010-11లో ఆస్తి పన్ను ద్వారా దేశంలోని అన్ని పట్టణ సంస్థలకు రూ. 10,819 కోట్లు ఆదాయం రాగా 2017-18కి రూ. 25, 551 కోట్లుకు చేరింది. ఆంధ్ర ప్రదేశ్‌లో 2010-11 నుండి 2017-18 మధ్య రూ. 401 కోట్ల నుండి రూ. 945 కోట్లకు ఆస్తి పన్ను పెరిగింది. ప్రపంచంలో ఆస్తి పన్ను ద్వారా పట్టణ సంస్థలు జిడిపిలో 1 శాతం పైబడి ఆదాయం సమకూర్చు కుంటున్నాయని మన దేశంలో ప్రస్తుతం ఆస్తి పన్ను ద్వారా జిడిపిలో కేవలం 0.15 శాతం మాత్రమే పొందుతున్నాయని కేంద్ర ప్రభుత్వం పదే పదే వాదన చేస్తోంది. ప్రపంచ దేశాలన్నింటిలో ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధిస్తున్నారని మన దేశంలోనే అద్దె విలువ ఆధారంగా ఆస్తి పన్ను లెక్కిస్తున్నారని దీనివల్ల పట్టణ సంస్థలు పెద్ద ఎత్తున ఆదాయాన్ని కోల్పోతున్నాయని వాదిస్తున్నది. రియల్ఎస్టేట్ మార్కెట్ హద్దులు లేకుండా పెరుగుతోందని దీనివల్ల పెద్ద ఎత్తున భూముల విలువ పెరుగుతున్నదని ఆస్తి పన్ను మధింపును ఆస్తి విలువ ఆధారంగా లెక్కించడం ద్వారా పట్టణ సంస్థలు పెద్ద ఎత్తున ఆదాయాలు పొందుతాయని ప్రభుత్వం చేస్తున్న మరొక వాదన. అందుకే దేశవ్యాప్తంగా ఆస్తి విలువ ఆధారంగా ఆస్తి పన్ను విధించే పద్ధతిని తీసుకొచ్చామని కేంద్ర ప్రభుత్వం చెపుతోంది. ఈ చర్య పూర్తిగా 72వ రాజ్యాంగ సవరణకి విరుద్ధమైనది. పట్టణ స్థానిక సంస్థల ఆస్తి పన్ను విధించే అధికారాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హరించివేయటమే. భవిష్యత్తులో ఆస్తి పన్ను విధింపును దేశవ్యాప్తంగా ఆస్తి విలువలో 1 శాతానికి తీసుకువెళ్లాలనేదే ప్రభుత్వం ప్రయత్నం. అలాగే ఆస్తి పన్ను బోర్డులను ప్రైవేటీకరించడంతో పాటు మొత్తం పట్టణాలు, నగరాల్లో ఆస్తి పన్ను విధింపు నుండి ఆస్తి పన్ను వసూళ్ళు దాకా ప్రైవేట్ సంస్థలపరం చేస్తారు. ఇప్పటికే జార్ఖండ్, పంజాబ్ రాష్ట్రాల్లో ఆస్తి పన్ను వసూళ్ళను ప్రైవేటు సంస్థలకు ఇచ్చారు.

### మంచినీటి చార్జీలు

మంచినీటి చార్జీలు కూడా భారీగా పెంచాలని నిర్ణయించారు. 196 జీవోలో పేర్కొన్న విధంగా గృహ వినియోగదార్లకు నెలకి రూ. 100 నుండి రూ. 350 వరకు, సెమీబల్క్ క్రింద అనగా అపార్టమెంట్స్ నివాసాలకి కిలో లీటరు (1000 లీటర్లు) కు రూ. 30 నుండి రూ. 50 వరకు, కమర్షియల్‌కి కిలో లీటరుకి రూ. 60 నుండి రూ.140ల వరకు, పరిశ్రమలకు కిలో లీటరుకి రూ. 40 నుండి రూ. 80ల వరకు నీటి చార్జీలు నిర్ణయించారు. ఈ చార్జీలను తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రకటించిన అటల్ పునరుద్దరణ మరియు పట్టణాల రూపాంతరీకరణ(అమృత) పథకం కింద 17.5.2018న 159 జివోను విడుదల చేసి అమలుకు ప్రయత్నం చేసింది. ప్రజల నుండి వ్యతిరేకత రావటం, త్వరలో జరగనున్న ఎన్నికల దృష్ట్యా తాత్కాలికంగా ఈ చార్జీలను అమలు చేయకుండా వాయిదా వేసింది. ఇప్పుడు వైఎస్ఆర్ పార్టీ ప్రభుత్వం వీటిని అమలుకు పూనుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న చార్జీలపై 15 శాతం పెంపుదలను ఈ ఏడాదికి పరిమితం చేసినప్పటికీ భవిష్యత్‌లో మంచినీటి భారం తీవ్రంగా ఉంటుంది. ఎందుకంటే మంచినీటి సరఫరాకి అయ్యే మొత్తం ఆపరేషన్, మెయింటినెన్స్ వ్యయాన్ని ప్రజల దగ్గర నుండే వసూలు చేయాలన్నదే ఈ జీవోల ముఖ్య ఉద్దేశ్యం. మంచినీటి కనెక్షన్ డొనేషన్స్ చార్జీలు కూడా విపరీతంగా పెరుగుతాయి. ప్రతి ఇంటికి మీటరు పెట్టి రీడింగ్ ఆధారంగా నీటి చార్జీలు వసూలు చేయాలన్నది మరొక షరతు. దీని వల్ల గృహ వినియోగదార్ల పై నీటి చార్జీలు మూడు నుండి నాలుగు రెట్లు పెరుగుతాయి. ఇంటి బోర్లపై షరతులు విధిస్తారు. వీధి కొళాయిలు భవిష్యత్‌లో ఉండవు. వీటన్నిటి మూలంగా ప్రజలు అనివార్యంగా నీటి వినియోగం తగ్గించుకోవల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఉదాహరణకు గ్రేటర్ విశాఖ (జివిఎంసి) నగరంలో ప్రస్తుతం మంచి నీటికి 3/4 ఇంచ్ పైపులైన్ ఉన్న గృహ యజమాని నెలకి ఫ్లాట్ రేటులో రూ.160 లు చెల్లిస్తున్నారు. రోజుకి గంట చొప్పున 800 నుండి వెయ్యి లీటర్లు వరకు జివిఎంసి మంచినీటిని సరఫరా చేస్తున్నది. ఇప్పుడు కొత్త రేట్లు ప్రకారం ఇదే పరిమాణంలో నీటిని వాడుకుంటే (కిలో లీటరుకి రూ.15ల రేటు చొప్పున) నెలకి కనీసం రూ. 360 నుండి రూ. 450ల వరకు చెల్లించాల్సి వస్తుంది. అదే 10 ఫ్లాట్లు కలిగిన అపార్ట్‌మెంట్ వాసులైతే (కిలో లీటరుకు రూ.30 నుండి రూ. 50 వరకు) నెలకి 300 కిలో లీటర్ల నీటిని వాడితే కనీసం రూ. 10 వేల నుండి రూ. 15 వేల వరకు నీటి చార్జీని చెల్లించికోవల్సి వస్తుంది.

ఆంధ్ర ప్రదేశ్‌లో నేడు పట్టణాలు, నగరాల్లో మంచినీటి సరఫరా ఘోరంగా ఉంది. మొత్తం 111 మున్సిపల్, నగర పాలక సంస్థల్లో ప్రతిరోజూ కనీసం గంట చొప్పున మంచినీరు సరఫరా చేస్తున్నవి బహుకొద్ది మాత్రమే. 30 పట్టణాల్లో బోర్లు ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. సరఫరా చేస్తున్న నీరు కూడా శుద్ధి చేసినది కాదు. నీటిని శుద్ధి చేసే సదుపాయాలు కూడా వాటికి లేవు. ఫలితంగా పట్టణ ప్రజలు అనేక అనారోగ్య సమస్యలకు గురౌతున్నారు. ఇటీవల ఏలూరు మున్సిపల్ కార్పోరేషన్‌లో ప్రజలు వింత వ్యాధికి గురై వందలాదిమంది హస్పటల్ పాలైన ఘటన చూసాం. రాష్ట్రంలోని సగం పట్టణాల్లో రోజు విడిచి రోజు, కొన్ని పట్టణాల్లో మూడు లేదా నాలుగు రోజులకొకసారి మంచినీరు సరఫరా చేస్తున్నారు. ప్రమాణాల ప్రకారం ఒక మనిషికి రోజుకి 150 లీటర్లు నీరు సరఫరా చెయ్యాలి. రాష్ట్రంలో ఇప్పుడు సగటున రోజుకి 50 లీటర్లు మించి సరఫరా చేయడం లేదు. దీనిని బట్టి పట్టణ ప్రాంతాలలో మంచినీటి పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేగాక మంచినీటి కనెక్షన్ కలిగి ఉన్నవారు కూడా చాలా తక్కువ. రాష్ట్రంలో అన్ని పట్టణాలు, నగరాలు 31.96 లక్షల ఆస్తి పన్ను ఎసెస్‌మెంట్లు కలిగి ఉంటే వాటిల్లో 42 శాతం ఇళ్ళకు మాత్రమే నీటి కనెక్షన్ ఉన్నాయి. గ్రేటర్ విశాఖ కార్పోరేషన్‌లో 4.88 లక్షల ఆస్తి పన్ను

ఎసెస్‌మెంట్లు ఉంటే నీటి కనెక్షన్స్ ఉన్నవి 2.26 లక్షల ఇళ్లు మాత్రమే. ఈ దుస్థితి నుండి పట్టణ ప్రజలకు విముక్తి కలిగించే చర్యలు గతంలోని కాంగ్రెస్, తెలుగుదేశం ప్రభుత్వాలు చేపట్టలేదు. నేడు జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కూడా అదే దారిలో నడుస్తున్నది. నేడు ఈ సమస్యకు పరిష్కారంగా మంచినీటి చార్జీలు భారీగా పెంచటం, నీటి మీటర్లు బిగించటం, నీటి సరఫరా వ్యవస్థను ప్రైవేటీకరించే చర్యలు పాలకులు చేపడుతున్నారు.

భారతదేశంలో మంచినీటి సంస్కరణలు 2002లోనే ప్రారంభమయ్యాయి. అప్పటి అటల్‌బిహారీ వాజ్‌పాయి ప్రభుత్వం వీటికి బీజం వేసింది. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ ఆధునీకరణ మిషన్ (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం)ను 2005లో తీసుకొచ్చి దేశవ్యాప్తంగా మంచినీటిరంగంలో తీవ్ర మార్పులు తీసుకురావాలని ప్రయత్నించింది. వామపక్ష పార్టీలు బలంగా ఉండటం, అధికారంలో ఉన్న కొన్ని ప్రాంతీయ పార్టీలు వ్యతిరేకించటం, ప్రజల నుండి కూడా వ్యతిరేకత వ్యక్తం కావటంతో ఈ సంస్కరణలను కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయింది.

నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్‌సిటీ, స్వచ్ఛభారత్, అమృత పథకాలు ప్రవేశపెట్టి వీటిద్వారా దేశవ్యాప్తంగా పట్టణ సంస్కరణలు అమలుకు పూనుకున్నారు. ఈ పథకాలు ద్వారా చేపడుతున్న మంచినీటి సరఫరా, మురుగునీటి పారుదల వ్యవస్థ, చెత్త సేకరణ, వరదనీటి కాలువలు, రవాణా, వీధిలైట్లు, ఉద్యానవనాలు వంటివి అన్నీ ప్రైవేట్ సంస్థల ద్వారా చేపడుతున్నారు. వాటికి అయ్యే ఖర్చు పూర్తిగా ప్రజల నుండి వసూలుచేయాలనే నిబంధన విధించారు. గ్రేటర్ విశాఖ కార్పొరేషన్‌లో రూ. 350 కోట్లతో విశాఖ ఉత్తరం, విశాఖ పశ్చిమ నియోజక వర్గాల పరిధిలో 24 గంటల మంచినీటి సరఫరా పేర చేపట్టిన మంచినీటి ప్రాజెక్టును 12 ఏళ్ళపాటు నిర్మాణం, నిర్వాహణ బాధ్యత ఎన్‌సిసి అనే ప్రైవేట్ సంస్థకి ఇచ్చారు. ప్రస్తుతం విశాఖ స్మార్ట్‌సిటీ ప్రాంతంలో కూడా 24 గంటల మంచినీరు పేర మంచినీటి సరఫరాను ప్రైవేట్ సంస్థకి ఇవ్వబోతున్నారు. ఇప్పటివరకు ఈ తరహా ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కడా లేవు. ప్రభుత్వ - ప్రైవేట్ భాగస్వామ్యం (పిపిపి) పేర నాగపూర్, బెంగుళూరు, మైసూర్, అహమ్మదాబాద్ తదితర నగరాల్లో మంచినీటి బోర్డులను ప్రైవేటీకరించారు. మంచినీటిని ప్రైవేటీకరించిన చోట్ల నీటిచార్జీలు భారీగా పెరిగాయి. మంచినీటి చార్జీలతోపాటు మురుగునీటి చార్జీలు, చెత్త సేకరణపై కూడా భారీగా యూజర్ చార్జీలు పెరిగాయి. ఈ పెరిగిన చార్జీలు ప్రజలకు తీవ్ర భారంగా పరిణమించాయి. మన రాష్ట్రంలో కూడా ఇదే పరిస్థితి ఉత్పన్నమవుతుంది.

> **" మురుగునీటి నిర్వాహణకు లెక్కగట్టిన విధంగానే చెత్త నిర్వహణా వ్యయాన్ని కూడా లెక్కించి ప్రజల నుండి చెత్తపై రాష్ట్రవ్యాప్తంగా యూజర్ చార్జీలు వసూలు చేయబోతున్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 2016లో దేశ వ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో అమలయ్యేలా స్వచ్ఛ భారత్‌ను తీసుకొచ్చింది. దీనిలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్ మెంట్ నిర్వహణను కూడా తీసుకొచ్చింది. దీని ప్రకారం పట్టణ స్థానిక సంస్థలన్నీ పారిశుద్ధ్య నిర్వాహణకు అయ్యే ఖర్చునంతా ప్రజల నుండి యూజర్ చార్జీల పేర రాబట్టాలి. "**

### మురుగు నీరు, చెత్తపై చార్జీలు

మురుగు నీటి నిర్వాహణ, చెత్త సేకరణకు అయ్యే ఆపరేషన్ అండ్ మెయింటినెన్స్ ఖర్చునంతా ప్రజల నుండి యూజర్ చార్జీలు రూపంలో వసూలు చేయాలని కూడా నిర్ణయించారు. 196 జివోలు పేర్కొన్న విధంగా మురుగునీటి కనెక్షన్ డొనేషన్ క్రింద 357 చదరపు అడుగుల విస్తీర్ణం దాటిన ఇంటి ఇంటికి రూ. 3,500, కమర్షియల్ క్రింద రూ. 10 వేలు, ఇనిస్టిట్యూషన్స్ రూ. 20వేలు కనెక్షన్‌కి చెల్లించాలి. అలాగే మురుగునీటి చార్జీల క్రింద 375 చదరపు అడుగుల విస్తీర్ణంలోపు గల ఇళ్ళు నెలకి రూ. 35, ఆపై విస్తీర్ణం ఉన్న ఇళ్ళు (మూడు టాయిలెట్స్ వరకు) రూ. 80, కమర్షియల్ క్రింద మూడు టాయిలెట్స్ వరకు రూ. 150 నుండి 250, ఇనిస్టిట్యూషన్స్ అయితే 10 టాయిలెట్స్ వరకు రూ. 300 నుండి రూ. 600 వరకు యూజర్ చార్జీలు చెల్లించాలి. ఈ యూజర్ చార్జీలు రేట్లు కూడా తాత్కాలికమే. ఎందుకంటే మొత్తం నిర్వాహణకు అయ్యే ఖర్చునంతా ప్రజల దగ్గర నుండి వసూలుచేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. అంటే ఉద్యోగుల జీతాలు, పైపు లైన్లు నిర్వాహణ, కొత్త పైపులైన్ల వ్యయం, విద్యుత్ చార్జీలు, విద్యుత్ మోటార్ల ఖర్చు, రిపేర్లు, మురుగునీటి ప్రాజెక్టులకు తెచ్చే అప్పులకు తిరిగి ప్రతి ఏడాది చెల్లించాల్సిన చెల్లింపులు మొత్తం కలిపి ఆపరేషన్, మెయింటినెన్స్ క్రింద ప్రజల నుండి వసూలు చేస్తారు.

మురుగునీటి నిర్వాహణకు లెక్కగట్టిన విధంగానే చెత్త నిర్వాహణా వ్యయాన్ని కూడా లెక్కించి ప్రజల నుండి చెత్తపై రాష్ట్ర వ్యాప్తంగా యూజర్ చార్జీలు వసూలు చేయబోతున్నారు. అయితే కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 2016లో దేశవ్యాప్తంగా అన్ని పట్టణాలు, నగరాల్లో అమలయ్యేలా స్వచ్ఛ భారత్‌ను తీసుకొచ్చారు. దీనిలో భాగంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణను కూడా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ప్రకారం పట్టణ స్థానిక సంస్థలన్నీ పారిశుద్ధ్య నిర్వాహణకు అయ్యే ఖర్చునంతా ప్రజల నుండి యూజర్ చార్జీల పేర రాబట్టాలి. అలాగే చెత్తను తడి-పొడి చెత్తగా కూడా వేరుచేయాలి. ప్రస్తుతం రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీలు, కార్పోరేషన్‌లలో రూ. 30 నుండి రూ. 50ల వరకు చెత్తపై యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఈ చార్జీలను ఇప్పుడు రూ.100 వరకు పెంచబోతున్నారు. గ్రామాల్లో ఇప్పటికే రోజుకి రెండు రూపాయిలు చొప్పున చెత్తపై చార్జీలు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే.

### పట్టణ స్థానిక సంస్థల ప్రస్తుత ఆదాయాల స్థితి

మున్సిపాలిటీల్లో ఆదాయానికి-వ్యయానికి పొంతన ఉండటం లేదని, ఖర్చులు భారీగా పెరుగుతున్నాయని, ఆదాయం చూస్తే చాలా నామమాత్రంగా వస్తుందని ప్రభుత్వం చెబుతున్నది. అంతేగాక పట్టణ భూముల విలువలు బాగా పెరుగుతున్నాయని, పట్టణ వ్యాపార, వాణిజ్య ఉత్పత్తి కార్యకలాపాలు పెరుగుతున్నాయని కానీ మున్సిపల్ పన్నుల ద్వారా రావల్సినంత ఆదాయం మున్సిపాల్టీలకు రావటం లేదని ప్రభుత్వం మరొక వాదన చేస్తున్నది. గడిచిన పదేళ్ళలో కూడా దేశ జిడిపిలో చూస్తే మున్సిపల్ ఆదాయాల్లో ఎలాంటి పెరుగుదల లేదని 2007-08 నుండి 2017-18 మధ్య అంటే గడిచిన దశాబ్దంలో వీటి ఆదాయం దేశ జిడిపిలో కేవలం 1 శాతంగానే ఉందని ప్రభుత్వం వాపోతుంది.

> **" కేంద్ర, రాష్ట్ర పన్నులు ఈ కాలంలో జిడిపిలో 16 శాతం నుండి 18 శాతానికి పెరిగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసిన నిధులు ఇదే కాలంలో 0.30 శాతం నుండి 0.25 శాతానికి పడిపోయాయి. అంతేకాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాల అభివృద్ది పై పెట్టే ఖర్చు కూడా కోతకు గురౌతున్నది. "**

మన దేశంలోని పట్టణ స్థానిక సంస్థల ఆదాయాలను ఒక్కసారి పరిశీలిద్దాం. 15వ ఆర్థిక సంఘం కొరకు 2019 మార్చిలో భారతదేశంలోని మున్సిపల్ ఫైనాన్స్‌పై ఐసిఆర్ఐఇఆర్ సంస్థ అధ్యయనం చేసి ఒక రిపోర్టును కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. ఈ అధ్యయన రిపోర్టు ప్రకారం 2017-18లో భారతదేశంలో ఉన్న అన్ని మున్సిపల్ కార్పోరేషన్‌లు, మున్సిపాలిటీలు, నగర పంచాయితీల మొత్తం అన్ని రకాల ఆదాయాలు అంటే స్థానిక సంస్థలు విధించే పన్నులు, పన్నేతర ఆదాయాలు, యూజర్ చార్జీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి వచ్చిన ప్రణాళిక, ప్రణాళికేతర గ్రాంట్లు, రుణాలు అన్ని కలిపి చూస్తే రూ. 1,71,697 కోట్లుగా ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో పట్టణ స్థానిక సంస్థలు రూ. 3,886 కోట్లు ఆదాయం పొందాయని తెలిపింది. 2017-18లో దేశవ్యాప్తంగా అన్ని పట్టణ స్థానిక సంస్థలు పొందిన ఆదాయం జిడిపిలో సుమారు 1.08 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. అదే 2010-11లో అయితే దేశ వ్యాప్తంగా రూ. 73259 కోట్లు, ఆంధ్రప్రదేశ్‌లో రూ. 1824 కోట్లు ఆదాయం ఈ సంస్థలు పొందాయని తెలియ జేసింది.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి ప్రణాళిక, ప్రణాళికేతర గ్రాంట్లు, నిధులు తీసివేస్తే పట్టణ స్థానిక సంస్థలు తమ సొంత పన్నులు, పన్నేతర ఆదాయాలు చూస్తే దేశం మొత్తం మీద 2010-11లో రూ. 37,303 కోట్లు రాగా 2017-18కి రూ. 73,331 కోట్లుకు చేరుకు న్నాయి. ఇదే కాలంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని పట్టణ సంస్థలు 2011-12లో రూ. 1,021 కోట్లు నుండి రూ. 2,439 కోట్లుకు ఆదాయాలు పెంచుకోగలిగాయి. మన దేశంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ స్థనిక సంస్థలకి జిడిపిలో కేవలం 0.45శాతం లోపే నిధులు కేటాయి స్తున్నాయి. అదే వివిధ దేశాల్లో ఫెడరల్, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ స్థానిక సంస్థలుకు బదిలీ చేస్తున్న నిధులను జిడిపిలో చూస్తే అమెరికాలో 3.1శాతం, డెన్మార్క్‌లో 2.1శాతం, ఇటలీలో 7.8శాతం, బ్రిటన్‌లో 9.9శాతం, నార్వేలో 6శాతం చొప్పున కేటాయింపులు ఉన్నాయి. ఈ వాస్తవాన్ని మాత్రం మన పాలకులు ఎక్కడా చెప్పరు.

కేంద్ర ప్రభుత్వం నుండి మొత్తం ప్రణాళిక, ప్రణాళికేతర గ్రాంట్లు, నిధుల రూపంలో దేశంలో ఉన్న మొత్తం పట్టణ స్థానిక సంస్థలకు 2010-11లో రూ. 5,466 కోట్లు రాగా, 2017-18లో రూ.20,569 కోట్లు వచ్చాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో ఉన్న పట్టణ సంస్థలకు ఇదే కాలంలో కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 94 కోట్లు, రూ. 504 కోట్లు వచ్చాయి. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం 2010-11లో మొత్తం సంస్థలకు రూ. 311 కోట్లు నిధులు ఇవ్వగా 2017-18లో రూ. 716 కోట్లు ఇచ్చింది.

వాస్తవంగా కేంద్ర, రాష్ట్ర పన్నులు ఈ కాలంలో జిడిపిలో 16 శాతం నుండి 18 శాతానికి పెరిగాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ స్థానిక సంస్థలకు బదిలీ చేసిన నిధులు ఇదే కాలంలో 0.30 శాతం నుండి 0.25 శాతానికి పడిపోయాయి. అంతేకాక కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాల అభివృద్ది పై పెట్టే ఖర్చు కూడా కోతకు గురౌతున్నది. 1998-99లో జిడిపిలో 1.74 శాతం పట్టణాభి వృద్ధిపై ప్రభుత్వాలు ఖర్చు చేయగా 2002-03కి 1.6 శాతానికి, 2019-20కి 1.59 శాతానికి పడిపోయింది. పట్టణాలు దేశ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా ఉన్నాయి. ప్రస్తుతం 62 శాతం ఆదాయం దేశ జిడిపికి పట్టణ రంగం నుండే వస్తోంది. 2030కి ఇది 75 శాతానికి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల ద్వారా వస్తున్న ఆదాయంలో 90 శాతం పట్టణాల నుండే వస్తుంది. దేశ ఆర్థికాభివృద్ధికి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు పన్నుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుతున్న ఈ పట్టణ రంగాన్ని అభివృద్ధి చేయడంలోను ఘోరంగా విఫలమౌతున్నారు.

పాలకుల నయా-సరళీకరణ విధానాల అమలు వలన పట్టణాల్లో సంఘటితరంగం ధ్వంసం అవుతూ అసంఘటిత రంగం పెద్ద ఎత్తున పెరుగుతున్నది. ఈ రంగంలో ఉన్న కార్మికులకు ఉపాధి భద్రత లేదు. అతి తక్కువ వేతనాలకు పని చేస్తూ దారుణంగా దోపిడీకి గురౌతున్నారు. సామాజిక భద్రత లేదు. దీంతో పట్టణ ప్రజలు తీవ్ర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటూ మురికి కూపాల్లో జీవనం సాగిస్తున్నారు.

దేశంలో ఉన్న పట్టణాలు నగరాల వాస్తవ పరిస్థితిపై కూడా పాలకులకు సమగ్ర దృక్పథం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 31.6 శాతం అంటే 37.7 కోట్ల ప్రజలు పట్టణాల్లో నివాసముంటున్నారు. మొత్తం చిన్న పెద్ద తరహా పట్టణాలు దేశంలో 7,935 ఉన్నాయి. వీటిల్లో 468 ప్రథమ శ్రేణి నగరాలు. లక్ష కన్నా ఎక్కువ జనాభా కలిగి ఉన్న పట్టణాలను ప్రథమశ్రేణి నగరాలు అంటున్నారు. వీటిల్లో పట్టణ జనాభాలో 70 శాతం ఉన్నారు. ఈ ప్రథమ శ్రేణి నగరాల్లో పదిలక్షలు దాటి జనాభా వున్న అతిపెద్ద నగరాలు 53 ఉన్నాయి. వీటినే మిలియన్ ప్లస్ నగరాలు అంటున్నారు. వీటిల్లో 40 శాతం జనాభా ఉన్నారు. లక్ష కన్నా తక్కువ జనాభా ఉన్న పట్టణాల్లో సుమారు 30శాతం జనాభా ఉన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో 29.6 శాతం ప్రజలు పట్టణాల్లో నివాస ముంటున్నారు. మొత్తం 110 కార్పోరేషన్లు, మున్సిపాలిటీలు, నగరపంచాయితీలు ఉన్నాయి. వీటిల్లో 14 నగరపాలక సంస్థల్లో 60 శాతం జనాభా నివసిస్తున్నారు. లక్ష జనాభా దాటిన మున్సిపాలిటీలు 15 ఉన్నాయి. మిగిలిన 81 వాటిల్లో లక్షలోపే జనాభా వున్నారు. మిలియన్ ప్లస్ నగరాల్లో 40 శాతం పైబడి ప్రజలు మురికివాడల్లో నివాసముంటూ అత్యంత ధారుణమైన జీవనం సాగిస్తున్నారు. లక్ష నుండి 10 లక్షల లోపు జనాభా ఉన్న నగరాలు, పట్టణాలు దుస్థితి కూడా చాలా ఆందోళనా కరంగా ఉంది. వివిధ పట్టణాలు నగరాల మధ్య, ఒకే పట్టణం, ఒకే నగరంలో వివిధ ప్రాంతాల మధ్య మౌలిక సదుపాయాల కల్పనలో తీవ్ర అసమానతలు కొనసాగు తున్నాయి. ఇక లక్షలోపు ఉన్న పట్టణాలు మౌలిక సదుపాయాలకల్పనకు కనీస నిధులు లేక తీవ్ర ఇక్కట్లకు గురౌతున్నాయి. నగర పాలనకు బాధ్యత వహించే పట్టణ సంస్థలు నిధుల లేమితో వీటిని పరిష్కరించలేక సతమతమౌతున్నాయి. ప్రత్యామ్నాయ నమూ

నాలను రూపొందించుకొని అమలు చేసుకోవ టానికి కూడ అధికారంలేక తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిధులు, గ్రాంట్లు అందించటంతో పాటు పట్టణ సంస్థలకు కేంద్ర రాష్ట్ర పన్నుల నుండి వాటా కల్పించాల్సిన అవసరం ఎంతైనా వుంది. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నయా–ఉదారవాద విధానాలు నెత్తినెక్కించుకొని ప్రజలపై భారాలువేస్తున్నారు. నేడు పట్టణాలు, నగరాలు మౌలిక సదుపాయాల కొరత అధిగ మించాలంటే రాబోయే పదేళ్ళలో కనీసం 39.2 లక్షల కోట్లు పెట్టుబడులవసరమని ఇటీవల కేంద్రప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తేల్చి చెప్పింది. 13వ ఆర్థిక సంఘం కూడా కేంద్ర రాష్ట్ర పన్నుల నుండి పట్టణ సంస్థలకి కొంత వాటా ఇవ్వాలని, క్రమం తప్పకుండా రాష్ట్రాల్లో ఆర్థిక సంఘాలను నియమించి స్థానిక సంస్థలకు నిధులు బదిలీ అయ్యేలా సిఫార్సులు చేసిన కేంద్ర ప్రభుత్వం అమలు చేయటంలేదు.

**పట్టణ స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వాలు**

కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ ప్రజలపై బహుముఖదాడిని ఎక్కుపెట్టింది. ప్రజలపై భారాలు పౌరసేవలు ప్రైవేటీకరణ, పట్టణ వ్యవస్థలను బలహీనం చేసి ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెంచేచర్యలు వేగవంతం చేసింది. వాస్తవంగా పట్టణరంగం రాజ్యాంగంలో పొందుపర్చిన విధంగా రాష్ట్రాల పరిధిలోనిది. దీనికి విరుద్ధంగా పట్టణరంగంపై కేంద్ర ప్రభుత్వం పెత్తనాన్ని చలాయిస్తూ 2018లో దేశవ్యాప్తంగా జాతీయ పట్టణ ప్రణాళికా విధాన ముసాయిదాను తీసుకొచ్చింది. దీనిని దేశవ్యాప్తంగా అమలుకు పూనుకున్నది. రాష్ట్ర ప్రభుత్వాలని ప్రక్కన పెట్టి స్థానిక సంస్థల కొరకు ప్రత్యేక పథకాలు రూపొందిస్తూ ప్రపంచ బ్యాంకు, ఐఎమ్ఎఫ్, ఏడిబి, డిఎఫ్ఐడి తదితర సంస్థల నుండి పెద్ద ఎత్తున అప్పులు తీసుకొస్తు న్నారు. ఈ సంస్థలు విధిస్తున్న నయా–ఉ దారవాద షరతులను పట్టణ సంస్థలపై బల వంతంగా రుద్దుతున్నారు. 2005లో ప్రవేశ పెట్టిన జెఎన్ఎన్‌యుఆర్ఎమ్ పథకం గాని ఇప్పుడు నరేంద్రమోడీ అమలు చేస్తున్న స్మార్ట్ సిటీలు, అమృతపథకం, స్వచ్ఛభారత్ తదితర పథకాలన్నీ ఈ సంస్థల కనుసన్నల నుండి వచ్చినవే. ఈ పథకాలు నుండి వచ్చే నిధులు తీసుకుంటే తప్పనిసరిగా వాటి షరతులు అమలు చేయాల్సిందే. అలాగే మ్యాచింగ్ నిదులు అనివార్యంగా అప్పుల్లోకి దించుతున్నారు. కేంద్ర

> **❝ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణ ప్రజలపై బహుముఖదాడిని ఎక్కుపెట్టింది. ప్రజలపై భారాలు పౌర సేవలు ప్రైవేటీకరణ, పట్టణ వ్యవస్థలను బలహీనం చేసి ప్రైవేట్ సంస్థల ఆధిపత్యం పెంచేచర్యలు వేగవంతం చేసింది. వాస్తవం గా పట్టణరంగం రాజ్యాంగంలో పొందిపర్చిన విధంగా రాష్ట్రాల పరిధిలోనిది. దీనికి విరుద్ధంగా పట్టణరంగంపై కేంద్ర ప్రభుత్వం పెత్తనాన్ని చలాయిస్తూ 2018లో దేశవ్యాప్తంగా జాతీయ పట్టణ ప్రణాళికా విధాన ముసాయిదాను తీసుకొచ్చింది. ❞**

రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణాభివృద్ధిపై కనీసం 5 శాతం జిడిపిలో నిధులు ఖర్చుపెట్టాలని అనేక కమిటీలు సిఫార్స్ చేసినా అమలు లేదు. 1992లో 74వ రాజ్యాంగ సవరణ ద్వారా పట్టణ స్థానిక సంస్థలకు దాఖలు పడిన అధి కారాలు, నిధులకు స్వయం ప్రతిపత్తి కల్పించకుండా బలహీన పరుస్తున్నారు.

ఒకే పన్ను–ఒకే దేశం పేర కేంద్ర బిజెపి ప్రభుత్వం 2017లో ప్రవేశపెట్టిన సరుకులు, సేవాపన్ను( జిఎస్‌టి) దేశంలోని పట్టణ స్థానిక సంస్థల ఆదాయాలను చావుదెబ్బతీసింది. మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మున్సిపల్ సంస్థల పరిధిలో ఉన్న ప్రకటనలు, ఎంటర్ టైన్‌మెంట్ పన్నులను జిఎస్‌టి పరిధిలోకి ఏకపక్షంగా లాగేసుకున్నారు. వీటితో పాటు కొన్ని రాష్ట్రాల్లో పట్టణ సంస్థల పరిధిలో అమలౌతున్న ఆక్ట్రాయ్, సరుకుల ఎంట్రీ పన్నులను కూడా జిఎస్‌టి మింగేసింది. దీనికి నష్టపరిహారంగా జిఎస్‌టి నుండి పట్టణ స్థానిక సంస్థలకు ఎలాంటి పరిహారం కేంద్ర ప్రభుత్వం చెల్లించటం లేదు. దీనివల్ల గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ ఏడాది 60 కోట్లు నష్టపోతున్నది. ఆక్ట్రాయ్ పన్నును జిఎస్‌టిలో కలుపుకోవటం వల్ల ముంబాయి కార్పొరేషన్ ఏడాదికి 7 వేల కోట్లు ఆదాయం నష్టపోతున్నది. ఇలా దేశంలో ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్ ఎంతోకొంత ఆదాయం కోల్పోతున్నది. ఆంధ్రరాష్ట్రంలో కూడా స్థానిక సంస్థలు విధించే ఆక్ట్రాయ్ పన్ను రద్దు చేశారు. మోటార్ వెహికిల్ పన్ను స్థానిక సంస్థల నుండి రాష్ట్రం బలవంతంగా లాగేసు కుంది. కాని వీటికి నష్టపరిహారం ప్రభుత్వం చెల్లించడం లేదు. చాలా సంవత్సరాలపటు ప్రొఫేషనల్ టాక్స్ ద్వార వచ్చే అదాయాన్ని ఇవ్వకుండా నిరాకరించారు. ఎస్ఇజెడ్‌లు, కారిడార్‌లు ఇతర పరిశ్రమలు, వ్యాపార వాణిజ్య సంస్థల కొరకు ప్రభుత్వం సేకరిస్తున్న భూములకు స్టాంపు డ్యూటీ మినహాయించడం వలన, 2008లో స్టాంపు డ్యూటీ తగ్గించడం వలన స్థానిక సంస్థలు పెద్ద ఎత్తున ఆదాయం కోల్పోతున్నాయి.

పట్టణాలు, నగరాల్లో ఉన్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్యాలయాలు, ఎస్టాబ్లిష్‌మెంట్స్, మిషనరీలకు కూడా ఆస్తి పన్ను చెల్లించడం లేదు. ప్రభుత్వాలు తమ కార్యాలయాలకు సంస్థలకు తప్పనిసరిగా ఆస్తి పన్ను చెల్లించాలని ప్రతి ఆర్థిక సంఘం చెప్పుతున్నది. అయినా అమలు చేయడం లేదు. పైపెచ్చు అనేక ప్రైవేటు సంస్థలకు, పరిశ్రమలకు ఆస్తి పన్ను మినహా యింపులు ఇస్తున్నాయి. ఉదాహరణకు విశాఖ పట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గంగవరం ప్రైవేటు పోర్టు ఏడాదికి కనీసం 25 కోట్లు ఆస్తి పన్ను చెల్లించాల్సి ఉంది. ఈ పోర్టు ఆస్తి పన్ను చెల్లించకుండా నగరం నుండి ఈ పోర్టును నోటిఫైడ్ ఏరియాగా మార్చేశారు. ఎస్ఇజెడ్‌లు, ఇతర బడాకార్పొరేట్ సంస్థలకు కూడా ఆస్తి పన్ను మినహాయింపులు ఇస్తున్నారు. ఇంకా అనేక పెద్ద పెద్ద సంస్థలు వందల కోట్ల ఆస్తి పన్ను చెల్లించకుండా ఎగ్గొడుతున్నా వాటిపై ఎలాంటి చర్యలు తీసుకోనీయకుండా ప్రభుత్వాలు పట్టణ స్థానిక సంస్థలపై ఒత్తిడి తీసుకొ స్తున్నా యి. ఈ సంస్థలు నిర్మాణ క్రమంలో కూడా స్థానిక సంస్థలకు చెల్లించాల్సిన బిల్డింగ్ అనుమతుల ఫీజులు, బెటర్‌మెంట్ చార్జీలు, భూబదిలీ చార్జీలు, స్టాంపుడ్యూటీలు కూడా చెల్లించడం లేదు. ఈ విధంగా ప్రభుత్వాలు తాము చెల్లించాల్సిన పన్నులు చెల్లించకపోవడం రెండోవైపు ప్రైవేటు కంపెనీలు, సంస్థలకు మినహాయింపులు ఇచ్చి పట్టణ స్థానిక సంస్థల ఆదాయాలకు గండికొడుతున్నాయి. బిల్డింగ్ ప్లాన్‌లు అనుమతులు కూడ ప్రైవేట్ పరం చేసారు. ఆంధ్ర ప్రదేశ్‌లో కాంప్రహెన్సివ్ ఫైనాన్షియల్ మేనేజ్ మెంట్ సిస్టం (సిఎఫ్ ఎంఎస్) అనే సంస్థను ఏర్పాటు చేసి పట్టణ సంస్థల ఆదాయాన్ని ఈ సంస్థకి తరలించి మొత్తం మున్సిపల్ ఆదాయంపై రాష్ట్ర ప్రభుత్వ పెత్తనం చేలాయిస్తున్నది. ప్రైవేటు సంస్థలు

> ❝ ఉమ్మడి ఆస్తులను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో ప్రైవేటీకరిస్తున్నారు. పార్కులు, కళ్యాణమండపాలు, వీధిలైట్లు, రవాణా, స్టేడియంలు, క్రీడా స్థలాలు, ఖాళీ స్థలాలు, క్వార్టర్స్ తదితర ప్రజాపయోగ ఉమ్మడి ఆస్తులు 33 నుండి 99 ఏళ్ళ పాటు పిపిపి క్రింద బడా ప్రైవేట్ సంస్థలపరం అవుతున్నాయి. ప్రైవేట్‌సంస్థలు వీటిని సొంత ఆస్తులుగా మార్చుకొని లాభార్జనకోసం ఉపయో గించుకుంటున్నాయి. దీంతో ప్రజలు ఉమ్మడి ఆస్తులను ఉపయో గించుకొనే స్వేచ్ఛ కోల్పోయి డబ్బులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ❞

చెపట్టే ప్రాజెక్టులకు మున్సిపాలిటీలకు సంబంధం లేకుండా ప్రత్యేక ఎస్క్రో ఎకౌంట్స్ ఏర్పాటు చేసి అ ఎకౌంటికి జమ అయ్యే ఆదాయంపై ప్రవేటు సంస్థలకు పూర్తి హక్కు ఉండేలా చేస్తున్నారు. స్మార్ట్ సీటి నగరాల్లో ప్రత్యేకంగా లిమిటెడ్ సంస్థలను ఏర్పాటు చేసి వీటిని మున్సిపల్ కార్పొరేషన్ నుండి వేరు చేస్తున్నారు.

ఇప్పుడు ఏకంగా మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వాహణలో పూర్తిగా ప్రైవేట్ పెట్టుబడికి గేట్లు ఎత్తేశారు. నిధులు కొరత పేర వీటిని మార్కెట్ శక్తులకు బదిలీ చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో దేశంలో అనేక పట్టణాలు నగరాల్లో అనేక మౌలిక సదుపాయాలు ప్రైవేటుపరం అయ్యాయి. ఉమ్మడి ఆస్తులను ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం పేరుతో ప్రైవేటీకరిస్తున్నారు. పార్కులు, కళ్యాణ మండపాలు, వీధిలైట్లు, రవాణా, స్టేడియంలు, క్రీడా స్థలాలు, ఖాళీ స్థలాలు, క్వార్టర్స్ తదితర ప్రజాపయోగ ఉమ్మడి ఆస్తులు 33 నుండి 99 ఏళ్ళ పాటు పిపిపి క్రింద బడా ప్రైవేట్ సంస్థలపరం అవుతున్నాయి. ప్రైవేట్‌సంస్థలు వీటిని తమ సొంత ఆస్తులుగా మార్చుకొని లాభార్జనే ధ్యేయంగా ఉపయోగించికుంటున్నాయి. దీంతో ప్రజలు ఉమ్మడి ఆస్తులను ఉపయోగించుకొనే స్వేచ్ఛ కోల్పోయి డబ్బులు చెల్లించి ఉపయోగించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా తీసుకొచ్చిన ఆస్తి పన్నులో మార్పు, మంచినీరు, మురుగునీరు, చెత్త సేకరణ తదితర వాటిపై కాస్ట్ టు కాస్ట్ విధానం.. ఇవన్నీ నయా–ఉదారవాద విధానల్లో భాగమే. పట్టణ వ్యవస్థను ప్రైవేట్ పెట్టుబడి లాభాలకి బలీయటమే.

### విదేశాల అనుభవం ఏమిటి?

మనదేశం కంటే అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లో పట్టణ స్థానిక సంస్థల అభివృద్ధి ఎన్సోరెట్లు ఎక్కువ. అభివృద్ధి చేందిన దేశాలు 80నుండి 90శాతం, చైనా 60శాతం పట్టణ జనాభా కలిగి ఉన్నాయి. ఈ దేశాల్లో పట్టణ సంస్థల పన్నుల విస్తృతి, విధులు, నిధులు, ప్రజలకు కల్పించే సౌకర్యాలను మన దేశంలో ఉన్న పట్టణాలతో పోల్చలేనిది. కాని మన పాలకులు నిత్యం ప్రపంచ దేశాలతో పోల్చుకొని మనదేశం కూడా వేగంగా అభివృద్ధి కావాలంటే పన్నులుపెంచాలని, ప్రైవేటీకరణ చేయాలని పదే పదే వల్లెవేస్తున్నారు. మనదేశంలో పట్టణ స్థానిక సంస్థలకు వస్తున్న మొత్తం ఆదాయం జీడీపిలో చూస్తే 1శాతానికే పరిమితమై ఉంది. అదే బ్రిటన్‌లో 13.9 శాతం, ఇటలీలో 15.3శాతం, జర్మనీలో 7.3శాతం, అమెరికాలో 8శాతం, పోలెండ్‌లో 4.5శాతం, కెనడాలో 7.4శాతం, దక్షిణాఫ్రికాలో 6శాతం, బ్రెజిల్‌లో 7.4శాతం, నార్వేలో 14.2శాతం స్పెయిన్‌లో 6.4శాతం, డెన్మార్క్‌లో 37శాతం, ఫిన్‌ల్యాండ్‌లో 22.4శాతం పట్టణ స్థానిక సంస్థలు వివిధ రూపాల్లో ఆదాయం పొందుతున్నాయి. అలాగే ఆ దేశాల్లో ఫెడరల్ ప్రభుత్వలు, రాష్ట్రాల నుండి పట్టణస్థానిక సంస్థలకు బదిలీ అయ్యే నిధులు కూడా చాలా ఎక్కువ. డెన్మార్క్‌లో 9.9శాతం ఆదాయం జిడిపిలో ఫెడరల్ రాష్ట్ర ప్రభుత్వాల నుండి పట్టణ సంస్థలకు బదిలీ అవుతున్నాయి. మనదేశంలో కేవలం 0.45శాతం మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు బదిలీ అవుతున్నాయి. అయితే ఈ దేశాల్లో కూడా గడిచిన రెండు దశాబ్దాల్లో ప్రజల సౌకర్యాలు, మౌలిక సదుపాయాలపై భారాలు, కోతలకు ఆయా ప్రభుత్వాలు ప్రయత్నించినా ప్రజాప్రతిఘటన వలన వెనక్కి తగ్గారు.

అభివృద్ధి చెందిన దేశాల్లోను, యూరప్ దేశాలన్నింటిలో కూడా పట్టణ స్థానిక సంస్థలుకు విశేష అధికారాలున్నాయి. ఈ దేశాల్లో ఆస్తి పన్ను ద్వారా పట్టణ సంస్థలకు సమకూరే ఆదాయం 1శాతం మాత్రమే. కానీ తేమ్మకం పన్ను రియల్ ఎస్టేట్ పన్ను, ఎంటర్‌టైన్‌మెంట్, అడ్వర్‌టైజ్‌మెంట్ , వ్యాపార పన్నులు, స్టాంపుడ్యూటీ, భూబదిలీ పన్ను ఇలా అనేక పన్నులు పట్టణసంస్థల పరిధిలో కొనసాగుతున్నాయి. భూమి మార్కెట్ రేటును కూడా ఈ సంస్థలే నిర్ణయించికుంటాయి. రాష్ట్రాలు, ఫెడరల్ ప్రభుత్వాలు వీటిల్లో జోక్యం చేసుకోవు. కొన్ని దేశాల్లో ఆదాయ పన్ను మీద 1 నుండి 3 శాతం వరకు ఈ సంస్థలు పన్ను విధిస్తున్నాయి. కెనడాలో టోరంటో, వాన్‌కోవర్ మహానగరాలకు స్పెషల్ స్టాటస్ కూడా ఇచ్చారు. మంచినీరు, మురుగునీరు, చెత్తపై యూజర్ ఛార్జీలు కూడా ఉన్నాయి. అయితే ఈ దేశాల్లో 12వ తరగతి (10+2) వరకు విద్య నిర్వహణ, అర్బన్ హెల్త్ సెంటర్స్ నిర్వహణా బాధ్యత మొత్తం పట్టణ స్థానిక సంస్థలదే. ఆస్తి పన్ను ద్వారా వచ్చే ఆదాయంలో 60శాతం ఈ పాఠశాలలకి ఖర్చుపెడతారు. అభివృద్ధిచెందిన, యూరప్ దేశాల్లో 12వ తరగతి వరకు ప్రభుత్వ ఉచిత విద్య ఉంటుంది. నూటికి 90శాతం ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించుకుంటారు. అమెరికా కెనడాల్లో కూడా ఇదే పరిస్థితి. ఈ విద్యార్థులకు బస్సు/ట్రాన్స్ పోర్టు కూడా పట్టణ సంస్థలే ఉచితంగా సమకూరుస్తాయి. మనదేశం నుండి అమెరికాలో ఉన్న ఎన్.ఆర్.ఐలు 99శాతం వాళ్ళ పిల్లలను పట్టణసంస్థలు నిర్వహించే స్కూల్స్, కాలేజీల్లోనే చదివించుకుంటారు.


అమెరికాలో మినహా అత్యధిక దేశాల్లో అర్బన్‌హెల్త్ సెంటర్స్ కూడా పట్టణసంస్థలే అద్భుతంగా నిర్వహిస్తున్నాయి. ఈ సంస్థలకు వచ్చే ఆదాయంలో 22శాతం వీటిమీద ఖర్చుపెడతాయి. వీటితో పాటు నివాసప్రాంతాల్లో పార్కుల నిర్వహణ, సామాజిక భవనాలు, క్రెచ్‌లు, గ్రంథాలయాలు తదితర వాటి బాధ్యత కూడా పట్టణ సంస్థలదే. ఈ దేశాల్లో ఉన్న సదుపాయాలకి, మనదేశంలో ఉన్న సదుపాయాలకి పొంతనేలేదు.

మనదేశంలో పెద్దపెద్ద కార్పొరేషన్‌లలో మినహా 90శాతం మున్సిపాలిటీలకు పాఠశాలలే లేవు. ఉన్నవి కూడా ఎక్కువభాగం 7వ తరగతి వరకే పరిమితమై ఉన్నాయి. వీటిల్లో కనీసమైన మౌలిక సదుపాయాలు లేక అనాధ సత్రాల్లాగా ఉన్నాయి. మున్సిపల్ లేదా మొత్తం ప్రభుత్వ స్కూల్స్‌లో పట్టణాల్లో ఎంతమంది పిల్లలు చదువుతున్నారని చూస్తే 10శాతంకి మించి ఉండరు. 90శాతం మంది వేల రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ విద్యా సంస్థల్లో చదివించుకోవాల్సిన పరిస్థితిని

(మిగతా 34వ పేజీలో)

# శ్రామిక వర్గ మేధావి ఆంటోనియో గ్రాంస్కీ

తెలకపల్లి రవి



రచయిత ప్రముఖ రాజకీయ విశ్వేషకులు

**(2021 జనవరి 22న ఆంటోనియో గ్రాంస్కీ 130వ జయంతి సందర్భంగా ఈ వ్యాసం ప్రచురిస్తున్నాం..సంపాదకుడు)**

ఆంటోనియో గ్రామ్‌స్కీ ప్రత్యామ్నాయ ఉద్యమాలకు ఉజ్వల భావావిష్కర్త. ఆయన మార్క్సిస్టు మూల సూత్రాలకు లేదా పార్టీ పాత్రకు తేడాగా ఏదో చెప్పినట్టు తరచూ మాట్లాడుతుంటారు. సంప్రదాయ మార్క్సిస్టు అనే పదం ఒకటి ఇలాటి వారు సృజించిందే. నిర్దిష్ట పరిస్తితులకు నిర్దిష్ట అన్వయం అన్నమార్క్సిజంలో సంప్రదాయ ముద్ర వెతకడమే పొరబాటు. శ్రమశక్తిని గౌరవించడం, దోపిడీని పీడనను అంతమొందించడం, సమసమాజాన్ని సంస్కృతిని నెలకొల్పడం అనే ఆశయాలను మౌలిక సూత్రాలుగా చూడాలే గాని సంప్రదాయ మార్క్సిజం అనడంలో అర్థం లేదు. వేల సంవత్సరాల మానవ సమాజ చరిత్రలోని అసంఖ్యాక అశాస్త్రీయ సంప్రదాయాలన్నీ అంతిమంగా ఆధిపత్య వర్గాలకు సేవ చేసినవే. వాటిని ఛేదించాలన్న మాట అన్నప్పుడే సంప్రదాయ ధిక్కారం మొదలవుతుంది. నూతనసమాజ నిర్మాణ అంకురార్పణ జరుగుతుంది. ఇందుకోసం పనిచేసే కమ్యూనిస్టుల కర్తవ్యాలు కమ్యూనిస్టు పార్టీలను ఎదుర్కొనే సవాళ్లను వాస్తవిక కోణంలో పరిశీలించిన వ్యక్తి గ్రామ్‌స్కీ. ప్రపంచ చరిత్రలోనే నాటికీ నేటికీ అతిపెద్దదైన రోమన్ సామ్రాజ్య కేంద్రమైన ఇటలీలో పుట్టిన గ్రామ్ స్కీ ఆధునిక ప్రపంచంలో తొలి ఫాసిస్టు రాజ్యంగా పుట్టుకొచ్చిన ముస్సోలిని నియంతృత్వం విధించిన ఖైదులో రచనలు చేశాడు. ఇటాలియన్ కమ్యూనిస్టుపార్టీ అగ్ర నాయక బృందంలో ఒకడైన గ్రామ్‌స్కీ పార్లమెంటు సభ్యుడు కూడా. ఎంపిగా వున్నప్పటికీ తనను కారాగారంలో పదేళ్లు మగ్గేలా చేసిన ఫాసిజం నిజ స్వరూపం తొలిదశలోనే చూసిన వ్యక్తికూడా ఆయన. ఇన్నిటి మధ్యనా అంతులేని విశ్వాసంతో, అధ్యయనంతో స్వీయ పరిశీలనతో విస్మరించబడిన ఉద్యమ సమస్యలు చెప్పడంలో మేధస్సుతో పాటు అంకిత భావం, అచంచల విశ్వాసం గమనించాల్సి వుంటుంది. గ్రామ్‌స్కీ రాసిన వాటిలో మేధావులు, ఆధునిక యువరాజు, రాజ్యం పౌర సమాజం, తత్వశాస్త్ర అధ్యయనం, మార్క్సిజం-సమస్యలు అనే రచనలతో పాటు ఇటాలియన్ విద్యావిధానంలో ముస్సోలిని



మార్పులు తెచ్చినప్పుడు చేసిన పరిశీలన, తత్వశాస్త్ర అధ్యయనం, ఇటలీ కమ్యూనిస్టు ఉద్యమ క్రమంలో అనుభవాలు వంటివి కూడా లోతుగా సాగాయి. నేడు వివిధ రూపాల్లో ముందుకు వచ్చిన అస్తిత్వ వాదాల గురించి చెప్పాడు. రాజ్యం, మతం నిరంకుశాధికార బృందాలు, విస్తార జన సమూహాలు, నాయక బృందాలు, కార్యకర్తలు, అంతర్గత పోరాటాలు, యాదృచ్ఛికత, అనివార్యత వంటి సైద్ధాంతిక కోణాలు, రాజకీయ ప్రచార ప్రక్రియలు, సైనిక సమస్యలు వంటివాటిని అధ్యయనం చేశాడు. ప్రధానంగా ఇటలీని, యూరప్‌ను ఉదహరించినా భారత స్వతంత్ర పోరాటంతో సహా ఇతర దేశాలలో అనుభవాలను కూడా పరిశీలించాడు.

### పార్టీలూ మేధావులు

తెలుగునాట గ్రామ్‌స్కీ చర్చలో మేధావుల పాత్ర, పౌర సమాజం అన్న భాగాలు ఎక్కువగా చర్చకు వస్తున్నాయి గనక వాటినే తీసుకుందాం.

సమాజ గమనంలో ఆవిర్భవించే ప్రతి వర్గమూ తనదైన మేధావులను సృష్టించుకుంటుంది. ఉదాహరణకు ప్రాచీన కాలంలో అన్నిదేశాలలోనూ పూజారులు, పండితులు, మతాధిపతులు మేధావులుగా పరిగణించబడ్డారు. ఇలాటివారు ప్రాచీన బృందాలలోనే గాక ఆధునిక వర్గాలలోనూ కూడా మేధావులాగా గుర్తించబడుతున్నారు. వీరే వ్యవస్థీకృత మేధావులు. వీరు ఉపరితలానికి సంబంధించి ప్రజల ఆలోచనలను, స్పందనలను ప్రభావితం చేయడంలో విశేష పాత్ర వహిస్తారు. మరోవైపున ఉత్పత్తి క్రమాన్ని బట్టి, పాలకవర్గాల అప్పటి అవసరాల మేరకు మేధావులు పెంపొందుతుంటారు. ఉదాహరణకు వ్యాపారవర్గానికి మేధాశక్తి చాలా అవసరం. లేకపోతే తన సరుకు వైపు జనులను ఆకర్షించలేదు. పెట్టుబడులు రప్పించుకోలేదు. సామ్రాజ్యవాదం, జాతి దురహంకార భావనలు వ్యాప్తిచేసే మేధావులూ తయారవుతారు. కొత్తగా ప్రభవించే వర్గాలకు తగినట్టుగా సమాజంలోని మేధాస్రవంతిలో ఒక భాగం మలచబడటం జరుగుతూనే వుంటుంది. భౌతిక జీవితంలో ప్రొఫెసర్లు, సాంకేతిక నిపుణులు వంటివారిని మేధావులుగానే చూస్తుంటారు.వీరు వృత్తిగత మేధావులు. ఒక చిత్రకారుడు, గాయకుడు, కళాకారుడు మేధావిగా పరిగణించబడవచ్చు. నిజానికి మనుషులందరూ మేధావులే. కాని మేధావులుగానే పనిచేసే అవకాశం అందరికీ వుండదు. ఇండియాలాటి చోటనైతే కింది కులాల వారికి చదువుకోవడానికే అవకాశం లేకుండా చేశారు.

> "మేధావులలోనూ పట్టణ, పల్లె ప్రాంతాల మధ్య తేడా వుంటుంది. పట్టణాల్లో, నగరాల్లో బుద్ధిజీవులు యాంత్రికత తో అధికారుల్లా తయారై వుంటారు. పల్లె ప్రాంతాలలో మేధావుల స్థానం, హోదా ఎక్కువగా వుంటాయి. అందుకే పల్లె ప్రజలు తమ పిల్లల్లో ఒకరైనా మేధావి, అధికారి కావాలనికోరుకుంటారని గ్రామ్‌స్కీ రాస్తాడు."

మరికొన్ని దేశాలలో నల్లజాతీయులను బానిసలుగా చేశారు. ఇక్కడ ప్రశ్న మేధాకృషికి అవకాశం లేకుండా చేయడం తప్ప మేధావులు కాని వారు అనడానికి లేదు. నిజమైన మేధావులు తయారు కావడం మాత్రం నిరంత భౌతిక మేధా శ్రమ చేయడంపై ఆధారపడి వుంటుంది. పని, పఠనం, పరిశీలన కలిసి ఇలాటి వారిని తయారు చేస్తాయి. మధ్య యుగాలలో పెంపొందిన మేధా ప్రక్రియ తర్వాతి కాలంలో విస్తారమైన విద్యా వ్యవస్థ ద్వారా విస్తరించింది. ఆధునిక కాలంలో దీనికి సాంకేతిక సమర్థత కూడా ఒక పునాది అవుతుంది.. అయితే కేవలం ప్రతిభా విశేషాలు, ఉపన్యాస పటిమ, వాగ్ధాటి సంపూర్ణ మేధావులను చేయవు. వృత్తి నైపుణ్యం కాస్తా భావాలను నిర్దేశించగలిగినదిగా మారాలి. వాటిద్వారా అవతలి వారిని ఆచరణకు, ఆలోచనకు ప్రేరేపించగలిగితే అప్పుడు మేధస్సు సార్థకమవుతుంది. ఈ మేధా ప్రక్రియ ఒక నిర్దిష్టమైన చారిత్రిక మార్పులలోనే సాధ్యపడు తుంది.

ఈ మేధా ప్రక్రియ దేశదేశాలలో రకరకాలుగా జరిగింది. రోమన్ సామ్రాజ్య కేంద్రమైన ఇటలీలో, నవనాగరికమూ, వివిధ ప్రజావెల్లువలకు నిలయమూ అయిన ఫ్రాన్స్‌లో, రవి అస్తమించదనిపించుకున్న సామ్రాజ్యవాద బ్రిటన్‌లో, మార్క్సిజానికి జన్మనిచ్చిన జర్మనీలో, దాని అంతర్భాగమైన ప్రష్యాలో, తొలి శ్రామిక రాజ్యం స్థాపించబడిన రష్యాలో వివిధ దశల్లో, వివిధ రీతుల్లో మేధా వికాసం జరిగిన తీరు గ్రామ్ స్కీ వివరిస్తాడు. రష్యాతో ఒక విధంగా అమెరికా సంయుక్త రాష్ట్రాలను పోల్చవచ్చు నంటూ అక్కడ ఆంగ్లో శాక్సన్ సంప్రదాయ మేధావులు, వృత్తి నిపుణులు ప్రధానంగా జతకూడిన సంగతి ప్రత్యేకంగా చెబుతాడు. అక్కడ నల్లజాతి మేధావులు కూడా అమెరికన్ భావజాలాన్నే అందిపుచ్చుకోవడం ఎలా జరిగిందో వివరిస్తాడు. అదే పోర్చుగల్, స్పెయిన్ వంటి చోట్లకు వస్తే ప్రతీ ఘాత భావ జాలం, సైనికతత్వం ఎలా మేధావులను ప్రభావితం చేశాయో నొక్కి చెబుతాడు. ఆసక్తికరమైన విషయమేమంటే ఇక్కడే గ్రామ్‌స్కీ తూర్పు దేశాలైన ఇండియా, చైనాలనూ ప్రత్యేకంగా పరిశీలిస్తాడు, జపాన్‌లో ఎక్కువగా జర్మనీ, బ్రిటిష్ తరహాల మిశ్రమంగా సాంకేతికత భూస్వామ్యసైనిక సంస్కృతి మేధావులను ప్రభావితంచేసింది. అదే చైనా లోనూ, ఇండియాలోనూ లిఖిత భాష వల్ల జనబాహుళ్యానికి మేధావులకూ మధ్య ఎడం ఎక్కువగా వుండిపోయిందని, మరీ ముఖ్యంగా మత పరమైన దూరం పెరిగిపోయిందనీ విశ్లేషిస్తాడు. యూరప్, లాటిన్ అమెరికాలతో పోలిస్తే తూర్పు ఆసియాలో మత పరమైన భాషలో మూడు దొంతరులు వుండిపోయాయి. మతాధిపతులు, లౌకిక స్పృహ కలిగిన మతాలవంబకులు, సామూహికంగా మతాన్ని అనుసరించేవారు. ఈ క్రమంలో మతగ్రంధా లలో ఏమున్నదో దాన్ని పాటించే విశాల జనావళికి తెలియకుండానే వుండిపోయింది. ఇప్పుడు ఆరెస్సెస్, బిజెపి మతతత్వ రాజకీయాల కోసం ఏమిచెప్పినా వినేవారు దొరుకుతున్నారంటే కారణం వారికి అసలైన విషయాలు తెలియకపోవడం అసలు కారణం.

**భావజాల ప్రభావం, రాజకీయ పార్టీలు**

మేధా పరమైన పాత్రను రెండుగా చూడొచ్చు. ఒకటి పౌర సమాజం లేదా అన ధికార ప్రభావం. రెండవది రాజకీయ శక్తి లేదా రాజ్యం. మొదటి తరహాకు చెందిన భావజాలం ప్రబలంగా సమాజాన్ని నిర్దేశిస్తూ ప్రశ్నిస్తుంది. రెండవది రాజ్యాధికారం ద్వారా ప్రాబల్యం వహిస్తుంది. మొదటి తరహాకు చెందిన మేధావుల ప్రాబల్యం వారి ప్రతిష్ట వల్ల, సామాజిక నిబద్ధత వల్ల సిద్ధిస్తుంది. రెండవది రాజ్యం నిబంధనలు, నిర్బంధ యంత్రాంగం వల్ల కలుగుతుంది. భారతదేశం లో ఇప్పుడు మోడీపరిపాలనలో ఈ సమస్య తేలిగ్గా అర్థమవుతుంది. కమ్యూనిస్టులు, ప్రగతిశీల మేధావుల ప్రభావం, ప్రేరణ సంఘపరివార్‌కు బొత్తిగా మింగుడు పడక వారు కాంగ్రెస్ అండతో అన్ని చోట్ల తిష్ట వేశారని ఆరోపిస్తున్నారు. అనేకమందిపై దేశద్రోహం ఆరోపణలు చేసి వేటాడుతున్నారు. (ఇదే పని ముస్సోలిని కూడాచేయడం వల్లనే గ్రామ్‌స్కీ జైలు పాలయ్యారు.) మేధావులలోనూ పట్టణ, పల్లె ప్రాంతాల మధ్య తేడా వుంటుంది. పట్టణాల్లో, నగరాల్లో బుద్ధిజీవులు యాంత్రికతతో అధికారుల్లా తయారై వుంటారు. పల్లె ప్రాంతాలలో మేధావుల స్థానం, హోదా ఎక్కువగా వుంటాయి. అందుకే పల్లె ప్రజలు తమ పిల్లల్లో ఒకరైనా మేధావి, అధికారి కావాలనికోరుకుంటారని గ్రామ్‌స్కీ రాస్తాడు. ఇది ఇప్పటికీ వర్తించే సత్యమే. వలసపాలన ప్రభావం కూడా. అయితే పల్లె ప్రజలలో మేధావుల కృషివల్ల పెరిగే చైతన్యం, వచ్చే మార్పు పైనుంచి దిగే అధికారులపై ఆగ్రహంగా, వైముఖ్యంగా కూడా మారవచ్చు (రైతాంగ తిరుగుబాట్ల నుంచి ఇప్పుడు అధికారులను కట్టేశారని, బంధించారని మనం వినే వార్తలకు ఇదే కారణమవుతుంటుంది). ఇదే పట్టణ ప్రాంతాలలో వృత్తిగత మేధావులను లేదా సాంకేతిక నిపుణులను తీసుకుంటే వారు శ్రామిక జనబాహుళ్యంపె అంతటి పత్యక్ష ప్రభావం చూపించలేరు. ఆ జనబాహుళ్యంలోంచి చైతన్యంతో వచ్చే స్వాభావిక మేధావులే అలాటి ప్రభావం చూపించగలరు. రాజకీయ పార్టీలు చేసే పని అదే. రాజ్యం చట్టంతోచేసే పని రాజకీయపార్టీ తన శ్రేణులతో చేస్తుంది. వారంతా ఆ భావజాలంతో ప్రభావితులై పనిచేయడం మొదలెడతారు. ఆ విధంగా చూస్తే రాజకీయ పార్టీల తరపున పనిచేసేవారందరినీ మేధావులుగానే చూడాల్సి వుంటుంది. అంటే వారిలో వ్యక్తిగతంగా తరతమ తేడాలు వుండవని కాదు. కాని వారు ప్రధానంగా భావాలతో ప్రేరితులై పనిచేస్తారు. ఇతరులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తారు. ఉదాహరణకు ఒక వ్యాపారి లేదా రైతు పార్టీలో చేరితే వ్యాపారం కోసం చేరకపోవచ్చు అలాగే ఇతరవృత్తులు, పనులు చేసుకునేవారు కూడా. వారి అంతిమలక్ష్యం, ఉమ్మడిప్రణాళిక ఒకే విధంగా వుండాలి.

**నవీనయువరాజు– పార్టీ నిర్మాణం**

కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం గురించి గ్రామ్‌స్కీ తన మోడ్రన్ ప్రిన్స్ (నవీన యువ రాజు)లో వివరంగా రాస్తాడు. ఇటాలియన్ రాజనీతిజ్ఞుడైన మాకియవెల్లి రాసిన ప్రిన్స్‌ను

> **" రాజకీయ పార్టీలు నిర్దిష్ట పరిస్థితిని బట్టి రూపొందించుకునే కార్యాచరణలతో నడుస్తాయి. నిలుస్తాయి. ఇక్కడే రాజకీయ వ్యూహాలను యుద్ధరంగంతో పోల్చవచ్చు. యుద్ధంలో పాల్గొంటున్నా ఎప్పుడు ఎలాటి అడుగు వేయాలన్నది రణ భూమిలోనే నిర్ణయమవుతుంది తప్ప సైనికశాస్త్రం చెప్పిందని శాశ్వత నిర్ణయాలు జరగవు. ఇది రాజకీయ వ్యూహాలకూ వర్తిస్తుంది. "**

దృష్టిలో పెట్టుకుని ఈ పేరు పెట్టాడు. జైలులో ఆయన మార్క్సిజం, కమ్యూనిస్టు పార్టీ వంటిపదాలు వాడటానికి వీలు లేదు గనక ఈ పద్ధతి ఎంచుకున్నారు. మార్క్సిజం అనే బదులు థియరీ ఆఫ్ ప్రాక్టీస్ ( ఆచరణాత్మక సిద్ధాంతం) అన్నాడు. మార్క్సిజాన్ని చోదకశక్తులు ఆచరణలో పెట్టాల్సి వుంటుంది గనక అది సంకేత నామంగానే గాక సార్థకమైన అర్థంగానూ చూడాలి. పాత కాలంలో అన్ని పనులు చేసే రాజులు, యువరాజులు అవతార పురుషుల గురించి చెప్పుకునివుండొచ్చు గాని ఆధునిక కాలంలో ఆ పని సంఘటిత పార్టీలు మాత్రమే చేయగలవన్నది ఆయన సూత్రీకరణ. సక్రమంగా లేనిదాన్ని నిర్మూలించి సరైన నిర్మాణం చేయాలంటే రాజకీయ పార్టీ వుండాలి తప్ప వూహాజనితమైన వ్యక్తి వల్ల కాదని చెబుతాడు. పాలనా వ్యవస్థల పరిణామ క్రమంలో ఆర్థిక కార్పొరేట్ వ్యవస్థ అన్నది అత్యంత ఘోరమైంది. సంప్రదాయ పాలక వర్గాలు విచ్ఛిన్నమయ్యే కొద్ది పరాన్నభుక్కు లక్షణాలతో అణచివేత స్వభావం పెరుగు తాయి. ఈ సమయంలో అందుకు విరుగుడుగా రాగలిగింది పారిశ్రామికీకరణ క్రమంలో పెరిగిన ఆధునిక ప్రజారాశులు మాత్రవే. మతపరమైన పాలకవర్గాలు విశాలజాతి భావనను చిన్నాభిన్నం చేస్తే అంతర్జాతీయతతో కూడినజాతీయ దృక్కోణాన్ని మళ్లీ రూపొందించి మేధాపరమైన నైతిక రాజకీయ సంస్కరణ చేయాల్సిన బాధ్యత పార్టీపై ఉంటుంది. ప్రపంచం పట్ల దృక్పథాన్ని మార్చాల్సి వుంటుంది. అయితే సాంస్కృతిక నైతిక సంస్క రణ ఏదైనా సరే ఆర్థిక కార్యక్రమంతో ముడిపడి వుంటుంది. కాబట్టి ఈ రెంటినీ మేళవించి నడిపించాలి. గ్రామ్‌స్కీ మాటల్లో వర్తమాన భారతంలోనూ, ప్రపంచంలోనూ కూడాచూస్తున్న రకరకాలపరిణామాలు మనం గమనించవచ్చు. అంటే ఆయన జోస్యం చెప్పారని కాదు. వ్యవస్థాగతమైన మార్పులు ఎంత సంక్లిష్టమైనవో చెప్పడం తన గొప్పతనం.

మార్క్సిజం మానవ ప్రవర్తనను, సమాజాన్ని స్థిరభూతమైందిగా చూడదు. మంచి చెడ్డలు శాశ్వతంగా నిర్ణయించేయదు. వారివారి సామాజిక, ఆర్థిక నేపథ్యాలను బట్టి మనుషుల చైతన్యం రూపొందుతుంది. కొన్ని కొలబద్దలతో, విమర్శ తాత్వికతల ద్వారా చరిత్ర గమనాన్ని అంచనా కట్టవచ్చు. ఆ విధంగా చూసినప్పుడు రాజకీయ శాస్త్రం అనేది నిరంతరం రూపొందుతూ, మలచబడుతూ వుంటుంది. దానికి సంబంధించిన తర్కాన్ని గాని, రూపాలను గాని పరిణామ దశలో వున్నవిగానే చూడాలి. మనుషుల కార్యాచరణ. కార్యాచరణకు ఉద్యుక్తం చేయడం, దానికి పురికొల్పే ప్రణాళిక ఇవే రాజకీయ పార్టీలు చేయవలసింది. రాజకీయాలు నడపాలనుకున్న వారెవరైనా సరే ఉపరితల కట్టడం(అంటే మతం చైతన్యం వంటి అంశాలు) స్థాయిని దృష్టిలోపెట్టుకుని అందుకు గతితర్క పరంగా సరిపడే కార్యక్రమాన్ని రూపొందించుకోవలసి వుంటుంది.

**పౌర సమాజం సాంస్కృతిక కృషి**

గ్రామ్‌స్కీ బోధనల్లో అత్యంత కీలకమైన అంశం ఇక్కడే వుంది. పునాది ఉపరితల కట్టడం గురించి మార్క్సిజం అనుసరించేవారు ఎప్పుడూ చెప్పుకుంటారు. కాని ఈ రెండూ ఒకే స్థాయిలో వుండబోవు. రాజకీయ కార్యాచరణ గురించిన ఆలోచన మొదటి దశలో మొదటి అడుగు మాత్రమే. దాన్ని ఉపరితల కట్టడంతో అనుసంధానం చేయడం రెండవది. కాని ఉపరితల కట్టడం ఇంకా ఎలాటి అనుసంధానం లేని ఆకాంక్షలకే పరిమితమైన గందరగోళ వ్యవహారంగానూ, ప్రాథమిక దశలోనూ వుంటుంది. మరి అలాటప్పుడు రాజకీయాలనూ, చరిత్రనూ గుర్తించడం, మొత్తం జీవితాన్ని రాజకీయాలతో ముడివేయడం ఎలా సాధ్యపడుతుంది? ఉపరితల కట్టడంలో ప్రత్యేకతలను ఎలా అర్థం చేసుకోవడం? ఈ రెంటినీ కలిపి ఒక చారిత్రిక దశను ఎలా అంచనా వేయడం? ఉపరితల కట్టడంలో లానే పునాదిలోనూ ప్రత్యేకతలను చూడగలమా? ఇదే సిద్ధాంత అధ్యయనానికి, తాత్విక సూత్రీకరణలకు సంబంధించిన అంశమవుతుంది. భౌతిక ఉత్పత్తిలో ఆర్థిక సంబంధాలలో వచ్చే మార్పులను, ప్రకృతి శాస్త్రాన్ని అంచనాకట్టినంత ఖచ్చితంగా అంచనాకట్టొచ్చునని మార్క్స్ అంటాడు. అదే సైద్ధాంతిక రంగంలో అంటే న్యాయం రాజకీయం మతం అలంకార శాస్త్రం తత్వశాస్త్రం వంటివాటిని అర్థం చేసుకోవడానికి తేడా వుంటుంది. ప్రతి సిద్ధాంతం, దానికి సంబంధించిన వ్యవస్థలకు ఒక చారిత్రిక నేపథ్యం వుంటుంది. చరిత్రక్రమంలో ఎవరికైనా మహా వ్యక్తులుగా అహంభావాలు, తపనలూ వున్నా కూలిపోవలసిందే. రాజకీయ పార్టీలు నిర్దిష్ట పరిస్థితిని బట్టి రూపొందించుకునే కార్యాచరణలతో నడుస్తాయి. నిలుస్తాయి. ఇక్కడే రాజకీయ వ్యూహాలను యుద్ధరంగంతో పోల్చవచ్చు. యుద్ధంలో పాల్గొంటున్నా ఎప్పుడు ఎలాటి అడుగు వేయాలన్నది రణభూమిలోనే నిర్ణయమవుతుంది తప్ప సైనికశాస్త్రం చెప్పిందని శాశ్వత నిర్ణయాలు జరగవు. ఇది రాజకీయ వ్యూహా లకూ వర్తిస్తుంది. రాజకీయాలలో ప్రాథమిక శక్తులేమిటి? పాలితులూ, పాలకులూ నాయకులు, అనుసరించే శ్రేణులూ. రాజ్యం, పాలక వర్గాలు, వాటి పాత్ర చరిత్రలో స్పష్టంగా కనిపిస్తాయి. కాని రాజకీయ పార్టీ, అందునా నూతన సమాజం కోసం పనిచేసే పార్టీ నూతన నిర్మాణం గురించిన విషయాలు సరైన చైతన్యంతోనే నిర్ణయించుకోవాలి. సవ్యంగా అనుసరించాలి. గత చరిత్రలోని పాలకవర్గాల పద్ధతులు ఇక్కడ సరిపోవు. ఒక లక్ష్యం సాధించాలి గనక నిర్ణయించుకోవడం వేరు. నాయకుడు నిర్ణయించాడు గనక చేయాలనుకోవడం వేరు. బాగా జరిగితే నాయకుల గొప్ప కావచ్చు. తప్పు జరిగితే చేసిన వారిది అనవచ్చు. ఈ కారణంగానే చరిత్రలో అనేక త్యాగాలు వృథాగా పోవడం చూస్తాం. సైన్యంలో ఒక పటాలం బలైపోవచ్చు. ఉదాహరణకు ఒక దళం రోజుల తరబడి సరైన తిండి లేకపోయినా తట్టుకుని పోరాడుతుంది. అదే దళం నాయకుడి తప్పు వల్ల ఒకపూట తిండి పొందలేకపోయినా ఆమోదించలేకపోవచ్చు. ఇవే సైద్ధాంతిక తప్పిదాలు. ఇలా జరగకూడదంటే విస్తారమైన అధ్యయనం, వాస్తవాలతో అనుసంధానం వుండాలి. విశాల జనరాశుల పాత్రనూ పౌర

> **“ అనేక ఎదురుదెబ్బలు, పరాజయాలతోనే మానవ సమాజ పురోగమనం, పునర్నిర్మాణం జరుగుతాయి. ఉద్యమాల ముందు, వెనకలు కూడా అలాటివే. గతాన్ని గురించి సరైన మదింపు వేసుకుని, వర్తమానాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకుంటేనే పార్టీ తన కర్తవ్యాన్ని పూర్తి చేయగలుగుతుంది. ఈ క్రమంలో ఒంటెత్తు వాదులు అంతర్గత విషయాలలో తలమునక లవుతారని గ్రామ్‌స్కీ హెచ్చరిస్తాడు. ”**

సమాజంపై నైతిక ప్రభావం నింపే మేధావుల మద్దతునూ చూరగొనాలనేది గ్రామ్‌స్కీ మాట. ఆయన ఆ మాటలు చెప్పేనాటికి సోవియట్‌లో స్టాలిన్‌కూ, ట్రాట్స్కీ వంటివారికి మధ్య జరుగుతున్న అంతర్గత పోరాటం గురించి కూడా ప్రస్తావించాడు. అంతర్జాతీయత అనే దాన్ని నిర్ధిష్టంగా అన్వయించడంలోనే బోల్షివిక్‌ల మౌలికత వుందని చెప్పాడు. నిర్మాణాత్మకంగా ముందుకు సాగేశక్తుల చేతికి చొరవ వచ్చే వరకూ కూడా ప్రపంచ దేశాల చరిత్ర గమనం అప్పటి ఆవశ్యకతను బట్టి సాగుతుంటుంది. అంతర్జాతీయ స్వభావం గల ఒక వర్గం అచ్చంగా తమవైన సంకుచిత పరిమిత సీమలలో, ఇంకా చెప్పాలంటే జాతీయ హద్దుల కన్నా సంకుచితమైన స్థానికతలో చిక్కుకుపోయిన మేధావుల ప్రభావాన్ని అధిగమించాల్సి వుంటుంది. మోడీ పరిపాలనలో ఇప్పుడు శ్రుతిమించిన దేశభక్తి సిద్ధాంతాలను చూస్తున్న నేపథ్యంలో దీన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు.

### విస్తృతప్రేరణ, కదలిక

చొరవను చేతిలోకి తీసుకోకుండా పరిస్థితులు అనుకూలంగా లేవని కాలయాపన చేస్తూ వుండటం కూడా పొరబాటవుతుంది. ఉద్యమాలు వాటికవే ఉప్పొంగి వచ్చే (స్పాంటేనిటీ) పరిస్థితి ఏర్పడిందంటేనే పార్టీ జోక్యం లోపించిందని అర్థం చేసుకోవాల్సి వుంటుంది. అయితే ఈ జోక్యం ఏదో పైనుంచి రుద్దితే సాధ్యమయ్యేది కాదు. ఈ భాగాన్ని గ్రామ్‌స్కీ విస్తారంగా చర్చించాడు. కేవలం ఆర్థికాంశాలకే పరిమితమయ్యే ఆర్థికవాద ధోరణి, కార్మిక సంఘాలలోనూ పర్యవసానాలు పట్టించుకోకుండా గుత్తాధిపతుల ప్రయోజనాల కోసం పాకులాడే కార్పొరేట్ ధోరణి పాలకులలోనూ వుండటాన్ని చర్చిస్తాడు. ఇది కూడా ఇప్పుడు మనం చూస్తున్నదే. విశృంఖల వాణిజ్య స్వేచ్ఛ అనేది వాస్తవంలో వారి తరపున రాజ్యం పాత్రను పెంచుతుంటుంది. దీంతో పోలిస్తే ఆర్థిక వాద ధోరణి అంత ప్రమాదకరం కాదు. అయితే జనరాశుల సైద్ధాంతిక సాంస్కృతిక చైతన్యం పెంచే పాత్ర పట్ల ఉపేక్ష నష్టం చేస్తుంది. శాశ్వత విప్లవం పేరిట దానికదే ఎలాగూ వస్తుందనే రీతిలో ఆలోచిస్తూ కూచోవడం, అవకాశం లేదని నిరుత్సాహ పర్చడం తప్పు. జనబాహుళ్యం మార్పు అవసరమనే చైతన్యాన్ని పెంచుకోవడానికి, భావజాలం విస్తరించడానికి పౌర సమాజంలో ప్రచారం, ఆందోళన కొనసాగించాలి. చైతన్యం పెరుగుదలను ఉత్పత్తి చట్రంతో పాటు ఉపరితలం కూడా ప్రభావితం చేస్తుంది గనక భావజాల రంగంలో చైతన్యం పెంచడంపై కేంద్రీకరించాల్సి వుంటుంది. భావం ప్రజా బాహుళ్యాన్ని ఆవరించితే భౌతిక శక్తి అవుతుందన్న మార్క్స్ మాటలు నిజం కావడానికి చాలా దశలు అధిగమించాల్సి వుంటుంది. అంటే వ్యక్తులుగా అందులో పాల్గొనే వారు కూడా తమ వ్యక్తిగత పరిమితులకు అతీతంగా పరిస్థితులను మార్చవలసిన అగత్యాన్ని అవగాహన చేసుకోగలగాలి. సమస్యలపై పోరాడటంతో పాటు విస్తృతాంశాల అవగాహనను కూడా పెంచితే జనసామాన్యం ఒక శక్తిగా మారతారు. ఇది కేవలం వ్యక్తిగత చైతన్యానికి సంబంధించింది కాదు. ఈ రోజు ఓడిపోయినా రేపు తప్పక గెలుస్తామనే విశ్వాసం వుండటం ఎంత ముఖ్యమో, దానికి తగిన సన్నద్ధత, సమిష్టి కృషి లేకపోవడం అంతే పెద్దలోపం. లేకపోతే ఇదో విధమైన కర్మ సిద్ధాంతంగా మారే ప్రమాదముంటుంది. అనేక ఎదురుదెబ్బలు, పరాజయాలతోనే మానవ సమాజ పురోగమనం, పునర్నిర్మాణం జరుగుతాయి. ఉద్యమాల ముందు, వెనకలు కూడా అలాటివే. గతాన్ని గురించి సరైన మదింపు వేసుకుని, వర్తమానాన్ని కూడా సరిగ్గా అర్థం చేసుకుంటేనే పార్టీ తన కర్తవ్యాన్ని పూర్తి చేయగలుగుతుంది. ఈ క్రమంలో ఒంటెత్తు వాదులు అంతర్గత విషయాలలో తలమునక లవుతారని గ్రామ్‌స్కీ హెచ్చరిస్తాడు. బయట వున్న విశాల జనరాశులను ప్రభావితం చేయడంపై కేంద్రీకరించి, నిర్ధిష్ట కృషి నిరంతరం సాగిస్తేనే ఆశించిన మార్పులను సాధించగలమని ఉదాహరణలతో సహా చెబుతాడు. రాజ్యాంగం అంటూ ఏర్పడిన తర్వాత దానితో నిమిత్తం లేకుండా రాజకీయ పార్టీలు పని చేయడం సాధారణ పరిస్థితిలో జరిగేది కాదని స్పష్టం చేస్తాడు. కాని ఆ సమాజంలో మార్పు తీసుకురావడం, ఎన్నికలలో ఒకపార్టీ స్థానంలో మరో పార్టీ రావడం ఒకటి కాదని కూడా హెచ్చరిస్తాడు. ఎన్నికల తత్వం సూటిగా కనిపించకుండా పరోక్షంగా ఎలా పనిచేస్తుంటుందో కూడా విశ్లేషిస్తాడు. పాలకవర్గాలు ఎన్నికల కోసం సృష్టించే మాయాజాలంలో కుహనా సిద్ధాంతాలు, వ్యక్తిగతమైన ఘనతలు, బూటకపు వీరత్వాలు, అసహజమైన పొందికలు ఏర్పడుతుంటాయి. వాటి తరపున ప్రవక్తలుగా వచ్చిన వారు ప్రచారం పొందుతుంటారు. ఈపరిస్థితులను తట్టుకోవాలంటే ఆనాటి వర్గ సమాజ పరిస్థితినీ, ఉపరితల ప్రభావాలను కూడా సరిగ్గా అంచనా వేసి, అవసరమైన మార్పుల కోసం పోరాడగల చైతన్యం పెంచే కృషికి ప్రథమ ప్రాధాన్యత నివ్వాలి. వాస్తవాలతో నిమిత్తం లేని స్వకీయ, పాక్షిక భావజాలాలు, అతిశయాలు, అవాస్తవ పోకడలను అధిగమించి నిర్ధిష్ట కార్యాచారణకు జనబాహుళ్యాన్ని సన్నద్ధం చేయవలసి వుంటుంది.

గ్రామ్‌స్కీ భావాలుగా చర్చకు వస్తున్న వాటిలో అంతగా వినిపించని కొన్ని అంశాలు కూడా ఈ వ్యాసంలో ప్రస్తావించాను. ఇవన్నీ ఆయన రచనలలోవున్నవే. తను రాసినవాటి లోనూ లోపాలువుండవని కాదు. రాసిన కాలమేచాలా క్లిష్టమైనది. చాలా అంశాలపై ఎంతోలోతుగా చర్చ చేశాడు. మూలభాష ఇటాలియన్‌లో ఇటీవలి వరకూ ఆయన సమగ్ర రచనలే రాలేదు. జైలు అధికారులను తప్పించుకోవడానికి వాడిన భిన్నమైన పదాలు వాటి అనువాదాలు, జటిలంగానే వుంటాయి. ప్రచురించినవారు వాటి పరిమితులను కూడా చెప్పారు. నేను రాసినవాటికి కూడా ఆపరిమితులు తప్పవని మనవి. సమగ్రంగా, సాధికారికంగా తెలుగులో గ్రామ్‌స్కీ రచనలు ప్రచురించవలసిన అవసరం మిగిలే వుంటుంది. రాబోయే కాలంలో ఆ ప్రయత్నం జరుగుతుందని ఆశించాలి,

❋

**ప్రశ్నలు-సమాధానాలు**

# ప్రాంతీయ పార్టీల అవకాశవాదాన్ని అధిగమించి బి.జె.పి మతోన్మాద వ్యతిరేక విశాల ఐక్యతను నిర్మించే అవకాశం పెరిగింది



**బి.వి. రాఘవులు**

**ప్రశ్న: కామ్రేడ్, ప్రస్తుత ఆర్థిక సంక్షోభ కాలంలో ప్రాంతీయ బూర్జువా వర్గానికి, బడా బూర్జువా వర్గానికి మధ్య వైరుధ్యం తిరిగి పెరిగే అవకాశాలేమిటి? 1) బడా కార్పొరేట్ల ప్రయోజనాలకోసం మోడీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రాంతీయ బూర్జువా వర్గానికి నష్టదాయంగా గాని, అభ్యంతరకంగా గాని, కనీసం తమ రాజకీయ పునాది వర్గాలుగా ఉన్న ధనిక రైతాంగం ప్రయోజనాలకు భంగకరంగా కానీ ఉంటున్నాయి. 2) హిందూత్వ ఎజెండా అమలు జరిగే తీరు వలన ప్రాంతీయ అస్థిత్వాలకు నష్టం వాటిల్లుతోంది. 3) జిఎస్‌టి, ఇతర చర్యల వలన రాష్ట్రాల ఆర్థిక వనరులకు నష్టం కలుగుతోంది. పై మూడు కారణాల వలన ప్రాంతీయ, బడా బూర్జువా వర్గాల మధ్య వైరుధ్యాలు ఏ విధంగా పరిణమించనున్నాయి? గతంలో నూతన ఆర్థిక విధానాలు వీటి నడుమ ఉండే వైరుధ్యాన్ని చప్పబరిచాయి. ఇప్పుడు తిరిగి ఆ వైరుధ్యం తీవ్రతరం కానున్నదా? ఐతే అప్పుడు మన వైఖరి ఏ విధంగా ఉండాలి? ఆ వైరుధ్యాన్ని తీవ్రతరం చేయడానికి ప్రస్తుతం మనం ఎటువంటి వైఖరి తీసుకోవాలి? ఈ ప్రశ్నకు మార్క్సిస్టు మాసపత్రికలో సమాధానం ఇస్తే ఉపయోగకరంగా ఉంటుంది.**

**– ఎంవిఎస్ శర్మ**

**జవాబు:** మోడీ నాయకత్వాన బి.జె.పి రెండవ సారి కేంద్రంలో సంపూర్ణ మెజారిటీతో అధికారాన్ని చేపట్టిన తర్వాత దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాలను సమూలంగా మార్చాలన్న ప్రయత్నం చాలా దుడుకుగా ప్రారంభం అయ్యింది. మిగిలి వున్న ప్రభుత్వ రంగాన్ని వదిలించుకోవాలన్న తహతహతో పని ప్రారంభించింది. పారిశ్రామిక, వ్యవసాయ, విద్యా రంగాలను కార్పొరేటు సంస్థలకు పణంగా పెట్టడానికి కొత్త చట్టాలను, విధానాలను రూపొందించింది. పౌరసత్వ చట్టాలను సవరించి మతవాద (హిందూత్వ) రాజకీయ ప్రక్రియకు తెరతీసింది. సమాఖ్య వ్యవస్థను విచ్ఛిన్నం జేస్తూ రాష్ట్రాల ఆర్థిక బలాన్ని, హక్కులను హరించివేస్తున్నది. పౌరహక్కులు, మానవహక్కులను కాలరాస్తూ న్యాయ, ఇతర స్వతంత్ర వ్యవస్థల ప్రతిపత్తిని బలహీనపరుస్తూ, గవర్నర్‌ల వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రజాస్వామ్యాన్ని తొలిచివేస్తూ, నిరంకుశత్వాన్ని పెంచుతున్నది. సంఘపరివారం నినాదాలైన ఒకే మతం, ఒకే జాతి, ఒకే సంస్కృతి అమలుతో పాటు స్వదేశీ, విదేశీ కార్పొరేటు శక్తులు కోరుకుంటున్న ఒకే మార్కెట్టు, ఒకే పన్ను, ఒకే ఎన్నిక వగైరా అంశాల అమలుకు పూనుకున్నది. బడాబూర్జువా వర్గం కార్పొరేట్ శక్తుల (ఇప్పుడు అంబానీ, అదానీల పేర్లతో ఈ వర్గం ప్రాబల్యం పొందింది)కు దేశాన్ని వడ్డించిన విస్తరిగా తీర్చిదిద్దడం మోడీ, బి.జె.పి పాలన లక్ష్యంగా ఇప్పుడు సాగుతున్నది. ఈ సంవత్సర ఆరంభంలో ప్రపంచాన్ని, దేశాన్ని కరోనా విపత్తు ఆవరించింది. దాని ప్రభావంతో అప్పటికే మాంద్యాన్ని ఎదుర్కొంటున్న మన దేశ ఆర్థికవ్యవస్థ మరింత మాంద్యంలోకి జారిపోయింది. దేశం ఎదుర్కొంటున్న ఈ పరిస్థితి ఒక బాధాకర పరిణామమని భావించకుండా మోడీ ప్రభుత్వం ప్రజలు కరోనా భయాందోళనలో సతమతమవుతున్న సందర్భాన్ని కార్పొరేటు శక్తుల కవసరమైన బహుముఖ సంస్కరణలను వేగంగా అమలు జేయడానికి ఒక సదవకాశంగా భావించింది. కరోనా వైరస్ ప్రజలకు కల్గించిన పరిమితులను వినియోగించుకుని ప్రజాస్వామిక పద్ధతులను ప్రక్కన పెట్టి సంస్కరణలను, చట్టాలను ఆగమేఘాల మీద అమలు జేయడానికి పూనుకున్నది.

అయితే మోడి ప్రభుత్వం భావించినట్లు అది తలపెట్టిన వినాశకర సంస్కరణలు ప్రజల నుండి ప్రతిఘటన లేకుండా సాగిపోవడం లేదు. పౌరసత్వ సవరణ చట్టానికి, కార్మిక కోడ్‌లకు, నూతన వ్యవసాయ చట్టాలకు, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు, నూతన విద్యా విధానానికి విస్తృతంగా ప్రతిఘటన ప్రారంభమయింది. తాజా ఉదాహరణ దేశ వ్యాప్తంగా ప్రారంభమయిన రైతాంగ ఉద్యమం. మోడి, బి.జె.పి విధానాల పర్యవసానాలను అన్నింటిని వివరించకుండా ప్రాదేశికతకు పునాదిగా వున్న సమాఖ్య వ్యవస్థపైనా, రాష్ట్రాల హక్కులపైనా అది ఎలా దాడిజేస్తున్నదో, రాజకీయ పరిస్థితులపై వాటి ప్రభావం ఎలా వుందో అన్న అంశాలను క్లుప్తంగా వివరిస్తాను.

హిందుత్వ రాష్ట్ర స్థాపించాలన్న సంఘ పరివార్ ఆశ, దేశీయ కార్పొరేటు పెట్టుబడికి కేంద్రీకృత, ఏకఖండ రాజ్యంగా దేశాన్ని రూపు దిద్దాలన్న కోర్కె – రెండూ ఇప్పుడు మోడీ ప్రభుత్వ రూపంలో ఫెడరల్ వ్యవస్థపైనా, రాష్ట్రాల హక్కులపైనా దాడి జరుగుతున్నది. రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాల పరిధిలో వున్న అంశాలపై వాటి అంగీకారం లేకుండానే కేంద్రం ఏకపక్షంగా చట్టాలను రూపొందిస్తున్నది. కార్మిక కోడ్‌లు, క్రొత్త వ్యవసాయ చట్టాలు, నూతన విద్యా విధానం వంటి అంశాలు రాష్ట్ర పరిధిలోనివైనా, కేంద్రం చట్టాలను చేసింది. జి.ఎస్.టిని ప్రవేశపెట్టి రాష్ట్రాల ఆదాయ మార్గాలపై దెబ్బకొట్టింది. అనేక పథకాలలో కేంద్రం వాటాను తగ్గించుకుని రాష్ట్రాలపై భారం పెంచుతున్నది. కరోనా వలన కుదేలయిన ఆర్థిక పరిస్థితి నుండి బయట పడడానికి రాష్ట్రాలకు తగినంత సహాయం అందించకుండా వేధిస్తున్నది. అప్పుజేసుకోవడానికి కూడా అనుమతి నివ్వకుండా అనేక ప్రజావ్యతిరేక షరతులను విధిస్తున్నది.

రాష్ట్రాలకున్న కొద్దిపాటి స్వయం ప్రతిపత్తిని కూడా ధ్వంసం జేస్తున్నది. 370 అధికరణాన్ని రద్దు జేసి జమ్ముకాశ్మీర్‌ను ముక్కలు జేసి రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించింది. గవర్నర్ వ్యవస్థను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలపై కేంద్రం ఆధిపత్యాన్ని చెలాయిస్తున్నది. ఈ మధ్య మహారాష్ట్ర గవర్నర్, తాజాగా కేరళ గవర్నరులు రాష్ట్ర ప్రభుత్వాల పనికి ఎలా అడ్డం పడ్డారో చూడవచ్చు. బెంగాల్‌లోని ముగ్గురు ఐ.పి.ఎస్ ఆఫీసర్లను రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం లేకుండా కేంద్ర సర్వీస్‌కు మార్చాలని కేంద్రం దురుసుగా వ్యవహరించింది. గతంలో అధ్యక్షతరహా పరిపాలన ప్రతిపాదనను ముందుకు దెచ్చిన బిజెపి ఇప్పుడు జమిలి ఎన్నికలు (పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ఒకేసారి జరపడం) గురించి చర్చకు తెచ్చింది. ఎంతో వైవిధ్యం కల్గిన వివిధ రాష్ట్రాల పరిస్థితిని అణచివేసి దేశం మొత్తాన్ని ఒకే కేంద్రీకృత నిరంకుశ పాలన క్రిందకు తీసుకురావాలన్న కుట్ర ఈ ప్రతిపాదన వెనక దాగివున్నది.

ప్రస్తుతం అమలులో వున్న పార్లమెంటరీ

ప్రజాస్వామ్య పద్ధతిలో అనేక బలహీనతలున్నప్పటికీ, ఉపఖండ స్థాయి కల్గిన మనదేశంలో వైవిధ్య పరిస్థితులు వ్యక్తం కావడానికి కొంత వరకు అవకాశం కల్పిస్తున్నది. అనేక రాష్ట్రాలు, ప్రాంతాలు, భాషలు, మతాలు, కులాలు, తెగలు వగైరా కలిగిన సమాజంలోని వ్యత్యాసాలు, ప్రయోజనాలు వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు, శక్తుల ద్వారా ప్రస్తుతం వ్యక్తం అవుతున్నాయి.

ఈ వైవిధ్యం ప్రజాస్వామిక వ్యవస్థల్లో వ్యక్తం గాకుండా మోడి ప్రభుత్వం ఫెడరలిజం మీద చేస్తున్న దాడి నిరోధిస్తుంది. ఇది తీవ్ర పరిణామాలకు, ముఖ్యంగా దేశ ఐక్యతకు విఘాతం కల్గించే ప్రమాదం వుంది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన సి.ఎ.ఎ మైనారిటీలను అభద్రతాభావానికి గురిజేస్తున్నది. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కొత్త వ్యవసాయ చట్టాలు ధనికరైతులతో సహా రైతాంగానికంతటికి నష్టం జేస్తాయి. మోడీ విధానాలు వేళ్ళ మీద లెక్కపెట్టగలిగిన కార్పొరేటు సంస్థలు మరింత పెద్దవి గావడానికి చిన్న మధ్యతరహా పరిశ్రమలు, వ్యాపారాలు దెబ్బతినడానికి ఉద్దేశించబడ్డాయి. కరోనా విపత్తు ఈ పరిణామాన్ని మరింత వేగవంతం జేసింది. ప్రభుత్వం అమలుజేస్తున్న విద్యుత్తు చట్టం రైతాంగానికి, చిన్న పరిశ్రమలకు గొడ్డలిపెట్టు కానున్నది.

ఫెడరల్ వ్యవస్థపై దాడి చిన్న, మధ్యతరహ వర్గాలపై కూడా ప్రభావం చూపుతున్నాయి. రాష్ట్రాల ప్రయోజనాలకు, ప్రాంతీయ పెట్టుబడిదారుల, ధనిక రైతుల ప్రయోజనాలకు ప్రాతి నిథ్యం వహించే ప్రాంతీయ పార్టీలు సహజంగానే మోడీ విధానాలతో ఆందోళనకు గురవుతున్నాయి. వాటిలో అసంతృప్తి పెరుగుతున్నది. అవకాశం వచ్చినపుడు ఆ అసంతృప్తిని వ్యక్తం జేస్తున్నాయి. ఎన్.డి.ఎకి భాగస్వాములుగా వున్న అకాలీదళ్, శివసేన, ఎల్.జె.పి పార్టీలు ఈ మధ్య కాలంలో బి.జె.పికి దూరమయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్న రైతాంగ ఉద్యమానికి మద్దతు ప్రకటించాయి. బి.జె.పికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఇప్పటి వరకు మద్ధతిస్తున్న టి.ఆర్.ఎస్, వై ఎస్.ఆర్.సి.పిలు డిశంబర్ 8 భారత్‌బంద్‌కు మద్దతు ఇవ్వడం వెనక పరోక్షంగా కేంద్రం పెత్తనంపై అసంతృప్తి వున్నది. టి.ఎమ్.సి, ఎస్.పి, బి.ఎస్.పి, బి.జె.పి, ఎన్.సి.పి వంటి పార్టీలు మోడీ ప్రభుత్వ ఫెడరల్ వ్యతిరేక వైఖరులను గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అయితే ప్రాంతీయ పార్టీల వ్యతిరేకత ఒకే ప్రవాహంగా మారి బి.జె.పి నియంతృత్వ పోకడలను నేరుగా ప్రతిఘటించే స్థాయికి ఇంకా రాలేకపోవడం ఒక బలహీనత. బడాబూర్జువా వర్గ పార్టీ అయిన కాంగ్రెస్, ఇప్పుడు కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలను నిర్వహిస్తు, రాష్ట్రాల హక్కుల గురించి, ఫెడరలిజం గురించి మాట్లాడాల్సి వస్తున్నది. వామపక్షాలు మొదట నుండి ఫెడరలిజానికి గట్టి మద్ధతుదారుగా వున్నాయి.

ప్రస్తుతం ప్రాంతీయ పార్టీలకు బి.జె.పికి మధ్య పెరుగుతున్న వైరుధ్యం ఎప్పుడూ ఒకేరకంగా లేదు. 1960వ దశకంలో దేశంలో అకాలీదళ్, డి.యం.కె మాత్రమే ప్రాంతీయ పార్టీలుగా వుండేవి. 1980, 90 దశకంలో వివిధ రాష్ట్రాలలో ప్రాంతీయ పార్టీలు పెద్ద సంఖ్యలో ఆవిర్భవించాయి. స్వాతంత్ర్యానంతరం పాలకవర్గాలు అనుసరించిన, పారిశ్రామిక వ్యవసాయ విధానాలు (హరిత విప్లవం, ప్రభుత్వరంగం, ఉన్నత విద్య, రిజర్వేషన్లు వగైరా) వివిధ ప్రాంతాలలో ప్రాంతీయ పెట్టుబడిదారులను, గ్రామసీమలలో ఒక బలమైన ధనిక రైతు తరగతిని, వివిధ సామాజిక తరగతుల్లో ప్రభావితమైన మధ్య తరగతిని అభివృద్ధిజేశాయి. ఈ శక్తులు రాజకీయాలలో భాగం సాధించడం ద్వారా స్థానిక వనరులు, అవకాశాలపై తమపట్టు పెంచుకొవడానికి పూనుకున్నాయి. ఆనాడు అధికారంలో వున్న కాంగ్రెస్ ఆధిపత్య ధోరణి, ఏకపార్టీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా ఈ శక్తులు ప్రాంతీయ పార్టీల రూపంలో రాజకీయాల్లో ప్రవేశించాయి. ప్రారంభంలో ఈ ప్రాంతీయ పార్టీలు ఫెడరల్ వ్యవస్థను కాపాడదంలో ఒక ముఖ్య భూమిక పోషించాయి.

1991లో సరళీకరణ విధానాలు ప్రారంభం అయిన తర్వాత ప్రపంచ బ్యాంకు నేరుగా రాష్ట్రాలలో సంస్కరణల అమలు కోసం రుణ ఒప్పందాలు కుదుర్చు కోవడం మొదలు పెట్టిన తర్వాత ప్రాంతీయ బూర్జువా వర్గంలో మార్పు వచ్చింది. కొత్తగా వచ్చిన అవకాశాలను ఉపయోగించు కోవడానికి కేంద్రంతో సానుకూలంగా వ్యవహరించడం అవసరం అని భావించాయి. బడా బూర్జువా వర్గంతో వుండే వైరుధ్యం తీవ్రత తగ్గింది. అలాగే 1980 దశకం నుండి కేంద్ర స్థాయిలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వాలలో ప్రాంతీయ పార్టీలు ముఖ్యపాత్ర నిర్వహించే అవకాశం వచ్చింది. ఈ మారిన పరిస్థితులలో ప్రాంతీయ పార్టీలలో అవకాశవాదం ప్రవేశించింది. విధాన పరమైన ప్రాతిపదిక కాకుండా పార్టీ యొక్క అధికార ప్రయోజనాన్ని బట్టి కేంద్రంలో బి.జె.పితో సహా ఎవరితోనైనా జతకట్టడానికి వెనుకాడటం లేదు. అయితే ఇప్పుడు మోడి నాయకత్వాన బి.జె.పి రెండవసారి అధికారంలోకి రావడంతో పరిస్థితి మారింది. బి.జె.పికి సంపూర్ణ మెజారిటీ వచ్చింది. ప్రభుత్వం మనడానికి ప్రాంతీయ పార్టీల మద్దతు అవసరం లేదు. కార్పొరేటు శక్తులను పెంచడమే దేశాన్ని అభివృద్ధి జేయడంగా నిర్ణయించుకుని సరళీకరణ సంస్కరణలను వేగవంతం జేసింది. ఈ రెండు అంశాలు ప్రాంతీయ బూర్జువా పార్టీలతో ఓపికగా వ్యవహరించాల్సిన అగత్యం బిజెపికి లేకుండా జేశాయి. అందుకే ప్రాంతీయ బూర్జువా పార్టీలకు, బి.జె.పికి మధ్య వైరుధ్యం పెరిగింది.

ఈ పరిస్థితి మతోన్మాద బి.జె.పికి వ్యతిరేకంగా పోరాడడానికి ఒక కొత్త అవకాశాన్ని కల్పిస్తున్నది. సమాఖ్య వ్యవస్థ, రాష్ట్రాల హక్కుల కోసం పోరాటాన్ని ముందుకు తీసుకు రావడం ద్వారా ప్రాంతీయ పార్టీల అవకాశవాదాన్ని అధిగమించి, బి.జె.పి మతో న్మాద వ్యతిరేక శక్తుల విశాల ఐక్యతను నిర్మించే అవకాశం బలపడుతుంది.

# పట్టణ సంస్కరణలు ప్రజావ్యతిరేక అంశాలు

(28వ పేజీ తరువాయి)

సంస్కరణలో భాగంగా సృష్టించారు. అలాగే 1991 తరువాత మనదేశంలో పట్టణసంస్థలు కొత్తగా పాఠశాలలు నిర్మించే బాధ్యత నుండి వైదొలిగాయి. ఉన్న వాటిని కూడా స్వీకారం, ఇతర అనేక పేర్లతో కార్పొరేట్ సంస్థల దయాదాక్షణ్యాలకు వదిలేశారు. కొత్త అర్బన్ హెల్త్‌సెంటర్స్ ఏర్పాటుకు 3 దశాబ్దాల క్రితమే స్వస్తిపిలికి ఉన్నవాటిని కూడా "ఈ-వైద్యం" పేర ప్రైవేట్‌పరం చేశారు. అభివృద్ధిచెందిన దేశాల్లోని రోడ్లు, మంచినీరు సరఫరా, మురుగునీరు నిర్వహణ, చెత్తసేకరణ, వీధిలైట్లు, పార్కులు, సామాజిక కేంద్రాలు, క్రీడా ప్రాంగణాలు తదితర వాటి నిర్వహణకు, పౌరసేవల ప్రమాణాలకు మనదేశంలో ఉన్న వీటికి ఎలాంటి పోలికలేదు. ఈ సౌకర్యాలు మనదేశంలో అత్యంత అధ్వాన్నంగా ఉన్నాయి. ఈ వాస్తవాలను ఉద్దేశ్యపూర్వకంగా పాలకులు విస్మరించి ఆదేశాల పేరు చెప్పి మనదేశంలో భారాలకు, సేవలు, మౌలిక సదుపాయాల ప్రైవేటీకరణకు వొడిగట్టారు.

## తెలంగాణ విప్లవ పోరాటం గుణపాఠాలు - 4

(2వ పేజీ తరువాయి)

16,000 చదరపు మైళ్ళ ప్రాంతంలోని 3,000 గ్రామ పంచాయితీల ఆధ్వర్యంలో గ్రామ రాజ్యాలు స్థాపించబడ్డాయి. భూస్వాములంటే అసహ్యంతో ఉన్న ప్రజలు నిజాం నిరంకుశత్వానికి మూల స్థంభాల వంటి భూస్వాములను ఈ గ్రామాలలోని వారి గఢీల నుండి తరిమి వేశారు. 10 లక్షల ఎకరాల భూస్వాముల భూములను స్వాధీనం చేసుకొని ప్రజాకమిటీల ఆధ్వర్యంలో రైతులకు పంచారు. భూముల నుండి రైతులను తొలగించటం, బలవంతపు వెట్టిచాకిరి నిలిపి వేశారు. అధిక వడ్డీలు నిలిచిపోయాయి లేదా తగ్గించబడ్డాయి. వ్యవసాయ కూలీల దినసరి వేతనం పెరిగింది. కనీసవేతనాలు అమలయ్యాయి. అణచివేతకు గురి చేసిన అటవీ అధికారులు అడవుల నుండి గెంటి వేయబడ్డారు; అక్కడ నివసించే గిరిజనులు, ఆ చుట్టు పక్కల నివసించే ప్రజలు వారి శ్రమకు తగిన విలువను పొందగలిగారు. ఈ ప్రాంతంలోని గ్రామాలు దాదాపు 12 నుండి 18 నెలల పాటు రైతు కమిటీల ఆధ్వర్యంలో నడిచాయి. పోరాట కాలంలో నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా, నిజాం పోలీసులను, రజాకార్లను ఎదిరించడానికి 2,000 మందితో గెరిల్లా దళాలను, 10,000 మందితో గ్రామ దళాలను ఏర్పుచుకున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ చారిత్రాత్మక రైతాంగ తిరుగుబాటు మధ్యయుగాల నాటి నిరంకుశ అసఫ్ జాహి వంశ పాలన పునాదులను కదిలించింది. దానిని చావు దెబ్బ కొట్టింది.

"కాంగ్రెస్ నాయకులకు ఇష్టం లేకపోయినా వ్యవసాయ విప్లవాన్ని ముందుకు తేవాల్సిన పరిస్థితిని కల్పించిన ఘనత ఈ వీరోచిత రైతాంగ ప్రతిఘటనకే దక్కుతుంది. ఎంత తక్కువ స్థాయిలో అయినా, లోపభూయిష్టంగా అయినా, మనసంగికరించక పోయినా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ సంస్కరణలు చేపట్టవలసి వచ్చింది. ఈ పోరాట కాలంలోనే సర్వోదయ నాయకుడు వినోబాభావే 'భూదాన్' అనే ఉహాజనిత ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. రైతాంగంలో కమ్యూనిస్టుల పట్ల వ్యతిరేకతను పెంచడానికి, రైతాంగ ఉద్యమాన్ని నీరుగార్చడానికి కాంగ్రెస్ నాయకులు ఆయనను తీసుకొచ్చారు. బూర్జువా, భూస్వాముల తీయని మాటలతో భూమి పంచబడదని, కేవలం శక్తివంతమైన మిలిటెంట్ ప్రజా పోరాటాల ద్వారా మాత్రమే ప్రజలకు భూమి దక్కుతుందని ఏళ్ల తరబడి జరిగిన ఈ పోరాటం వలననే ప్రజలు తెలుసుకున్నారు.

"భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేయడంలో కూడా తెలంగాణ పోరాటానికి చెప్పుకోదగ్గ పాత్రే ఉన్నదన్న విషయం మనం గమనించాలి. ఈ పోరాటం వలన చిన్నా భిన్నమయిన జాతులను ఒక చోట కూర్చే అవకాశం ఏర్పడింది. భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడాలన్న ప్రజల ప్రజాతంత్ర కోరిక సఫలమైంది. దేశంలో అతి పెద్ద సంస్థానమైన హైదరాబాద్‌పై పెద్ద దెబ్బ వేసిన ఈ పోరాట విజయంతో 1956లో ఆంధ్రరాష్ట్రంతో పాటు మరికొన్ని భాష ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేశారు. ఏ సూత్రబద్ధ వైఖరి లేకుండా ఏకపక్షంగా విభజించబడిన బ్రిటిష్ పాలిత భారతదేశాన్ని బాషా ప్రయుక్త రాష్ట్రాలుగా ఏర్పాటుచేయటం కాంగ్రెస్‌కు తప్పలేదు. భారత దేశ రాజకీయ చిత్రపటం, జాతి, భాషలనే మౌలిక అంశాలను ప్రాతిపదికగా చేసుకుని భాషాప్రయుక్త రాష్ట్రాలను విభజించడంలో వీర తెలంగాణ రైతాంగ పోరాటం ప్రముఖ పాత్ర పోషించింది.

**(అనువాదం: కె ఉషారాణి)**

---

# వ్యవసాయ చట్టాలతో రైతుకు మరణశాసనం

(22వ పేజీ తరువాయి)

తున్నాయి. దీన్ని అరికట్టడానికి స్వామినాథన్ కమిటీ సిఫార్సులు అమలు చేయాలని అన్ని సంఘాలూ కోరుతున్నాయి. కానీ రైతుల్ని బలిపెట్టి వ్యవసాయాన్ని కార్పొరేట్‌పరం చేయడానికి మోడీ సర్కార్ ఈ నల్ల చట్టాలను తెచ్చింది. వాటికి వ్యతిరేకంగా నేడు రైతు నడుంకట్టి కదనరంగంలోకి దిగాడు. అందుకే ఈ చట్టాలను ఉపసంహరించుకొని కొత్త చట్టాలపై చర్చలు చేయాలి. రైతులకు మేలు చేసే గిట్టుబాటుధరల చట్టం, రుణవిమోచన చట్టం చేయాలి. అప్పుడే వ్యవసాయ సంక్షోభానికి పరిష్కారం దొరుకుతుంది. వ్యవసాయం పునాదిగా ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతుంది. అప్పుడే దేశం సూపర్ పవర్ అవుతుంది. రైతుల్ని నాశనం చేసి వ్యవసాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టి దేశాన్ని సూపర్ పవర్‌గా మారుస్తామంటే ఇంకా దేశం దిగజారి పోవడానికే దారి తీస్తుంది. ఈ ఏడాదిలోనే సంక్షోభం ముదిరి మన ఆర్థిక వ్యవస్థ పాతాళంలోకి దిగింది. ఇంకా దిగజారిపోకుండా ఉండాలంటే రైతు వ్యవసాయాన్ని కాపాడాలి. అదే దేశానికి రక్ష?

**ఉద్యమించడమే మార్గం**


రైతాంగం, కౌలురైతులు, వ్యవసాయ కూలీలు నేడు సంక్షోభం సుడిగుండంలో ఉన్నారు. సవాలక్ష సమస్యలతో సతమతమవుతున్నారు. ఉపాధి తగ్గింది. గిట్టుబాటు ధరలు లేవు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు దెబ్బతిన్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్సు రాలేదు. ప్రభుత్వ సహాయమూ సకాలంలో అందడం లేదు. ఈ స్థితిలో అసలు సాగుకే ముప్పు ముంచుకొచ్చింది. ఈ చట్టాలను తిప్పికొడితేనే మన సమస్యలను కూడా సులభంగా సాధించుకోగలం. ఈ పోరాటంలో వస్తున్న ఐక్యతతో మున్ముందు మనం తక్షణం పీడిస్తున్న సమస్యల సాధనకు ఉద్యమిద్దాం.

దేశ చరిత్రలో నేడు జరుగుతున్న రైతాంగ ఉద్యమం కొత్త అధ్యాయాన్ని సృష్టించింది. అపూర్వమైన ఐక్యత. విశాల వేదికలు. కార్మిక కర్షక ఐక్యత. రాజకీయ పార్టీలకే పాఠాలు నేర్పుతున్న ఉద్యమమిది. పార్టీలు, పంతాలు, కులాలు, మతాలు పక్కన పెట్టి పంజాబు, హర్యానా వంటి రాష్ట్రాల్లో రైతులొక్కటయ్యారు. వారికి ఇతర వర్గాల ప్రజలు మద్దతు తెలుపుతున్నారు. మన రాష్ట్రంలోనూ ఇదే మార్గాన్ని అనుసరించాలి. గ్రామ గ్రామానికి ఉద్యమాన్ని విస్తరించాలి. రైతులంతా కలసి కమిటీలు పెట్టుకోవాలి. నల్ల చట్టాల రద్దుకోసం శంఖారావం పూరించాలి. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో అంతా ఒక్కటై ఈ నల్ల చట్టాలను తిప్పి కొట్టాలి.

**1. దేశాన్ని నాశనం చేసే మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకోవాలి**
**2. విద్యుత్ మీటర్లు పెట్టి భారాన్ని పెంచే విద్యుత్ బిల్లు2020 చట్టాన్ని ఉపసంహరించ ఎకోవాలి.**
**3. గిట్టుబాటు ధరల గ్యారంటీ చట్టం చేయాలి**
**4. రుణ విమోచన చట్టం తీసుకురావాలి.**
**5. గ్రామగ్రామాన రైతు ఉద్యమానికి మద్దతుగా దీక్షా శిబిరాలు నిర్వహించండి**
**6. పార్టీలు, కులాల కతీతంగా రైతు, కూలీలంతా ఐక్యం కావాలి**
**7. రైతు ఉద్యమంపై కేంద్ర ప్రభుత్వ తప్పుడు ప్రచారాన్ని ఖండించండి**

RNI Reg. No. APTEL/2006/17554 Posted on 05-01-2021 (36 pages) Postal Regd. No D/VJ/172/2021-23

# పెట్టుబడిదారీ కవచం పగలాల్సిందే!



**– నికొలాయ్ బుఖారిన్**

చరిత్ర వైరుధాలపై నడుస్తుంది. చారిత్రక మనుగడకు చట్రం వంటిదైన సామాజిక ఆర్థిక నిర్మాణం కూడా వైరుధ్యాలమీదనే నడుస్తుంది. ఒక రూపం స్థానంలో మరో రూపం నిరంతరాయంగా వస్తూనే ఉంటాయి. ఈ క్రమంలో ప్రతిదీ ఒక మధ్యస్త రూపంగా మాత్రమే ఉంటుంది. జీవిత చలన శక్తి నిరంతరం కొత్తదాన్ని... మళ్లీ కొత్తదాన్ని సృష్టిస్తూ పోతుంది. వాస్తవ ప్రపంచంలో అంతర్గత సూత్రం అది.......

....ప్రస్తుత సమాజంలో ఉత్పత్తి శక్తులు విపరీతంగా పెరుగుతున్నాయి. కొత్త కొత్త రంగాలను జయిస్తున్నాయి. ప్రకృతి ఏనాడూ లేని విధంగా మనిషికి లోబడిపోతోంది. చివరికి అది పెట్టుబడిదారీ ఉడుంపట్టుకింద ఊపిరాడక ఉక్కిరిబిక్కిరవుతోంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో అంతర్గతంగా దాగి ఉన్న వైరుధ్యాలు, –దాని పుట్టుకనాడు పిండప్రాయంలో ఉన్న వైరుధ్యాలు– పెట్టుబడిదారీ వ్యవస్థతో పాటే పెరుగుతున్నాయి. విస్తృతమవుతున్నాయి. సామ్రాజ్యవాద దశలో ఈ వైరుధ్యాలు మరింత తీవ్ర స్థాయికి పెరిగాయి. ఈనాడు పెరిగిన ఉత్పత్తి శక్తుల పరిమాణం ప్రస్తుత ఉత్పత్తి సంబంధాల్లో ఒదగలేక కొత్త సంబంధాలను కోరుతున్నాయి. పెట్టుబడిదారీ కవచం భళ్లున పగలాల్సిందే.

ఫైనాన్స్ పెట్టుబడి యుగంలో పెట్టుబడిదారీ వ్యవస్థలోని లోపాలన్నీ నగ్నంగా కనిపిస్తున్నాయి. పాత కాలంలో, అంటే పెట్టుబడిదారీ వ్యవస్థా, దాని వర్గాధిపతులైన పెట్టుబడిదారులూ పురోగామి శక్తులుగా కనిపించిన పాత రోజుల్లో అది తనకన్నా ముందున్న పాత వ్యవస్థలతో పోల్చడం ద్వారా తనలోని లోపాలను కప్పిపుచ్చుకునేది. పెద్ద పెద్ద యంత్రాలతో కూడిన విస్తారమైన పెట్టుబడిదారీ ఉత్పత్తి తన కన్నా తక్కువ నైపుణ్యం గలిగిన చేతివృత్తులను అణచిపారేసింది. పెట్టుబడిదారీ పూర్వ ఉత్పత్తి రూపాలు ఆ విధంగా బాధాకరమైన రీతిలో నాశనమైనాయి. అదే సమయంలో ఈ పాత వ్యవస్థ తాలూకూ రూపాలే పెట్టుబడిదారీ వ్యవస్థ శైశవ దశలో తన నిజరూపాన్ని కప్పిపుచ్చుకోడానికి కూడా తోడ్పడినాయి. అందువల్లనే పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నిజరూపం అది పూర్తిగా అభివృద్ధి చెందినాక, ఇంకో మాటలో చెప్పాలంటే అది ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థగా అభివృద్ధి చెందినాక మాత్రమే బయటకు స్పష్టంగా కనిపించింది. అందువల్లనే ఇప్పుడు పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క అంతర్గత వైరుధ్యాలు స్పష్టమైన రీతిలో గోచరమవుతున్నాయి. నేటి పెట్టుబడిదారీ ప్రపంచంలోని ఈ సంక్షోభం, ఈ రక్తపాతం, ఈ బాధలు.. ఇవన్నీ పెట్టుబడిదారీ వ్యవస్థలోని ఈ వైరుధ్యాల వ్యక్తీకరణే. చివరికి ఈ వైరుధ్యాల మూలంగా పెట్టుబడిదారీ వ్యవస్థే పగిలిపోతుంది.

......

పెట్టుబడిదారీ వ్యవసస్థ సైనికతత్వపు శక్తిని విపరీతంగా పెంచింది. అనేక లక్షల మంది ప్రజలను అది వీరసైనికులుగా మార్చింది. కాని అవే ఆయుధాలు పెట్టుబడిదారీ వ్యవస్థకే ఎదురుతిరిగాయి. ప్రజాబాహుళ్యం రాజకీయంగా చైతన్యవంతమైంది. మామూలుగా లొంగి, స్తబ్దుగా ఉండే గళాలు మరింత హెచ్చుగా వినిపించడం ప్రారంభించాయి.... పెట్టుబడిదారీ వ్యవస్థ ఉత్పత్తి కేంద్రీకరణను ఉచ్ఛస్థాయికి తీసుకుపోవడం ద్వారా, కేంద్రీకృత ఉత్పత్తి యంత్రాంగాన్ని సృష్టించడం ద్వారా ఒక కొత్త లక్షణాన్ని, అంటే తన సమాధిని తనే తవ్వుకునే లక్షణాన్ని సంతరించుకున్నది. ఈ వర్గశక్తుల మహా పోరాటంలో ఫైనాన్స్ పెట్టుబడి యొక్క నియంతృత్వం నాశనమై దాని స్థానంలో విప్లవ కార్మికవర్గ నియంతృత్వం వస్తుంది. “పెట్టుబడిదారీ ఆస్థికి కాలం చెల్లుతోంది, దోపిడీదారులు దోచుకున్నది తిరిగి ప్రజలకు చేరుతుంది.”

**(నికొలాయ్ బుఖారిన్ (1888–1938) రష్యన్ బోల్షివిక్ పార్టీ సైద్ధాంతికవేత్తల్లో ఒకరు. రష్యన్ కమ్యూనిస్టు పార్టీ ఆర్థికవిధాన రూపశిల్పి. 1915–17లో ఆయన రాసిన “సామ్రాజ్యవాదం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ” అన్న గ్రంథం నుండి ఈ వాక్యాలు సేకరించబడ్డాయి. ఈ గ్రంథానికి లెనిన్ ముందుమాట రాశారు.)**

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed and Published at Prajasakti Printers & Publishers private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 9490098977, 9494101091.
Editor : S. Venkatarao, RNI Reg.No. APTEL/2006/17554. Vol.15, No.7. Published on January 1, 2021